
అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

గురువారం 06-02-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 348 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల: 6.50



వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషిచేస్తాం

ప్రజాఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం

స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ | వామపక్ష పార్టీలున్న చోట పరస్పర సహకారం | మోడీ సర్కార్‌ది ముమ్మాటికీ పేదల వ్యతిరేక బడ్జెట్

ఉచిత విద్య, వైద్యాన్ని మేం కోరుకుంటుంటే వాళ్లు కార్పొరేటీకరిస్తున్నారు

ధనం, మద్యం ప్రలోభ రాజకీయాలను తిప్పికొడతాం : టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే మీట్ ది మీడియాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వివరాలు 3లో

ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొస్తాం



ఢిల్లీ కింగ్ ఎవరు..?

- అసెంబ్లీ ఎన్నికల్లో 57.70 శాతం పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకూ 57.70 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా ...11లో



హెచ్1బీ ఆటోరెన్యూవల్ రద్దు

ఇండియన్స్‌కు మరిన్ని కష్టాలు

శ్వేతసౌధం: అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న విదేశీయులకు మరో భారీ షాక్ ఎదురయ్యే ముప్పు పొంచిఉంది. హెచ్-1బీ, ఎల్-1 వీసాలను ఆటోరెన్యూవల్ చేసుకోవడానికి ఉన్న అవకాశాన్ని రద్దు చేయాలని ఇద్దరు రిపబ్లికన్ సెనెటర్లు తీర్మానం ప్రవేశపెట్టారు. వర్క్ వీసాలకు ఆటోరెన్యూవల్ అనేది ఇమ్మిగ్రేషన్ అమలుకు అత్యంత ప్రమాదకరమైందన్నారు. హెచ్-1బీ, ఎల్-1 వీసాల గడువును పొడిగింపును పెంచుతూ బైడెన్ సర్కారు నిర్ణయం తీసుకొంది. గతంలో ఇది కేవలం 180 రోజులు ఉండగా.. గత సర్కారు 540 రోజులకు పెంచింది. ఈ నేపథ్యంలో ట్రంప్ కఠిన వలసల నియంత్రణ, కఠిన వీసా రూల్స్‌కు ఇది అడ్డంకిగా మారుతుందని సెనెటర్లు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో బైడెన్ నిర్ణయాన్ని రద్దు చేయాలని ఇద్దరు తీర్మానం కూడా ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వ నిబంధనను 13 జనవరి 2025న డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఫైనల్ చేసింది. ఇది వలస దారులు, శరణార్థులు, గ్రీన్‌కార్డ్ దారులు, హెచ్-1బీ, ఎల్-1 వీసా దారుల భార్యలపై ప్రభావం చూపింది. భారీ సంఖ్యలో వర్క్ వీసాలపై పనిచేస్తున్న భారతీయులు లబ్దిపొందారు. సెనెటర్లు జాన్‌కెన్నడీ, రిక్ స్కాట్‌లు కాంగ్రెస్ రివ్యూ యాక్ట్ కింద జనవరి 31న బైడెన్ నిర్ణయం రద్దు తీర్మానం ప్రతి పాదించారు. నాడు కెన్నడీ మాట్లాడుతూ గత సర్కారు నిర్ణయం ప్రమాదకరమైందన్నారు.

"బైడెన్ కార్యవర్గం వర్క్‌పర్మిట్స్‌ను ఆటోమేటిక్‌గా 540 రోజులు పొడిగించేలా నిబంధన తీసు కొచ్చింది. ఇది ఇమ్మిగ్రేషన్ చట్టాల అమలును దెబ్బతీస్తుంది. అమెరికా భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది" అని కెన్నడీ వ్యాఖ్యానించారు.

గాజాను స్వాధీనం చేసుకుంటాం

ఇజ్రాయెల్ ప్రధానితో భేటీ అనంతరం ట్రంప్ వివాదాస్పద ప్రకటన 11లో



జాబ్ కార్డుల జారీ బంద్

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' షురూ కాగానే ఆగిన వైనం

ఆన్‌లైన్‌లో లాక్ చేసిన సర్కార్

కొత్త దరఖాస్తులకు బ్రేక్

పెరిగిన పనిదినాల డిమాండ్

పల్లెల్లో పనుల్లేవ్!

పట్టణ పేదలు ఏం పాపం చేశారు..?

"తెల్లకాగితంపై దరఖాస్తు చేసిన 15 రోజుల్లోపే వెరిఫికేషన్ పూర్తి చేయాలి. ధృవీకరణ పూర్తవ్వగానే అర్హులైన వారికి గ్రామ పంచాయతీ ఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్‌కార్డు జారీ చేయాలి. ఏడాదిలో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వీలుండేది" ఇదంతా గతం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం షురూ కాగానే ఉపాధి హామీ చట్టంలో జాబ్‌కార్డుల జారీని బంద్ చేశారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వం లాక్ చేయించింది. పల్లెల్లో జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేస్తే తీసుకోవట్లేదు. భూమిలేని పేదలు పని దినాలు చూపాలని అడిగితే ఇప్పుడేం పనుల్లేవని చెబుతున్నారు. దీంతో జాబ్‌కార్డు, పని కోసం పేదలు తిరుగుతున్నారు. మున్సిపాలిటీల్లో కలిపిన పల్లె పేదలూ తమకు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జాతీయ ఉపాధి హామీ చట్టం అమల్లో భాగంగా శారీరకంగా శ్రమ చేసేందుకు ఆసక్తి ఉన్న వయోజనులకు విధిగా జాబ్‌కార్డు జారీ చేయాలి. తెల్లకాగితంపై దరఖాస్తు చేసిన 15 రోజుల్లో విచారించి అర్హులకు జాబ్‌కార్డు అందజేయాలి. ఇది గ్రామ పంచాయతీ పరిధిలో నిరంతరం జరిగే ప్రక్రియగా కొనసాగాలి. ఆధార్, ఓటర్ ఐడీ, బ్యాంకు బుక్, రేషన్‌కార్డు, పాస్‌ఫొటోలు ఇస్తే చాలు వెంటనే జాబ్‌కార్డులిస్తారు. ఆ జాబ్‌కార్డును చూపితే ఐదు కిలో మీటర్ల పరిధిలో ఎక్కడైనా ఉపాధి హామీ పని పొందొచ్చు. ఇదంతా ఇప్పటి వరకు సాగిన ప్రక్రియ మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట భూమిలేని గ్రామీణ పేదలు ఉపాధి హామీలో కనీసం 20 రోజుల పాటు పని చేసినట్టయితే వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామంటుంది. ఇప్పటికే రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రంలో 563 గ్రామాల్లో లబ్దిదారుల ఖాతాల్లో రూ.6 వేల చొప్పున తొలి విడత పేమెంట్ జమ చేశారు. అప్పటి నుంచి రాష్ట్రంలో కొత్తగా జాబ్‌కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం బంద్ చేసింది. కొత్తగా ఎవరికీ ఉపాధి హామీ జాబ్‌కార్డులివ్వకుండా ఆన్‌లైన్‌లోనే ...2లో

పనుల కోసం కూలీల డిమాండ్

ఈజీఎస్‌లో పని కోసం కూలీలు డిమాండ్ చేస్తున్నారు. రబీ సీజన్ వ్యవసాయ పనులు పూర్తయ్యాయి. వరి కోతల వరకు ఎలాంటి పనులుండవు. దాంతో జాబ్‌కార్డు దారులంతా పని చూపాలంటున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ పథకంలో కనీసం 20 రోజులు పని చేయాల్సి ఉన్నందున కార్డు ఉండి పనిచేయని వాళ్లంతా పనులు చూపాలని కోరుతున్నారు.

జాబ్ కార్డులిచ్చి పనులు చూపాలి

గొల్లపల్లి జయరాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలందరికీ ఉపాధి జాబ్‌కార్డులివ్వాలి. గతం మాదిరే జాబ్‌కార్డుల జారీ నిరంతరం కొనసాగాలి. ఉపాధి పనుల కోసం అడిగిన వారందరికీ పని కల్పించాలి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సాయం చేయాల్సి వస్తదని ప్రభుత్వం జాబ్‌కార్డులివ్వకుండా పని చూపకుండా అడ్డుకోవడం సరికాదు. రికార్డుల ఆధారంగా కాకుండా క్షేత్ర స్థాయిలో విచారించి నిజమైన అర్హులందరికీ రూ.12 వేలివ్వాలి.



క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా

అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అండర్-19 మహిళా టీ20 క్రికెట్ వరల్డ్ కప్‌లో రాణించిన భద్రాచలానికి చెందిన క్రికెటర్ గొంగడి త్రిషను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను త్రిష మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సీఎం ఆమెన శాలువాతో సత్కరించి రూ..కోటి నజరానాను ప్రకటించారు. భవిష్యత్‌లో భారత్ తరపున మరిన్ని టోర్నీల్లో పాల్గొని ఆడాలని సీఎం ఆకాంక్షించారు. టీ20 ప్రపంచకప్ సభ్యురాలైన ధృతి కేసరితో పాటు టీమ్ హెడ్‌కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10లక్షల చొప్పున నజరానాను సీఎం రేవంత్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ క్రీడా చైర్మెన్ శివ సేనారెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి షహనవాజ్ ఖాసీం, సోని బాలా దేవి తదితరులు పాల్గొన్నారు.

17.03 లక్షల మందికి లబ్ది

రైతు భరోసాపై మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బుధవారం నుంచి ఎకరా వరకు సాగులో ఉన్న భూములకు రైతుభరోసా జమ చేయడం ప్రారంభమైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వెల్లడించారు. 17.03 లక్షల మంది రైతుల అకౌంట్లలో డబ్బులు జమ కానున్నట్టు తెలిపారు. ఈ నిధులను నిర్ణీత కాల వ్యవధిలో చెల్లించుటకు రేవంత్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్టు మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.1126.54 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఇప్పటికే రైతుబంధుకు రూ. 7625 కోట్లు, రుణమాఫీకి రూ.20,616.89 కోట్లు, రైతు బీమాకు రూ.3000 కోట్లు విడుదల చేసినట్టు పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. రూ. 14,893 కోట్లతో 20,11,954 మెట్రిక్ టన్నుల పత్తిని మద్దతు ధరకు సేకరించినట్టు వివరించారు. పత్తి పంటను పూర్తిగా సేకరించేందుకు గడువు కోరామని తెలిపారు. రూ.406.24 కోట్లతో సోయాబీన్, పెసర్లు, కందులను మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద నుంచి మద్దతు ధరకు కొనుగోలు ...10లో

కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకూ పోరాడుదాం



ధర్నాలో రైతు, కార్మిక సంఘాల నాయకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకూ ఐక్యంగా ఉద్యమిద్దామని రైతు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల జాతీయ పిలుపులో భాగంగా కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ దేశవ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో జరిగే నిరసనల్లో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించాలనీ, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మొద్దనీ, ఎరువులకు ఇస్తున్న ...11లో



టెట్‌లో తగ్గిన ఉత్తీర్ణత

పేపర్-1లో 59.48 శాతం, పేపర్-2లో 31.21 శాతం అర్హత

గతసారి కంటే పేపర్-1లో 7.65 శాతం, పేపర్-2లో 2.97 శాతం మంది తగ్గుదల

ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా 10లో



దశాబ్దాల ఎదురుచూపులకు తెరదించాం | డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కులగణన, ఎస్సీ వర్గీకరణపై ప్రజలు దశాబ్దాలుగా చూస్తున్న ఎదురు చూపులకు తెరదించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గతంలో ...10లో

కులగణన సర్వే తప్పులతడక

- శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ, శాసన మండలిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుల గణన సర్వే తప్పులతడకగా ఉందని శాసన మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి విమర్శించారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ...11లో

'రక్షణ'కే అధిక నిధులు

నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం | సిబ్బంది, మౌలిక వసతుల కొరత

విద్య, ఆరోగ్య రంగాలను పట్టించుకోని మోడీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు ఈ బడ్జెట్‌ను ఎంతో గొప్పగా అభివర్ణిస్తున్నప్పటికీ గణాంకాలను లోతుగా పరిశీలిస్తే కీలకమైన అంశాలు వెలుగు చూస్తున్నాయి. గత పది సంవత్సరాల కాలంలో భారత రక్షణ బడ్జెట్ రెట్టింపు అయింది. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో కేటాయింపులు రూ.6.8 లక్షల కోట్లు దాటాయి. అయినప్పటికీ రక్షణ సిబ్బందిలో అసంతృప్తి కన్పిస్తూనే ఉంది. దానికి కారణాలు అనేకం. ఆయుధాలు కొనుగోలు చేస్తున్నప్పటికీ అవి ఆలస్యంగా చేరుతున్నాయి. కీలకమైన ఆధునీకరణ ప్రాజెక్టులు సంవత్సరాల తరబడి నత్తనడక నడుస్తున్నాయి. బడ్జెట్‌లో సుమారు నాలుగో వంతు పెన్షన్లకే పోతోంది. రికార్డు స్థాయిలో ఖర్చు చేస్తున్నా సైన్యాన్ని నిస్తేజం వీడడం లేదు.

రక్షణ రంగానికి చేస్తున్న అధిక కేటాయింపుల కారణంగా విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాలు దెబ్బతింటున్నాయి. వీటిని పాలకులు నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. దేశంలోని అనేక పాఠశాలలు నిధుల కొరతతో కూనారిల్లిపోతున్నాయి. చాలా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సైతం లేవు. ఆందోళన కలిగించే విషయమేమంటే విద్యార్థుల్లో ఆత్మహత్యల రేటు అన్నదాతల ఆత్మహత్యల రేటును దాటిపోయింది.



విద్యా రంగంపై పడుతున్న ఒత్తిడిదానిని నిర్లక్ష్యం చేస్తున్న తీరుకు ఇది అద్దం పడుతోంది. ఆరోగ్య రంగం పనితీరు కూడా ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. దేశ జనాభా ప్రకారం చూస్తే ఆస్పత్రుల్లో ఇంకా 24 లక్షల పడకలు అవసరమవుతాయి. అంటే లక్షలాది మందికి అవసరమైన వైద్య సేవలు అందడం లేదు.

విద్యా రంగంపై అలసత్వం

దేశ సరిహద్దులను పటిష్టపరచడం అవసరమే. అయితే కీలక రంగాల విషయంలోనూ ప్రభుత్వం తగినంత శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఉంది. విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు అరకొరగానే ఉంటున్నాయి. గత సంవత్సరం విద్యపై ప్రభుత్వ వ్యయం జీడీపీలో కేవలం 2.9 శాతంగా మాత్రమే ఉంది. కోఠారీ కమిషన్ సిఫార్సు చేసిన ఆరు శాతం కంటే ఇది చాలా తక్కువ. 2015-16 నుండి నిధుల కేటాయింపు పెరిగినప్పటికీ విద్యా రంగం తీవ్రమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటూనే ఉంది. ముఖ్యంగా అర్హత కలిగిన అధ్యాపకుల కొరత అధికంగా ఉంది. దేశంలో 12 లక్షలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలల్లోని తరగతి గదులు విద్యార్థులతో కిక్కిరిసిపోతున్నాయి. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల దామాషా 50:1 దాటిపోయింది. అన్నింటి కంటే దారుణమైన విషయమేమంటే ప్రభుత్వం నియమించిన ఉపాధ్యాయుల్లో 40 శాతం మందికి తగిన అర్హతలు లేవు. ఫలితంగా విద్యార్థుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం ...11లో

పెన్షన్లకే సరి

గత దశాబ్ద కాలంలో రక్షణ రంగానికి కేటాయింపులు ఏకంగా 152 శాతం పెరిగాయి. 2015-16లో రూ.2.46 లక్షల కోట్లుగా ఉన్న రక్షణ బడ్జెట్ 2025-26లో రూ.6.8 లక్షల కోట్లకు చేరింది. అయితే ఇక్కడ ఓ కీలక అంశాన్ని గమనించాల్సి ఉంది. 2020-21లో రక్షణ రంగానికి రూ.3.37 లక్షల కోట్లు కేటాయించగా అందులో సుమారు రూ.1.34 లక్షల కోట్లు (29 శాతం) పెన్షన్లకే పోయాయి. బడ్జెట్‌లో అధిక భాగం ఆధునీకరణ, సేకరణ, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు కావడం లేదని దీనిని బట్టి అర్థమవుతోంది.

విద్యార్థుల ఉసురు తీస్తున్నారు

విద్యా వ్యవస్థలో లోపాలు అనేక రూపాలుగా కన్పిస్తున్నాయి. యువత అత్యధిక సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకుంటున్న దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. 2020 లో ప్రతి 42 నిమిషాలకు ఒక విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆ ఏడాది 11,396 మంది విద్యార్థులు బలవంతంగా తనువు చాలించారు. ఒత్తిడి, తల్లిదండ్రుల ఆకాంక్షలు, ఆందోళన... ఇవన్నీ వారి ఉసురు తీశాయి. అయినప్పటికీ విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన విద్యా సంస్థలు ఆ పని చేయడం లేదు. బడ్జెట్ కేటాయింపుల్లో అసమానతలు, వైరుధ్యాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో విద్యా రంగం లేదు. ప్రతి సంవత్సరం రక్షణ బడ్జెట్ నిలకడగా పెరుగుతూనే ఉంది. విద్య మాత్రం వెనక్కి పోతోంది.



మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ - ముషీరాబాద్

అసమానతలు, శ్రామికుల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా.. ఆత్మగౌరవం, సామాజిక న్యాయ సాధన కోసం లాల్, నీల్ శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల, శ్రామికుల, దళితుల మధ్య అనైక్యత రాకుండా విశాల ఐక్యత దృక్పథంతో సంఘటిత ఉద్యమం చేపట్టాలన్నారు. కావాల్సిన భూమి, వనరులు, బడ్జెట్‌లను సాధించుకోవాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో దళితులకు కనీసం 5శాతం నిధులు కేటాయించలేదన్నారు. అంబేద్కర్, రాజ్యాంగం మూలంగానే ప్రధాని కాగలిగానని చెబుతున్న మోడీ.. కొందరు అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నా నోరు మెదపడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అణగారిన వర్గాల అంతిమ లక్ష్య సాధనకు.. మార్క్స్, పూలే, అంబేద్కర్ ఆశయ సాధన కోసం పాటుపడాలన్నారు. అనంతరం జాన్‌వెస్లీకి డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, సీనియర్ దళిత నేత జేబీ రాజు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, జాతీయ అంబేద్కర్ సంస్థ నేత ఎం.నర్సింగరావు, ప్రొఫెసర్ తద్క యాదగిరి, టీపీఎస్‌కే ప్రతినిధి రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు వెంకట్రాములు, ప్రసాద్, పద్మ, డీబీఎఫ్ నేతలు పి.శంకర్, డి.సంజీవ్, పులి కల్పన, మెట్ల శంకర్, చుంచు రాజేందర్, దాసరి ఎగొండ స్వామి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ప్రజాసంఘాల నిరసన

- దిష్టిబొమ్మలు, బడ్జెట్ ప్రతుల దహనం

నవతెలంగాణ- విలేకరులు



కేంద్ర బడ్జెట్ ప్రజావ్యతిరేకంగా ఉందని, గ్రామీణ అభివృద్ధికి తీవ్ర అన్యాయం చేశారని, రైతులకు కనీస మద్దతు ధర, రుణమాఫీ లేకుండా ఉందని ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు, బడ్జెట్ ప్రతులను దహనం చేశాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ధ్వర్యంలో నిరసన తెలిపారు. కుమురం భీం-ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.మ సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖమ్మం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. బడ్జెట్ పత్రులు దహనం చేశారు. తల్లాడ, పెనుబల్లిలో బడ్జెట్ పత్రులు దహనం చేశారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ కమలానగర్‌లో, మల్కాజిగిరిలో నిరసన ర్యాలీలు తీశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మేడ్చల్ ఆర్టీసీ బస్సు డిపో నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉప్పల్‌రింగ్ రోడ్డులో నిరసన చేపట్టారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి మండల ఆఫీసు వద్ద నిరసన తెలిపారు. కుత్బుల్లాపూర్ మండలం షాపూర్‌నగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజా శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యూసుఫ్, పాల్గొన్నారు. కూకట్‌పల్లిలోని వై జంక్షన్‌లో ఆశాలు, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

- వార్డెన్ నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆందోళన
- జయశంకర్ జిల్లా మొగుళ్లపల్లి ఎస్సీ హాస్టల్లో ఘటన


(ఫైల్)

నవతెలంగాణ-మొగుళ్లపల్లి

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి విద్యార్థి మృతిచెందిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలకేంద్రంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకుమట్ల మండలం పంగిడిపల్లె గ్రామానికి చెందిన పురాణం సంతోష్(14) మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మరో స్నేహితునితో కలిసి మండల శివారులోని చలి వాగులోకి స్నానం చేయడానికి ఈతకు వెళ్లారు. లోతు ప్రదేశంకు వెళ్లేసరికి ఈత రాక నీట మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వార్డెన్ నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయాడని హాస్టల్ ముందు విద్యార్థి మృతదేహంతో ఆందోళన చేపట్టారు. చిట్యాల సీఐ మల్లేష్, ఎస్ఐ అశోక్ వారికి నచ్చ చెప్పి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతేడాది వరదలు వచ్చిన సమయంలో కొడుకును కాపాడబోయి తండ్రి చనిపోతే నేడు కొడుకు నీట మునిగి మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. కాగా ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సంతోష్ మృతి చెందాడని, ఇందుకు కారణమైన అధికారులు, హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకొని ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డీఎస్పీ మండల అధ్యక్షులు దూడపాక రాజు, ఉపాధ్యక్షులు బండారి కుమార్ డిమాండ్ చేశారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ దక్కేవరకు పోరాటం

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ దక్కేవరకు పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉపకులాల మధ్య చిచ్చు రగిలించే ప్రయత్నం చేశారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా అసెంబ్లీలో ఎదిగిన కులాలకే న్యాయం జరిగిందని తెలిపారు. డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు ఎస్సీ వర్గీకరణ చేయకుండా 20 ఏండ్లు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, ఇతర ప్రభుత్వ పథకాల్లో వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కూలిన 'కార్మిక సౌధం'!

- చెదిరిన 'బిల్ట్' కూలీ జీవితం
- కార్మికులు మరణించినా.. ఇంకా అందని సాయం
- కమలాపురంలో నూతన ప్రాజెక్టు చేపట్టాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-మంగపేట

మూడు దశాబ్దాల వెలుగు అంతరించిపోయింది. వేల కార్మికుల ఆశలు ఆవిరైపోయాయి. మారుమూల పల్లెకు పట్టణం కళ తెచ్చిన ఆ కట్టడం నేడు నేల మట్టమైంది. వేలమంది జీవితాలను నిర్మించిన ఆ కార్మిక సౌధం కూలింది. ఉపాధి కేంద్రంగా నిత్య వసంతంలా వెలుగు వెలిగిన ఆ గ్రామం నేడు ఎండమావిగా ఎడారిలో మోడుగా మారి తన ఆనవాళ్లను కోల్పోయింది. ములుగు ప్రాంతం ప్రత్యేక జిల్లాగా ఏర్పడక ముందు నుంచి రాష్ట్ర ప్రజలకు సుపరిచితమవడానికి, ఈ జిల్లాలోని మారుమూల అటవీ గ్రామాలకు నాడే అంతో ఇంతో రహదారులు నిర్మించడానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రధాన కారణం బిల్ట్ కర్మాగారమే. ఎందరికో ఉపాధి మార్గాలను చూపించి నేడు తన ఉనికి లేకుండా కనుమరుగైన 'బిల్ట్' కర్మాగారంపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

మంగపేట మండలం కమలాపురం గ్రామంలో ఏపీ రేయాన్స్ బిల్ట్ కర్మాగారం నిర్మాణం 1975లో ప్రారంభమై 1979లో పూర్తి చేసుకుంది. 1981 నుంచి ఉత్పత్తి ప్రారంభమై ఈ ప్రాంత ప్రజలకే కాక నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చిన ఎంతోమందికి ప్రధాన ఉపాధి కేంద్రంగా మారింది. ఈ కర్మాగారంలో ఉత్పత్తి అయిన పల్పుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో మూడు దశాబ్దాల పాటు తిరుగులేకుండా ముందుకు సాగింది. ఈ దశలోనే బిల్ట్ యాజమాన్యం తమ అవసరాలకు అనుగుణంగా 680మంది రెగ్యులర్ కార్మికులతో పాటు 40మంది క్లరికల్ స్టాఫ్‌ను కూడా నియమించుకుంది. వీరితోపాటు 534 మంది కాంట్రాక్టు కార్మికులు, మరో 300 నుంచి 500 మంది నాన్ పీఎఫ్ కార్మికులను నియమించుకుంది. వీరు కాకుండా పరోక్షంగా ఈ ప్రాంతంలోని డ్రైవర్లకు, హోటళ్లకు, షాపులకు ఇలా వేలాదిమందికి ఉపాధినిచ్చింది.

కమలాపురంలో మరో నూతన యూనిట్‌ను కూడా యాజమాన్యం నిర్మిస్తోందని ప్రచారం కూడా భారీగానే జరిగింది. 2011 మే 16వ తేదీన నాటి బిల్ట్ డీజీఎం రామకృష్ణ తన చాంబర్‌లోనే ఎన్‌కౌంటర్ కావడంతో క్రమంగా అంతర్జాతీయ మార్కెట్‌లో వచ్చిన మార్పులను సాకుగా చూపెడుతూ యాజమాన్యం బిల్ట్ కర్మాగారాన్ని షట్‌డౌన్ వైపుగా తీసుకువెళ్ళింది. 2014 ఏప్రిల్ 6వ తేదీన కర్మాగారాన్ని మూసివేసింది. యాజమాన్యం పర్మినెంట్ కార్మికులకు చేయవలసిన సెటిల్మెంట్లు చేయకుండానే కర్మాగారాన్ని షట్‌డౌన్ చేయడంతో కార్మికులందరూ సమ్మెకు దిగారు. ఎలాంటి ఫలితమూ జరగలేదు. దిక్కుతోచని కార్మికులు ఎన్సీఎల్టీ కోర్టును ఆశ్రయించగా 2015 డిసెంబర్ వరకు గ్రాట్యూటీ చెల్లించాలని తీర్పునిచ్చింది. కొంత గ్రాట్యూటీని కార్మికులకు చెల్లించిన కర్మాగారం ఆ తర్వాత వారందరినీ విస్మరించింది. కార్మిక చట్టాల ప్రకారం కర్మాగారం పనిచేసినా, చేయకపోయినా సంవత్సరంలో 15రోజుల చొప్పున ప్రతి రెగ్యులర్ కార్మికునికి గ్రాట్యూటీని చెల్లించాలి. అయితే యాజమాన్యం ఈ నిబంధనలను తుంగలో తొక్కి నేటి వరకు కూడా కార్మికులకు గ్రాట్యూటీ ఇవ్వలేదు. యాజమాన్యం కర్మాగారంలో పనిచేసిన సుమారు 37 మంది పర్మినెంట్ కార్మికులకు పూర్తిస్థాయిలో సెటిల్మెంట్ చేసిందని, మిగతా 683 మంది పర్మినెంట్ కార్మికులకు ఎలాంటి చెల్లింపులు చేయలేదని కార్మికులు చెబుతున్నారు.

నగరబాట పట్టిన కార్మిక కుటుంబాలు

యాజమాన్య వైఖరితో వీధినపడ్డ కార్మికుల పరిస్థితి దయనీయమైన స్థితిలోకి వెళ్ళింది. కర్మాగారం మూతపడటం ఉన్న ఊర్లో పనులు దొరకకపోవడంతో అనేక కార్మిక కుటుంబాలు బతుకు పోరాటం సాగించేందుకు వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల బాట పట్టాయి. ఈ క్రమంలో కొంతమంది కార్మికులు అనారోగ్యం పాలై మృతి చెందారు.

కానరాని బిల్ట్ ఆనవాళ్లు

పిన్ క్విస్ట్ సంస్థతో బిల్ట్ యాజమాన్యం చేసుకున్న ఒప్పందం ప్రకారం కర్మాగారాన్ని ఆ సంస్థకు అప్పజెప్పడంతో వారు గత కొంతకాలంగా బిల్టులో కూల్చివేతలు ప్రారంభించారు. అనతి కాలంలోనే బిల్ట్‌కు సంబంధించిన అన్ని కట్టడాలను, మిషనరీలను తొలగించడంతో అక్కడ బిల్ట్ కర్మాగారం ఆనవాళ్లు లేకుండా పోయాయి.

కార్మికులకు న్యాయం చేయాలి

జాగటి చిన్న సీపీఐ(ఎం) మండల కార్యదర్శి



కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేసి కార్మికులందరికీ న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ముందుండి చర్యలు తీసుకోవాలి. మృతి చెందిన కార్మిక కుటుంబాలకు తక్షణ సాయం అందేలా కృషి చేయాలి. నూతన కర్మాగారం ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం క్రియాశీలకంగా వ్యవహరించి ఈ ప్రాంతానికి పూర్వవైభవం తీసుకువచ్చే బాధ్యతను తీసుకోవాలి. కార్మికులకు యాజమాన్యం నుంచి అందవలసిన ఫలాలు పూర్తిగా అందేలా చర్యలు తీసుకొని కార్మికులకు భరోసా కలిగించాలి.

ప్రభుత్వం చొరవ చూపాలి



కర్మాగారాన్ని నమ్ముకుని జీవించిన కార్మికులకు న్యాయం చేయడంలో ప్రభుత్వాలు చొరవ చూపాలి. ఎన్నో ఏండ్లు కష్టపడి కర్మాగారం అభివృద్ధిలో తమ జీవితాలను ధారపోసిన కార్మికులను అకస్మాత్తుగా వీధిపాలు చేయడం తగదు. ఈ విషయంలో ప్రభుత్వాలు స్పందించి బిల్ట్ యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

ఎస్ఎస్ ప్రసాద్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు

జాబ్ కార్డుల జారీ బంద్

(మొదటిపేజీ తరువాయి)

లాక్ చేసింది. దీంతో గ్రామాల్లో కొత్తగా జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఈజీఎస్ సిబ్బంది తీసుకోవడం లేదు. ప్రభుత్వం నుంచే బంద్ అయ్యిందని చెబుతున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద లబ్ది పొందేందుకు చాలా మంది భూమిలేని పేదలు ఉపాధి కార్డుల కోసం దరఖాస్తు చేసేందుకు ఎదురు చూస్తున్నారు.

భూమిలేని పేదలు 5.80 లక్షల మందేనా

భూమిలేని పేదల సంఖ్యను ప్రభుత్వం తక్కువ చేసి చూపుతుందని విమర్శలున్నాయి. రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టం కింద కోటీ 25 లక్షల మంది వరకు జాబ్ కార్డులుండి పనిచేస్తున్నారు. అనేక మంది వలసలు, ఇతర పనులు చేసే వాళ్లు జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోలేదు. పథకం ప్రారంభమైన 2005-06లో పేదలందరూ జాబ్‌కార్డులు పొందారు. ఆ తర్వాత పనులు చేయట్లేదన్న నెపంతో కేంద్ర ప్రభుత్వం జాబ్‌కార్డుల్ని రద్దు చేసింది. 2022-23 సంవత్సరంలోనే 86,17,887 మంది కూలీలు, 2023-24లో 68,86,532 మొత్తం 1.55 కోట్ల మంది కూలీల పేర్లను పథకం నుంచి తొలగించినట్టుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాసవన్ ఇటీవల లోక్‌సభలో ప్రకటించారు. ఆ మేరకు తెలంగాణలోనూ లక్షల సంఖ్యల్లో తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రాష్ట్రంలో 580577 మంది పేదలను మాత్రమే అర్హులుగా గుర్తించింది. కోటీ 25 లక్షల మంది కూలీలు జాబ్ కార్డులుండి పనిచేస్తుండగా కొందర్ని మాత్రమే అర్హులుగా గుర్తించినట్టు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని పేదలకు సర్కారిచ్చిన ఇనాం, అసైన్డ్ భూములున్నాయి. వాటిని కుటుంబాల వారీగా పంచుకుంటే సెంట్, రెండు సెంట్లు మాత్రమే వచ్చింది. ధరణి రికార్డుల్లో ఉన్నందున అనర్హులంటున్నారు.

పట్టణ పేదలేం పాపం చేశారు..?

గ్రామీణ పేదలతో పాటు పట్టణ పేదలకూ భరోసా సాయం చేయాలనే డిమాండ్ పెరిగింది. ఇటీవల హైకోర్టును కూడా ఆశ్రయించారు. రాష్ట్రంలో వేల గ్రామాల్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలపడంతో ఉపాధి పనులు రద్దు చేశారు. ఈజీఎస్‌ను పట్టణాలకూ వర్తింపజేయాలని సీపీఐ(ఎం), వ్యవసాయ కార్మిక సంఘం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుంది. పట్టణీకరణ పేరిట మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా విస్తరిస్తున్నా పాలకులు పేదలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవట్లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 17 మున్సిపాలిటీలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు ప్రాంతంలో రెండు కార్పొరేషన్ డివిజన్లు చేసి జీహెచ్ఎంసీలో కలిపారు. సుమారు 60 గ్రామాలు మున్సిపాలిటీల్లో కలిపి ఈజీఎస్ రద్దు చేశారు. పట్టణాల్లోనూ ఈజీఎస్ పనులు చూపి భరోసా ఇవ్వాలని పేదలు కోరుతున్నారు.

అర్హతలున్నా లబ్ది పొందలేని పేదలు

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హతలున్నా లబ్ది పొందలేకపోతున్న పేదలు లక్షల్లో ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో 24 మండలాల్లోని 24 గ్రామాల్లో 844 మందిని మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులుగా ఎంపిక చేసి రూ.6 వేల చొప్పున వేశారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీలో 20 రోజులు పనిచేసి భూమిలేని పేదలు 22260 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి జాబ్ కార్డుదారుల ఆధార్ ద్వారా 20 రోజులు పనిచేసిన వారి వివరాలను భూ రికార్డులకు సంబంధించిన ధరణి వెబ్‌సైట్‌లో ఉన్న పట్టాదారుల వివరాలతో పోల్చి భూమిలేని వాళ్లను గుర్తించారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ మరో 30 వేల మందికి మాత్రమే లబ్ది చేకూరనుంది.

బీసీల జనాభాను తగ్గించామా?

- మీ లెక్కేంది...అందుకు ఆధారమేంది? : బీఆర్ఎస్, బీజేపీలకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రశ్న
- తప్పుడు ప్రచారం చేసి ప్రజలను గందరగోళ పరచొద్దు
- బీసీ, ఎస్సీల దశాబ్దాల కల సాకారమైందని వ్యాఖ్య



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీల జనాభాను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందా? మీ లెక్కేంది? అందుకు సంబంధించిన మీ వద్ద ఉన్న ఆధారమేంది? అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రశ్నించారు. బీసీ, ఎస్సీల దశాబ్దాల కల సాకారమైందని చెప్పారు. అందువల్ల తప్పుడు ప్రచారం చేసి ప్రజలను గందగోళన పరచొద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఈర్లపల్లి శంకర్, పార్టీ నాయకులు చరణ్‌కౌశిక్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చొరవతో బీసీ కులగణన, ఎస్సీ వర్గకరణకు మోక్షం లభించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీ కులగణన జరిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అనీ, బీహార్ లాంటి రాష్ట్రం కులగణన చేపట్టినా... అది కార్యరూపం దాల్చలేదన్నారు. కుల గణన సర్వేపై ప్రతిపక్షాలు విమర్శలకు బదులు సలహాలు, సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ కులగణనపై ప్రతిపక్ష, స్వపక్ష నేతల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయన్నారు. బీసీల జనాభాను తగ్గించి చూపే ప్రయత్నం చేశారనడం సరైందికాదన్నారు. అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకుని పక్కాగా సర్వే చేసినట్టు చెప్పారు. 'ఏ లెక్కల ఆధారంగా కులగణన తప్పని అంటున్నారో ప్రతిపక్షాలు చెప్పాలి. మీరు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపండి. రాజకీయ నాయకుల ఉచ్చులో బీసీ సంఘాలు, నాయకులు పడవద్దు' అని విజ్ఞప్తి చేశారు. బీసీలను అణగదొక్కిన పార్టీలు, నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. బీసీ లెక్కలు తగ్గాయంటూ మాట్లాడుతున్న వారికి ప్రామాణికమేంటని ప్రశ్నించారు. తప్పుడు మాటలతో బీసీలను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. గత పదేండ్లలో బీసీలకు ఏం న్యాయం చేశారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీల జనాభా తగ్గించింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆకాంక్ష నెరవేర్చ డంతో ప్రతిపక్షాలు కడుపుమంటతో అడ్డగోలుగా మాట్లాడుతున్నాయని విమర్శించారు. సమగ్ర కుటుంబ సర్వే మంచిదే అయితే దాన్ని ఎందుకు టేబుల్ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణనపై ఎవరికైనా అనుమానాలు ఉంటే అన్ని విషయాలూ మాట్లాడుకుంటామని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఎంత చిన్నవారైనా, పెద్దవారైనా పార్టీ క్రమశిక్షణకు లోబడే ఉండాలని సూచించారు. పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా కులగణనకు ఇంకా వివరాలు ఇవ్వకపోతే ఇప్పటికైనా ఇవ్వాలని కోరారు.

కబ్జాల నుంచి విముక్తి

రహదారులపై అడ్డుగోడలను తొలగించిన హైడ్రా



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలోని పలు రహదారులకు అడ్డుగా నిర్మించిన ప్రహరీ గోడలను హైడ్రా బుధవారం తొలగించింది. ప్రహరీలు నిర్మించి తమ నివాస ప్రాంతాలకు వెళ్లే మార్గాలను మూసేస్తున్నారని కాలనీవాసుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మున్సిపాలిటీలో రాకపోకలకు అడ్డుగా ఎస్ఆర్ఐ కాలనీ వారు నిర్మించిన ప్రహరీని హైడ్రా కూల్చివేసింది. దీంతో అక్కడి సీనియర్ సిటిజన్ కాలనీ, శాంతి విల్లాస్, లక్ష్మి విల్లాస్, గౌరీనాథ్‌పురం, వంపుగూడ కాలనీలకు రాకపోకలు సులభమయ్యాయి. దమ్మాయిగూడకు వెళ్లే ప్రధాన రహదారికి వెళ్లాలంటే ఇంతకు ముందు చుట్టూ తిరిగి దాదాపు మూడు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని, ఇప్పుడు 100 మీటర్లు ప్రయాణిస్తే సరిపోతుందని సీనియర్ సిటిజన్ కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీలను కూల్చిన చోట వెంటనే రోడ్లు వేస్తామని కాప్రా మున్సిపాలిటీ అధికారులు హామీ ఇచ్చినట్టు స్థానికులు తెలిపారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సైనిక్‌పురిలో ఆర్మీ ఆఫీసర్ల కాలనీకి అడ్డుగా నిర్మించిన 50 మీటర్ల ప్రహరీని కూడా హైడ్రా తొలగించి మార్గాన్ని ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం రాళ్లగూడ విలేజ్ వద్ద కూడా ఔటర్ రింగురోడ్డుకు చేరేందుకు వీలు లేకుండా రహదారులకు అడ్డంగా నిర్మంచిన ప్రహరీని సైతం హైడ్రా తొలగించింది.

1200 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలో సర్వే నంబరు 2181లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలం కబ్జా అయిందంటూ హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. దాదాపు 1200 గజాల స్థలాన్ని అక్కడ అసోసియేషన్ పెద్దలు ప్లాట్లుగా చేసి విక్రయించారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులతో కలిసి హైడ్రా అధికారులు అన్ని కోణాల్లో విచారించారు. ఐదు ప్లాట్‌లుగా చేసి కొన్నిటిని అమ్మగా, మరికొన్ని వారి ఆధీనంలో ఉన్నట్టు తేలింది. కబ్జాలను తొలగించి.. ప్రజావసరాలకు ఉద్దేశించిన జీహెచ్ఎంసీ ల్యాండ్‌గా పేర్కొంటూ హైడ్రా పేరిట బోర్డులు ఏర్పాటు చేశారు. కాపాడిన భూముల్లో తిరిగి అక్రమ నిర్మాణాలు చేపట్టినా, ప్రహరీలను తిరిగి నిర్మించినా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం

- 11 శాతం రిజర్వేషన్లు దక్కాలి
- పున: పరిశీలించి న్యాయం చేయండి : ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అన్నారు. మాదిగలకు 9 కాదు 11 శాతం రిజర్వేషన్లు దక్కాలన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏండ్లుగా పోరాడుతూనే ఉన్నామని తెలిపారు. చాలా కమిషన్లు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని గుర్తు చేశారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలు చేస్తున్నట్టు ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదులు చెప్పారు. అయితే వర్గీకరణ అశాస్త్రీయంగా ఉందన్నారు. వర్గీకరణ ద్వారా మాదిగలకు రావాల్సిన వాటా కంటే 2 శాతం తక్కువ రిజర్వేషన్లు వచ్చాయన్నారు. 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, 32 లక్షల మంది ఉన్న మాదిగలకు ఏ ప్రాతిపదికన తీసుకున్నా 11 శాతం రావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్దుబాటు చేసుకోవాలనడం సరికాదని, నిర్ణయాన్ని పున్లపరిశీలించి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు.

పాఠశాల భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఘటన
- విద్యార్థి సంఘాల ఆందోళన


(ఫైల్)

నవతెలంగాణ-షాద్ నగర్

ప్రిన్సిపాల్ తిట్టడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని శాస్త్ర స్కూల్‌లో బుధవారం జరిగింది. విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని మల్లికార్జున కాలానికి చెందిన నీరజ్ శాస్త్ర గ్లోబల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో నీరజ్, మరో విద్యార్థి పాఠశాల బాల్కనీలో మాట్లాడుకుంటుండగా ప్రిన్సిపాల్ నరేందర్‌రాయ్ ఆఫీసులోకి పిలిచి మందలిచ్చారు. దాంతో మనస్తాపానికి గురైన నీరజ్ టాయిలెట్‌కు వెళ్తున్నట్టు చెప్పి.. అక్కడే భవనంపైకి ఎక్కి మొదటి అంతస్తు నుంచి దూకాడు. పాఠశాల సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు తెలిపారు. కొద్దిసేపటి కిందటి వరకు తమతో కలిసి ఉన్న నీరజ్ కండ్లముందే ఆత్మహత్య చేసుకోవడంతో తోటి విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థి ఆత్మహత్య విషయమై విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టాయి. విద్యార్థులపై యాజమాన్యం ఒత్తిడి తేవడంతోపాటు వారి మనసు నొచ్చుకునేలా ప్రవర్తించడంపై ఎస్ఎఫ్ఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్.. విద్యార్థి నీరజ్ పట్ల వ్యవహరించిన తీరును ఖండించారు. అధికారులు ప్రయివేట్ పాఠశాలలపై కనీస దృష్టి సాధించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి చేస్తాం

మోడీ సర్కార్‌ది ముమ్మాటికీ పేదల వ్యతిరేక బడ్జెట్

టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే మీట్ ది మీడియాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

- వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి చేస్తాం
- ప్రజాఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం
- స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ
- వామపక్ష పార్టీలున్న చోట పరస్పర సహకారం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటుకు కృషి చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామనీ, అయితే, వామపక్ష పార్టీలు బలంగా ఉన్న చోట పరస్పర సహకారంతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చి ధన, మద్య ప్రలోభాల రాజకీయాలను తిప్పికొడతామని నొక్కి చెప్పారు. కమ్యూనిస్టు పార్టీగా దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందాలని తాము కోరుకుంటుంటే మోడీ సర్కారు మాత్రం ఆ రెండు రంగాలను పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) సంయుక్త ఆధ్వర్యంలో మీట్ ది మీడియా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి టీడబ్ల్యూజేఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్ఎస్.హష్మీ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, సలీమా, గుడిగ రఘు, హెచ్‌యూజే అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి బి.జగదీశ్, కోశాధికారి రాజశేఖర్, నాయకులు విజయ, నాగవాణి, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న ఫలితంగానే ఒక్కశాతం ఉన్న కార్పొరేట్ల చేతిలో 27 శాతం సంపద పోగైందని చెప్పారు. అదానీ, అంబానీ లాంటి వాళ్లకు లక్షల కోట్ల రూపాయల సంపదను అప్పనంగా కట్టబెడుతున్న తీరును ఎండగట్టారు. దేశంలో 50 శాతం ఉన్న పేదల చేతుల్లో కేవలం 13 శాతం సంపదే ఉందని చెప్పారు. దీంతో వారు రక్తహీనత, పేదరికం, నిరుద్యోగం, నిత్యావసర సరుకులు ధరలు, విద్య, వైద్యం, ఇండ్లలేమి, నిరుద్యోగం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గత పాలకులు, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్లనే మన దేశంలో ఈ అసమానతలున్నాయని నొక్కి చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మన దేశంలో కుల వివక్ష ఉందనీ, సామాజిక అసమానతలు వేల ఏండ్ల నుంచి కొనసాగుతున్నా వాటిని నిర్మూలించాలనే చిత్తశుద్ధి నేటి పాలకులకు లేదని విమర్శించారు. పైగా, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వివక్ష రూపాలను ప్రోత్సహిస్తున్న తీరును ఎండగట్టారు. కులవివక్ష సామాజిక అసమానతలకు దారితీస్తున్న వైనాన్ని సోదాహరణంగా వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందుతున్న తీరును ఎండగట్టారు. మతోన్మాద రాజకీయాలు శ్రామిక వర్గ ఐక్యతకు, సామాజిక ఉద్యమాలకు, బడుగు, బలహీన వర్గాల పోరాటాలకు తీవ్ర ఆటంకంగా మారాయని వాపోయారు. ఈ తరుణంలో దేశంలోని లౌకిక శక్తులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.


ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక బడ్జెట్

ఇటీవల కేంద్రం ప్రతిపాదించిన రూ.50.60 లక్షల కోట్ల బడ్జెట్‌లో 30 కోట్ల మంది ఉపాధి కూలీలకు రూ.85 వేల కోట్లే కేటాయించడమేంటని ప్రశ్నించారు. రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలనే డిమాండ్‌ను ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఇలాంటి మోడీ సర్కారును పేదల వ్యతిరేక ప్రభుత్వమని కాకుండా ఇంకేమనాలి? అని ప్రశ్నించారు. దేశంలో అసంఘటిత కార్మికులు కనీస వేతనాలు పొందని పరిస్థితి ఉన్నా కనీస ప్రస్తావన లేదన్నారు. వ్యవసాయ రంగానికి రూ.10 వేల కోట్లను తగ్గించడమేంటని ప్రశ్నించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతిలో పెట్టి రైతులను కూలీలుగా మార్చే కుట్రకు మోడీ సర్కారు పూనుకున్నదని విమర్శించారు. దేశ జనాభాలో 16 శాతం ఉన్న దళితులకు కేవలం ఐదు శాతం, ఏడు శాతమున్న ఎస్టీలకు కేవలం 2 శాతం నిధులు కేటాయించడమేంటని ప్రశ్నించారు. దేశంలో 50 శాతానికిపైగా జనాభాగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేవన్నారు. మూడు, నాలుగు వేల కోట్ల రూపాయలతో మైనార్టీ సంక్షేమం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని చెబుతున్నానన్నారు. దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగ సమస్య పరిష్కారం గురించి కేంద్ర ప్రభుత్వానికి ఆలోచనే లేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణ వ్యతిరేక బడ్జెట్ అని కూడా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులు, విభజన హామీల కోసం రూ.1.63 లక్షల కోట్లను కావాలని అడిగితే చిల్లిగవ్వ కేటాయించలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలను విస్మరించడం వల్లనే ప్రజలు ఆ పార్టీని కాదని కాంగ్రెస్‌కు అవకాశమిచ్చారనీ, కాంగ్రెస్ కూడా అదే బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ మతోన్మాద రాజకీయాలపై తన వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

విస్తృత పోరాటాల ద్వారా ప్రజలకు చేరువవుతాం



సీపీఐ(ఎం) విస్తరించడానికి బలమైన ఉద్యమాలే కీలకం కాబోతున్నాయన్నారు. విస్తృత పోరాటాల ద్వారా ప్రజలకు చేరువవుతామని చెప్పారు. వామపక్ష పార్టీల ఐక్యత తమకు తొలి ప్రాధాన్యమన్నారు. తాను సామాజిక సమీకరణాల రీత్యా ఈ పదవిలోకి రాలేదనీ, సీపీఐ(ఎం) మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకుంటే కార్యదర్శిని అయ్యానని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. తమ పార్టీ మహాసభలో రైతులు, పేదలు, కూలీలు, కార్మికులకు మేలు జరిగేలా 49 అంశాలపై తీర్మానాలు చేశామనీ, ఆ దిశగానే పోరాటాలుంటాయని చెప్పారు. కనీస కూలి రూ.400 కోసం, 200 పనిదినాల అమలు కోసం కొట్లాడుతామని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేల అమలు కోసం కార్యాచరణ తీసుకుని ముందుకెళ్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తామని చెప్పారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాట కార్యాచరణ రూపొందించి...రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ఇండ్ల స్థలాలిచ్చే వరకూ వెనక్కి తగ్గబోమన్నారు. ఓట్లు, సీట్ల ఆధారంగా చూడకుండా ప్రజా ఉద్యమాల ద్వారా కమ్యూనిస్టుల గొప్పతనాన్ని చూడాలన్నారు. హక్కుల కోసం పోరాటాల్లో కలిసి వస్తున్న ప్రజలకు రాజకీయ చైతన్యం కల్పించడంలో కొంత వైఫల్యం ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. ఎన్నికల్లోనూ కమ్యూనిస్టుల వైపు ఉండేలా ప్రజల్లో చైతన్యం కల్పించడంపై దష్టి సారిస్తామని నొక్కి చెప్పారు. తమతో కలిసివచ్చే మేధావులు, సామాజిక సంఘాల నేతలను కలుపుకుని ముందుకెళ్తామన్నారు. డబ్బు, మద్యం, ప్రలోభాలతో ఎన్నికలు జరుగుతు న్న కాలంలో ప్రజలకు మరింత చైతన్యం కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యల మీద చర్చల కంటే వ్యక్తిగత దూషణలకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని ప్రజలంతా గమనిస్తున్నారనీ, ప్రజాప్రతినిధులు తమ మాటతీరును మార్చుకోవాలని సూచించారు. బూర్జువా పార్టీలకు అధికార యావ తప్ప ప్రజా సమస్యల పరిష్కారం పట్ల దష్టి సారించవని ఎత్తిచూపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామనటాన్ని, ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామనీ, అయితే, జనాభా లెక్కల్లో మరింత స్పష్టత తీసుకొచ్చి 2021 జనాభా లెక్కల ప్రకారం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ లెక్కల్లో బీసీ వివరాలు సరిగా లేకపోవడాన్ని తప్పుబట్టారు.



సంగమంలో ప్రధాని

పవిత్ర స్నానం ఆచరించిన మోడీ

ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రా జ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా (2025) సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరించటానికి దేశ,విదేశాలనుంచి తరలివస్తున్నారు. బుధవారం ప్రధాని మోడీ కూడా సంగమంలో పవిత్ర స్నానం చేశారు. గతంలో ఎన్నికలు జరిగినపుడు హిమాలయాలు,ఇతర పుణ్యక్షేత్రాలకు వెళ్లి..ఫోటోలను అప్‌లోడ్ చేసిన సంగతి విదితమే. అయితే ఇపుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నపుడు..సంగంలో పవిత్రస్నానం చేయటం కూడా ..హిందూ ఓటర్లను ప్రభావితం చేయటానికేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఆదిలాబాద్ జిల్లాలో 37 డిగ్రీలు

- వచ్చే మూడ్రోజులు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం
- పగటిపూట ఎండ..రాత్రి చలి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఆదిలాబాద్, భద్రాచలంలలో బుధవారం అత్యధికంగా 37 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. పగటిపూట ఎండతో పాటు ఉబ్బరం ఉంటున్నది. రాత్రి పూట చలి ఉంటున్నది. తెల్లవారుజామున పొగమంచు కమ్మేస్తున్నది. ఇలా ఏకకాలంలో భిన్నవాతావరణం కనిపిస్తున్నది. వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల మేరకు పెరిగే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో మూడు రోజుల పాటు వాతావరణం పొడిగా ఉండనున్నది.

బుధవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ఆదిలాబాద్	37 డిగ్రీలు
భద్రాచలం	37 డిగ్రీలు
ఖమ్మం	36.6 డిగ్రీలు
మహబూబ్‌నగర్	36.3 డిగ్రీలు
మెదక్	35.6 డిగ్రీలు
హన్మకొండ	35.5 డిగ్రీలు
నిజామాబాద్	35.5 డిగ్రీలు

బేడీలతో గెంటేసిన ట్రంప్

- 105మంది భారతీయులతో అమృతసర్‌లో దిగిన విమానం
- అమెరికా అధ్యక్షుడి చర్యలపై పంజాబ్ సర్కార్ అసంతృప్తి



అమృతసర్ : వీసా గడువు ముగిసినా, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న కొంతమంది భారతీయులను బేడీలు వేసి మరీ అమెరికా అధ్యక్షుడు గెంటేశారు. వలస భారతీయులను బలవంతంగా బంధించి.. తీసుకుని వచ్చిన అమెరికా మిలటరీ విమానం బుధవారం మధ్యాహ్నం అమృతసర్ అంతర్జాతీయ విమనాశ్రయంలో దిగింది. మధ్యాహ్నం 1.55గంటలకు ల్యాండ్ అయిన ఈ విమానంలో తొలి విడతగా మొత్తంగా 105మంది భారతీయులు వచ్చారని అధికారులు తెలిపారు. వీరిలో 30మంది పంజాబ్, 33 మంది హర్యానా, మరో 33మంది గుజరాత్‌కు చెందినవారు వున్నారు.

మహారాష్ట్ర, యూపీల నుంచి ముగ్గురేసి చొప్పున, చండీగఢ్ నుంచి ఇద్దరు వున్నారని సంబంధిత వర్గాలు తెలిపా యి. వీరిలో మొత్తంగా 25మంది మహిళలు కాగా 12మంది మైనర్లు, అందరికన్నా అతి పిన్న వయస్కుడు నాలుగేండ్ల చిన్నారి అని ఆ వర్గాలు తెలిపాయి. 25ఏండ్లలోపు వయస్సున్నవారు 48మంది వున్నారు. టెక్సాస్ నుంచి బయలుదే రిన ఈ విమానంలో 11మంది విమాన సిబ్బంది వున్నారు. ఈ తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న 45మంది అమెరికా అధికారులు కూడా వున్నారు. కాగా కచ్చితంగా ఎంతమంది వచ్చారనే విషయమై ఇంతవరకు అధికారిక ప్రకటన లేదు. 205మంది భారతీయులను పంపిస్తున్నట్టు.. అమెరికా విమానంలో పంపినట్లు తొలుత వార్తలు వచ్చాయి. వెనక్కి పంపే ముందు ప్రతి ఒక్కరి రికార్డులను పరిశీలించినట్టు ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని విమానాలు భారత్‌కు రానున్నాయని తెలిపారు.

కాగా అమెరికా విమానంలో వచ్చిన భారతీయుల కోసం విమానాశ్రయంలో కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై పంజాబ్ ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కులదీప్ సింగ్ దలివాల్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అమెరికా నిర్ణయాన్ని తప్పుబడుతూ ఈ రోజున ఇలా పంపిస్తున్న వీరందరూ ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత దోహదపడినవారేనని, అటువంటి వారిని ఇలా తరలించడానికి బదులుగా అక్కడ శాశ్వత నివాసానికి అనుమతించి వుంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. అమెరికా వెళ్ళిన భారతీయుల్లో చాలా మంది వర్క్ పర్మిట్లపైనే వెళతారని, కానీ ఆ పర్మిట్ల కాలపరిమితి ముగిసిపోయిన తర్వాత కూడా వుండడంతో వీరందరూ అక్రమంగా నివసించిన వారయ్యారని అన్నారు. కొంతమంది అక్రమంగా కూడా అమెరికాలోకి ప్రవేశించారన్నారు. అమెరికాలో నివసిస్తున్న పంజాబీల సమస్యలు, ఆందోళనలపై చర్చించేందుకు వచ్చే వారం విదేశాంగ మంత్రి జై శంకర్‌తో సమావేశం కావాలని భావిస్తున్నట్లు చెప్పారు. దాదాపు 7,25,000మంది భారతీయులు చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్నట్లు ప్యూ రీసెర్చ్ సెంటర్ డేటా పేర్కొంది. మెక్సికో, ఎల్ సాల్వడార్ తర్వాత ఇలా అనధికారికంగా వున్నవారిలో భారత్ మూడవ స్థానంలో వుంది.

ట్రంప్ నిర్ణయంతో అమెరికా సాయానికి బ్రేక్

- యూఎస్ ఎయిడ్ సంస్థపై ఆంక్షలు
- నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల పనులు
- కీలక దేశీయ రంగాలపై ప్రభావం



న్యూఢిల్లీ : అంతర్జాతీయ అభివృద్ధికి సంబంధించిన అమెరికా సంస్థ (యూఎస్ ఎయిడ్)ను స్తంభింపజేయాలని ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం భారత్‌కు అశనిపాతంగా మారింది. దేశంలో ఆరోగ్య రక్షణ, ఇతర ప్రాజెక్టుల పైన, భారత్‌తో కొనసాగుతున్న భాగస్వామ్యాల పైన ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశం ఉంది. నూతన ప్రభుత్వ విధానానికి అనుగుణంగా అమెరికా విదేశీ సాయంపై మదింపు చేయాలని, దానిని పునర్వ్యవస్థీకరించాలని ట్రంప్ గత నెలలో ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీ చేశారు. విదేశీ సాయానికి 90 రోజుల విరామం ఇచ్చారు. దీనిపై స్పందించిన యూఎస్ ఎయిడ్.. మన దేశంలో వివిధ ప్రాజెక్టులకు సాయం అందిస్తున్న భాగస్వామ్య సంస్థలన్నింటికీ సమాచారం పంపుతూ తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ పనులు నిలిపివేయాలని ఆదేశించింది.



పనులు నిలిపివేయండి

భారత్‌లో పని చేస్తున్న తన భాగస్వాములకు యూఎస్ ఎయిడ్ ఆదేశాలు జారీ చేస్తూ ప్రాజెక్టులను నిలిపివేయాలని సూచించింది. 'పనుల నిలిపివేతను కొనసాగించాలి. ఆదేశాలు రద్దయ్యాయని ఒప్పంద అధికారి (యూఎస్ ఎయిడ్) లిఖితపూర్వకంగా నోటిఫికేషన్ ఇచ్చే వరకూ పనులు ప్రారంభించకూడదు' అని తెలిపింది.

ఉదత సాయమే అయినా...

గర్భిణులు-శిశు మరణాలు, టీబీ, హెచ్ఐవీ, కోవిడ్ తదితర ఆరోగ్య సంబంధమైన సవాళ్లను ఎదుర్కోవడంలో యూఎస్ ఎయిడ్ కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోంది. 1990 నుండి మన దేశంలో 20 లక్షల మంది చిన్నారుల ప్రాణాలు కాపాడడంలో సాయపడింది. ఆ సంస్థ సాయంతోనే 25 వేల న్యుమోనియా, 14 వేల డయేరియా మరణాలను నివారించగలిగాము. టీబీ వ్యాధిని నివారించడంలో కూడా యూఎస్ ఎయిడ్ సాయం మరువలేనిది. 1995 నుండి హెచ్ఐవీ వ్యాధిని అరికట్టడంలో ప్రభుత్వం, పౌర సమాజంతో కలిసి యూఎస్ ఎయిడ్ పనిచేస్తోంది. దీంతో 2007 నుండి దేశంలో ఎయిడ్స్ ఇన్‌ఫెక్షన్లు 32 శాతం మేర తగ్గాయి. కోవిడ్ సమయంలో యూఎస్ ఎయిడ్ మన దేశానికి 13.1 మిలియన్ డాలర్ల సాయాన్ని ప్రకటించింది. కొన్ని వైద్య పరికరాలను కూడా అందజేసింది.

దేశంలోని 16 రాష్ట్రాల్లో తొమ్మిది భాషలను చదవడంలో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచేందుకు యూఎస్ ఎయిడ్, దాని భాగస్వాములు కృషి చేస్తున్నారు. బోధనా నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి 61 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్‌కు కూడా యూఎస్ ఎయిడ్ మద్దతు ఇస్తోంది. మూడు లక్షల మందికి మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించింది. యూఎస్ ఎయిడ్ మద్దతుతో సాంకేతికతను అందిపుచ్చుకొని 1.32 లక్షల మంది రైతులు అదనపు దిగుబడులు, ఆదాయాలను పొందారు.

అందుబాటులో లేని అమెరికా వెబ్‌సైట్లు

ఇదిలావుండగా ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంతో యూఎస్ ఎయిడ్ సహా 350 అమెరికా సర్కారు వెబ్‌సైట్లు అందుబాటులో లేకుండా పోయాయి. వీటిలో రక్షణ, వాణిజ్యం, ఇంధనం, రవాణా, కార్మికులు, కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ, సుప్రీంకోర్టు వంటి ప్రభుత్వ విభాగాలతో అనుసంధానించిన వెబ్‌సైట్లు కూడా ఉన్నాయి.

ట్రంప్, మస్క్ అక్కసు

'యూఎస్ ఎయిడ్‌కు సంబంధించిన అంశాలపై ట్రంప్‌తో వివరంగా చర్చించాను. సాయాన్ని నిలిపివేసేందుకు ఆయన అంగీకరించారు' అని టెస్లా అధిపతి, ట్రంప్ సన్నిహితుడు ఎలన్ మస్క్ తెలిపారు. యూఎస్ ఎయిడ్ అనేది ఓ నేరచరిత కలిగిన సంస్థ అని, అది కనుమరుగు కావాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. దేశాధ్యక్షుడు ట్రంప్ సైతం మీడియాతో ముచ్చటిస్తూ అది 'రాడికల్ వామపక్ష పిచ్చివాళ్ల గ్రూప్' అని ఎద్దేవా చేశారు. విదేశాలకు సాయం అందించాలన్న ఉద్దేశాన్ని ఇష్టపడతానని, అయితే వాళ్లు రాడికల్ వామపక్ష పిచ్చివాళ్లుగా మారారని ఆరోపించారు. సాయం అందించడం మంచిదే అయినా దానిని చేసే వారి గురించే ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని వ్యాఖ్యానించారు.

ప్రభావం తక్కువా?

యూఎస్ ఎయిడ్ మన దేశంలో 70 సంవత్సరాలకు పైగా పనిచేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ బడ్జెట్ 600 బిలియన్ డాలర్లు కాగా యూఎస్ ఎయిడ్ ద్వారా మన దేశం 140 మిలియన్ డాలర్ల సాయం పొందింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో యుఎస్ ఎయిడ్ సంస్థ భారత ప్రభుత్వం-పౌర సమాజానికి 6.8 మిలియన్ డాలర్లు, ఆరోగ్యానికి 55 మిలియన్ డాలర్లు, పర్యావరణానికి 18 మిలియన్ డాలర్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు 7.8 మిలియన్ డాలర్లు అందజేసిందని విదేశీ సాయానికి సంబంధించిన అమెరికా ప్రభుత్వ వెబ్‌సైట్ తెలిపింది. యూఎస్ ఎయిడ్ నుండి భారత్ పొందుతున్న సాయం స్వల్పమే అయినప్పటికీ ఇప్పుడది నిలిచిపోవడంతో ఆరోగ్య సంబంధమైన ప్రాజెక్టులపై ప్రభావం పడుతుంది. విద్య, వాతావరణ మార్పు తదితర రంగాలకు అందుతున్న సాయం కూడా కుంటుపడే అవకాశం ఉంది.



వామ్మో..భౌ భౌ

పెరుగుతున్న కుక్క కాట్లు

ప్రతి గంటకూ 60 మంది చిన్నారులపై దాడి

బాద్యత రాష్ట్రాలదే ! మేమేంచేస్తాం ?

న్యూఢిల్లీ : గత సంవత్సరంలో దేశంలో 22 లక్షల మంది కుక్క కాటుకు గురయ్యారు. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ మంగళవారం లోక్‌సభకు ఈ విషయాన్ని తెలియజేశారు. 2024లో 21,95,122 కుక్క కాటు ఘటనలు చోటుచేసుకున్నాయని, 37 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన చెప్పారు. గత ఏడాది కోతులు సహా ఇతర జంతువుల దాడిలో 5,04,728 మంది గాయపడ్డారని, 11 మరణాలు సంభవించాయని వివరించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అందించిన వివరాల ప్రకారం కుక్క కాటుకు గురైన వారిలో 5,19,704 మంది పదిహేను సంవత్సరాల లోపు వయసున్న వారేనని అన్నారు. ఈ లెక్కన ప్రతి గంటకూ 60 మంది పిల్లలపై కుక్కలు దాడి చేస్తున్నాయని తెలిపారు. జంతువుల దాడులకు సంబంధించిన అంశం రాష్ట్రాల పరిధిలోనిదని అంటూ వీటిపై స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

మరో ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ రాష్ట్రీయ కామధేను ఆయోగ్ ఛైర్మెన్ పదవి 2022 ఫిబ్రవరి నుంచి ఖాళీగానే ఉన్నదని తెలిపారు. దీని సిఫారసుల ఆధారంగా ఏ పథకాన్నీ అమలు చేయడం లేదని, కాబట్టి 2019 నుంచి దీనిపై ఖర్చే పెట్టలేదని వివరించారు.


నవతెలంగాణ

తాను నమ్మిన సత్యాన్ని ఆచరించలేకపోవటమే
జీవిత వైఫల్యం - గౌతమ బుద్ధుడు

గురువారం 06 ఫిబ్రవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

బీసీ రిజర్వేషన్లు



రాష్ట్ర అసెంబ్లీలో కులగణన నివేదిక ఆమోదం పొందింది. బీసీ రిజర్వేషన్ల తీర్మానాన్ని కేంద్రానికి సిఫారసు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో ప్రకటించారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో బిల్లుపెట్టి నేరుగా అమలుచేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. సర్కారీ సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వేకు అసెంబ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తరుణంలో రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ అవసరం.

తెలంగాణలో చేపట్టిన కులగణనను దేశవ్యాప్తంగా చేపట్టాలని సభ డిమాండ్ చేసింది. 'ఎందరో సీఎంలకు ఈ అవకాశం రాలేదు..నాకు వచ్చింది. ఫిబ్రవరి నాలుగును ఇక నుంచి సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహిస్తాం' అని సీఎం ప్రకటించారు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీజేపీ

ప్రస్తుత పరిస్థితుల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి. నలభై రెండు శాతం రిజర్వేషన్లను ఉపకులాలవారీగా కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్కారుకు అల్టిమేటం ఇస్తున్నాయి. అలాకాకుండా పార్టీపరంగానే రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పూనుకుంటే, తీవ్రస్థాయి పరిణామాలు ఎదుర్కొవాల్సి రావచ్చు. కులగణన చేశాం, క్యాబినెట్‌లో తీర్మానించాం, అసెంబ్లీలో ఆమోదించాం, ఇక తమ పని అయిపోందని రేవంత్ సర్కారు కనుక చేతులు దులుపుకోవాలని భావిస్తే తప్పులో కాలేసినట్టే.

కేంద్ర సర్కారు, దీనికి ఒప్పుకుంటుందా? ఇదొక ప్రశ్న. కాగా అసెంబ్లీలో తీర్మానం చేసి తప్పించుకునే ప్రయత్నం రేవంత్ సర్కారు చేస్తున్నదనే విమర్శలూ వెల్లువెత్తుతు న్నాయి. జనాభా లెక్కలపై అసెంబ్లీలో కేంద్రంలోని మోడీ సర్కారుపై సీఎం నిప్పులు చెరగడం చర్చనీయాంశ మవుతున్నది. 2011 జనాభా లెక్కలు తప్పితే, దేశంలో మరే అధికారిక లెక్కలూ లేవని ఆగ్రహం వ్యక్తంచేశారు కూడా. 2021లో జనాభా లెక్కలు సేకరించలేదనీ, అది బీసీల హక్కులకు నష్టం కాదా? అని ప్రశ్నిస్తున్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ప్రధానంగా ఓటరు జాబితాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించాయి. అయితే ఒడిషా ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. బీహార్, కర్నాటక రాష్ట్రాలు మాత్రం కులసర్వే చేపట్టాయి.


స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా కల్పిస్తున్నారు. బీసీలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే కొన్ని ఇస్తున్నాయి. గతంలో లాటరీ పద్ధతిలో, ర్యాండమ్‌గా ఎంపిక చేసే తదితర అశాస్త్రీయ పద్ధతుల్లో రిజర్వేషన్లు అమలుచేస్తుండగా, ప్రతిసారి వాటిపై న్యాయ వివాదాలు తలెత్తడం పరిపాటైంది. ఈ రిజర్వేషన్లు కర్నాటకకు చెందిన కె.కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవిళి కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ట్రిపుల్ 'టీ' పేరిట మార్గదర్శకాలిచ్చింది. మొదటిది ప్రతి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. రెండోది జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి, మూడోది రిజర్వేషన్లు కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి మొత్తం యాభై శాతం మేరకు మించకూడదు. ఆ మార్గదర్శకాలను పాటించని ఏ రాష్ట్రంలోకూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలుచేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ నిబంధనలను పాటించని గుజరాత్, మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను సైతం దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దుచేసింది. సిఫారసులు లేకుంటే బీసీ రిజర్వేషన్ స్థానాలన్నింటినీ జనరల్‌గా మార్చాలని ఆదేశించింది.

ప్రస్తుత పరిస్థితుల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి. నలభై రెండు శాతం రిజర్వేషన్లను ఉపకులాలవారీగా కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్కారుకు అల్టిమేటం ఇస్తున్నాయి. అలాకాకుండా పార్టీపరంగానే రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పూనుకుంటే, తీవ్రస్థాయి పరిణామాలు ఎదుర్కొవాల్సి రావచ్చు. కులగణన చేశాం, క్యాబినెట్‌లో తీర్మానించాం, అసెంబ్లీలో ఆమోదించాం, ఇక తమ పని అయిపోందని రేవంత్ సర్కారు కనుక చేతులు దులుపుకోవాలని భావిస్తే తప్పులో కాలేసినట్టే. అసెంబ్లీలో చెప్పినట్టుగా అఖిలపక్షం నిర్వహించి, అవసరమైతే ఢిల్లీ తీసుకెళ్లి మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలి. మెడలు వంచైనా సరే రిజర్వేషన్లను జనం ముంగిళ్లకు చేర్చాలి. వాటికి రాజ్యాంగ రక్షణ ఉండేలా చూసుకోవాలి.

1948 జనగణన చట్టం ప్రకారం జనగణన, కులగణన చేసే అధికారం కేవలం కేంద్రానిదే. ఇటీవల బీహార్ సర్కారు చేపట్టిన కులగణన కోర్టుకెక్కడమే నిదర్శనం. కులగణన కమిషన్ వేసి లెక్కలు తీసిన తెలంగాణ ప్రభుత్వం, అసెంబ్లీలో బిల్లుపెట్టి నేరుగా రిజర్వేషన్లను అమలు చేయాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. గత పదేండ్లలో పంపిన పలు తీర్మానాలను మోడీ సర్కారు తుంగలో తొక్కిన విషయాన్ని గుర్తుచేస్తున్నది.

విద్యా, ఉద్యోగాల్లో ఉన్న రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లోనూ ప్రవేశపెట్టాలని చెబుతున్నది. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి తమిళనాడు తరహాలో బీసీలకు రిజర్వేషన్లను తెలంగాణలోనూ అమలుచేసే వీలుంది.

హర్యానా గెలుపు వెనుక...



చాలామంది కుల పెద్దలు(ఖాప్ నాయకులు) అవినీతిపరులని, వారు కొత్త నాయకులను ఎదగనివ్వరని, హర్యానాలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి అలాంటి నాయకులే కారణమని మేము ప్రజలతో జరిపిన సంభాషణలలో తేలింది.హర్యానా ఎన్నికల ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి.రాష్ట్రంలో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు, అగ్నిపథ్ పథకానికి సంబంధించి యువత, భారతీయ జనతా పార్టీ రాజకీయ నాయకుడి లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళా రెజ్లర్లు వరుసగా తీవ్రస్థాయిలో నిరసనలు తెలిపారు. ఈ నిరసనల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని భావించారు. కానీ అన్ని అంచనాలకు భిన్నంగా బీజేపీ ఎన్నికల్లో గెలిచింది. ఈ నిరసనలు జాట్లలో మాత్రమే కేంద్రీకృతమై ఉన్నాయని అప్పుడు వాదించటం జరిగింది. ఈ వాదన ప్రకారం, ఇది ఎన్నికల్లో జాట్ వర్సెస్ నాన్-జాట్ ధ్రువణానికి(పోలరైజేషన్‌కి) దారితీసింది. ఈ విషయంలోని గతిశీలతను అర్థం చేసుకోవడానికి మేము హర్యానాను సందర్శించి, సింగు సరిహద్దులో జరిగిన రైతుల నిరసనల్లో చురుగ్గా పాల్గొన్న జాట్ రైతులను, ఇతర రైతు నాయకులను కలవాలని నిర్ణయించుకున్నాము.

చాలామంది జాట్ రైతులు జాట్ వర్సెస్ నాన్-జాట్ పోలరైజేషన్‌ని ఖండించలేదు. అయితే, బీజేపీ జాట్లను దుర్మార్గులుగా చిత్రించటంవల్లనే ఇది సాధ్యమైందని వారు భావిస్తున్నారు. గ్రామాల్లోని బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) కార్యకర్తలు జాట్లకు, జాట్యేతరులకు మధ్య ఉండే చిన్న చిన్న రోజువారీ సమస్యలను ఘర్షణలుగా మార్చటాన్ని వారు గమనించారు. హిందూ-ముస్లింల మధ్య కూడా ఘర్షణలు ఇలాగే జరుగుతాయని, తప్పుడు సమాచారంతో మెజారిటీ సమాజం ప్రభావితమౌతుందని వారు ఇప్పుడు గ్రహించారు.

అన్ని కులాలు, వర్గాలు కలిసి జీవిస్తాయని మాతో మాట్లాడినవారిలో చాలా మంది చెప్పారు. జాట్లకు, దళితులకు కూడా దగ్గరి సంబంధాలు ఉన్నాయి. వారి మధ్య కులాంతర వివాహాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. "మేము కలిసి ఉన్నాము కానీ ఎన్నికల సమయంలో మేము విడిపోతాము" అని ప్రతిస్పందించినవారిలో ఒకరు అన్నారు. దానికి అక్కడ వున్న దళితులు అంగీకరించారు: "అవును. జాట్లు ఓటు వేసే పార్టీకి మేము ఓటు వేయము". నిత్య జీవితంలో పరస్పరం ఆధారపడటమనే పునాదిపై సాగే సామాజిక సహజీవనం అధికారం కోసం జరిగే పోరాటాలను, ఆధిపత్యం, విపక్షతలకు సంబంధించిన ఆందోళనలను నిర్మూలించజాలదనే వాస్తవం ఈ నిగూఢ అంశాన్ని వివరిస్తుంది.

రిజర్వేషన్ల ఉప-వర్గీకరణ తర్వాత చమార్లు కాని దళితులు, ఎక్కువగా వాల్మీకులు బీజేపీకి ఓటు వేశారని కూడా జాట్ రైతులు గమనించారు. దళితులు, ఓబిసిలలోనే కాకుండా జాట్లలో కూడా ఇటువంటి విభజనల వల్ల బీజేపీ ప్రయోజనం పొందుతుందనేది ఆసక్తికరమైన విషయం. అన్ని రాజకీయ పార్టీలు ఒక నిర్దిష్ట నియోజకవర్గంలో జాట్ అభ్యర్థులను నిలబెడితే, జాట్లు గోత్రాల వారీగా విడిపోతారు. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ ఈ విధంగా జాట్ ఓట్లలో ఒక భాగాన్ని పొందింది. ఎన్నికలకు ముందు బిపిఎల్ కార్డులను కూడా బీజేపీ ఉచితంగా పంపిణీ చేసింది. ఈ కార్డులను ముఖియా లనబడే కుల పెద్దల ఆదేశాలకు అనుగుణంగా పంపిణీ చేశారు. వీరిలో చాలామంది రాజకీయంగా బీజేపీతో సంబంధంలో ఉన్నారు. వీరు బీజేపీకి అనుకూలంగా ఉండటానికి ప్రోత్సహకాలు కొంతవరకు కారణం. దళితులు, ఓబిసిలు బీజేపీకి ఓటు వేయడం రాజకీయాల్లో మార్పుకు కారణం కాదని చాలామంది భావించారు.

రైతాంగ నిరసనల సమయంలో చురుకుగా పాల్గొన్న ఒక రైతు నాయకుడి నేతృత్వంలో జాట్లు నిర్వహించిన నిరసన ప్రదర్శనను మేము మరింత దూరం పయనించాక చూశాము. స్థానిక జాట్ కుటుంబానికి చెందిన ఇద్దరు సభ్యులను హత్య చేసిన కేసులో పోలీసులు ఎటువంటి చర్య తీసుకోకపోవడానికి వ్యతిరేకంగా ఈ నిరసన జరిగింది. ఈ హత్యలను ఒక దళిత యువకుడు చేశాడనే ఆరోపణ ఉంది. అయితే సదరు రైతు నాయకుడు, ఇతరులు దీనిని సామాజిక లేదా కుల సంఘర్షణగా చూడలేదు. అంతేకాకుండా బీజేపీకి ఓటు వేసిన దళితులు తమ తప్పును గ్రహించారని, భవిష్యత్తులో కొత్తగా జాట్-దళిత ఐక్యత ఉద్భవిస్తుందని ఆ రైతు నాయకుడు వాదించారు. అయితే, జాట్‌లు, ఓబీసీలు కలవడం కష్టమని, దానికి కారణం ఓబీసీలు జాట్ నాయకత్వాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరని ఆయన అన్నారు. సాపేక్షంగా సమాన స్థాయిగల కులాల కంటే అసమాన స్థాయిలోవున్న కులాలు ఒక కూటమిగా ఏర్పడటానికి అవకాశం ఎక్కువగా ఉంటుందనే సామాజిక కోణాన్ని ఈ అంశం లేవనెత్తుతుంది.

సర్ చోటూ రామ్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ జాట్ రైతు నాయకుడి విశ్లేషణ నిజమేనేమో అనిపించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ జాట్ రాజకీయ నాయకులు, కులపెద్దలు మాత్రమే కాకుండా, బిఎమ్ సిఐఎఫ్‌కు చెందిన స్థానిక నాయకుడు కూడా కులఐక్యత గురించి అనర్గళంగా మాట్లాడారు. చాలామంది కులపెద్దలు (ఖాప్ నాయకులు) అవినీతిపరులని, వారు కొత్త నాయకులను ఎదగనివ్వరని, హర్యానాలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి అలాంటి నాయకులే కారణమని మేము ప్రజలతో జరిపిన సంభాషణల్లో తేలింది.

(టెలిగ్రాఫ్ సౌజన్యంతో)

- అజయ్ గుడవర్తి, మహేష్ చౌదరి

పన్సారే హత్యకేసు : దర్యాప్తు తీరు



ఎస్. వినయ కుమార్
9989718311

'శివాజీ కౌన్ హోతా' పుస్తక రచయిత, హేతువాద ప్రచారకర్త, కార్మిక నాయకుడు గోవింద్ పన్సారే హత్య కేసు నిందితులకు గతవారం బొంబాయి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆ సందర్భంగా సింగిల్ బెంచి న్యాయమూర్తి చేసిన వ్యాఖ్య గమనించదగింది. 'ఈ కేసులో ఇప్పటికీ ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాలను కోర్టుముందు ఉంచలేదు. కేసు ఇప్పట్లో ముగిసే సూచనలు లేవు. కనుక నేను బెయిల్ ఇస్తున్నాను' అని చెప్పారు. ఆ హత్యకేసులో పన్నెండుమందిపై కేసు బుక్కయింది. కాని పదేండ్లకాలంలో పదిమందినే అరెస్టు చేశారు. మరో ఇద్దరు ఇంకా పరారీలోనే ఉన్నారు. నరేంద్ర దబోల్కర్, కల్బుర్గి, గౌరి లంకేశ్ కేసుల్లో కూడా వీరే నిందితులు. 2015 ఫిబ్రవరి 16న మహారాష్ట్రలోని కొల్హాపూర్ నగరంలో 82ఏండ్ల పన్సారేతో పాటు ఆయన భార్య ఉమ పన్సారేపై ఇద్దరు దుండగులు కాల్పులు జరిపి పారిపోయారు. బుల్లెట్ గాయాలతో నాలుగు రోజుల అనంతరం పన్సారే ఆస్పత్రిలో మరణించారు. పన్సారే న్యాయవాది, సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తి. వ్యవసాయ కూలీ కుటుంబం నుండి వచ్చినవాడు. చదువు కోసం కొంతకాలం ఒక కళాశాలలో ప్యూన్‌గా పనిచేస్తూ ఉన్నత చదువులు చదువుకుని అదే కళాశాలలో కొద్దిరోజులు అధ్యాపకుడిగా పనిచేసిన మేధావి. కాగా కేసులోని నిందితులకు బెయిల్ ఇవ్వరాదని పన్సారే కోడలు పెట్టుకున్న పిటిషన్‌ను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

అండర్ ట్రయల్స్ ఉన్న పదిమందిలో ఆరుగురికి న్యాయమూర్తి బెయిల్ ఇచ్చారు. మరో ఆరునెలల్లో దర్యాప్తు పూర్తవుతుందని, బెయిలివ్వొద్దని ప్రాసిక్యూషన్ చేసిన వాదనను న్యాయమూర్తి పట్టించుకోలేదు. ప్రధాన నిందితుడు వీరేంద్ర సిన్హ్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను విచారణ కోసం న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసు పరిష్కారం కావడం లేదు గనుక దర్యాప్తును 2022 ఆగస్టులో యాంటీ టెర్రిస్టు స్క్వాడ్‌కు అప్పగించారు అయినా కొలిక్కి రాలేదు. నిందితులకు శిక్షపడలేదు. నిందితుల్లో ఇద్దరిని ఉమ పన్సారే గుర్తుపట్టారు కూడా. బెయిల్ పొందిన ఆరుగురినీ కూడా 2018-19ల మధ్య మాత్రమే పోలీసులు అరెస్టు చేశారంటే వారు సాధారణ హంతకులు కాదని చాలా పెద్ద నెట్‌వర్క్‌గల వారని తెలిసిపోతోంది.

ఛత్రపతి శివాజీపై పన్సారే పరిశోధనలు చేసి ఒక పుస్తకం ప్రచురించాడు. దానికితోడు అనేక పట్టణాల్లో తిరుగుతూ, శివాజీపై ఉన్న మూఢనమ్మకాలను తొలగిస్తూ ప్రసంగాలు చేశాడు. దీన్ని జీర్ణించుకోలేని మతోన్మాదులు పన్సారేను పొట్టన పెట్టుకున్నారు. ముస్లింలపై విద్వేషం రగల్చాడని శివాజీని మత రాజకీయవాదులు ఉపయోగించు కున్నారు. ఇప్పటికీ అదే పనిచేస్తున్నారు. వారు అనుసరించిన ఎత్తుగడను పన్సారే పుస్తకం ఎండగట్టింది. ఆయ న్ను మట్టుబెట్టడం ద్వారా తమ ఎత్తుగడకు ధోకా లేకుండా చేసుకోవచ్చని మతవాదులు భావించారు. కానీ వారు ఊహించిన దానికి భిన్నంగా జరిగింది. ఆయన మరణించాక ఆ పుస్తకం ఇంగ్లీషుతో సహా ఎనిమిది భాషల్లో వెలువడి కొన్ని మాసాల్లోనే లక్ష కాపీల వరకు అమ్ముడు పోయింది. శివాజీ 17వ శతాబ్దపు రాజే అయినా ఆయన చుట్టూ అల్లిన కథలు, నాటకాలు, మరాఠీ జానపద సాహిత్యం ఆయన్ని సజీవంగా ఉంచాయి. వాటిలో కల్పితాలే ఎక్కువ. మహారాష్ట్రతో పాటు ఆయన ప్రభావం తెలంగాణలోనూ, హిందీ రాష్ట్రాల్లోనూ కన్పిస్తుంది. తెలంగాణలోని చాలా పట్టణాల్లో హిందూ వాహిని పేర పెద్దపెద్ద విగ్రహాలు నెలకొల్పారు. ఏం చెప్పినా మహారాష్ట్రలో నేటికీ చెల్లుబాటు అవుతుంది. కనుక మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసే శివసేనకు,బీజేపీకి శివాజీ మహదవకాశంగా కన్పించాడు. ప్రస్తుతం డిస్నీ హాట్ స్టార్ చానెల్‌లో శివాజీ ఖజానా చుట్టూ అల్లిన కట్టుకథతో 'షిలేదార్' అనే సీరియల్ స్ట్రీమ్ అవుతోంది. శివాజీని దాన్ని అడ్డుపెట్టుకొని మత భావనలు చెదరకుండా చూసే ప్రయత్నం ఆ సీరియల్‌లో కన్పిస్తుంది.

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు, మూఢ నమ్మకాల వ్యాప్తికి సంబంధం ఉంది. కనుకే మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసే బాధ్యతను కూడా కార్మిక నాయకుడైన పన్సారే చేపట్టారు. 1869లో శివాజీ పై జోతిరావు పూలే దీర్ఘకవిత (పోవడా) రాశారు. అందులో పురోహిత వర్గం కుయుక్తులకు, మహారాష్ట్ర ద్రోహులకు వ్యతిరేకంగా పోరాడిన యోధునిగా శివాజీని అభివర్ణించారు. రైతులకు శివాజీ చేసిన మేలేమిటో పూలే తన దీర్ఘకవితలో ప్రస్తావించారు. పూలే రచనలు కూడా శివాజీ పై పరిశోధనకు పన్సారే ప్రేరేపించాయి. శివాజీపై హిందూ మతవాదులు చేసే అన్వయం వాస్తవం కాదని పన్సారే ఎలుగెత్తి చాటారు. అందుకు ఆధారంగా శివాజీ తన సైనిక దళాలకు, శిస్తు వసూల్ అధికారులకు రాసిన లేఖలను ఉదహరించారు. ఔరంగజేబుపై శివాజీ చేసిన పోరాటం మతదృష్టితో చేసింది కాదు. మహారాష్ట్రను తన అధీనంలోకి తెచ్చుకోవాలని చక్రవర్తి ఔరంగజేబు ప్రయత్నించిన మాట నిజం. రాజ్య విస్తరణకు పూనుకోవడం రాజులందరూ చేసిన పనే. హైదరాబాదు (గోల్కొండ)ను ముస్లిం రాజే పాలిస్తున్నప్పటికీ దాన్ని కూడా ఔరంగజేబు తన అధీనంలోకి తెచ్చు కోవాలనుకొన్నాడు. హైదరాబాదుపై జరిపిన సుదీర్ఘ దండయాత్రలో రెండవసారి సఫలమయ్యాడు. కాని శివాజీపై ఔరంగజేబుకు పూర్తి విజయం లభించలేదు.

శివాజీ సైన్యంలోనూ, యంత్రాంగంలోనూ, కీలక పదవుల్లో ముస్లింలున్నారు. 1659లో ఔరంగజేబు దూతగా వచ్చిన కపటి అఫ్జల్‌ఖాన్‌ను శివాజీ చంపేశాడు. ఆ తర్వాత



అఫ్జల్‌ఖాన్ శవాన్ని పూర్తి సైనిక లాంఛనాలతో ఖననం చేయించి సమాధి సంరక్షణ కోసం నిధులు మంజూరు చేశారు. ముస్లిం మత వ్యతిరేకే అయి ఉంటే ఆ పని చేసేవాడా? ఆ మతం శివాజీ పై దండయాత్ర కోసం హిందువైన రాజా జై సింగ్‌ను ఔరంగజేబు పంపారు. శివాజీ ఓటమి కోసం మహారాష్ట్ర బ్రాహ్మణులు జైసింగ్ చేత యజ్ఞం చేయించారు. నాజీల తరహాలో ఇతర మతస్థులపై శివాజీ నరమేధం సాగించలేదు. శివాజీని ఆదర్శంగా చెప్పుకునే మత పార్టీలు అందుకు భిన్నంగా వేలాది మందిని బలిగొన్న ఘటనలను మనం చూశాం.

యూరోప్‌లో మాదిరిగా మత యుద్ధాలు భారతదేశంలో జరగలేదు. హిందు రాజుల దగ్గర కీలక స్థానాల్లో

శివాజీ సైన్యంలోనూ, యంత్రాంగంలోనూ, కీలక పదవుల్లో ముస్లింలున్నారు. 1659లో ఔరంగజేబు దూతగా వచ్చిన కపటి అఫ్జల్‌ఖాన్‌ను శివాజీ చంపేశాడు. ఆ తర్వాత అఫ్జల్‌ఖాన్ శవాన్ని పూర్తి సైనిక లాంఛనాలతో ఖననం చేయించి సమాధి సంరక్షణ కోసం నిధులు మంజూరు చేశారు. ముస్లిం మత వ్యతిరేకే అయి ఉంటే ఆ పని చేసేవాడా? ఆ మతం శివాజీ పై దండయాత్ర కోసం హిందువైన రాజా జై సింగ్‌ను ఔరంగజేబు పంపారు. శివాజీ ఓటమి కోసం మహారాష్ట్ర బ్రాహ్మణులు జైసింగ్ చేత యజ్ఞం చేయించారు. నాజీల తరహాలో ఇతర మతస్థులపై శివాజీ నరమేధం సాగించలేదు. శివాజీని ఆదర్శంగా చెప్పుకునే మత పార్టీలు అందుకు భిన్నంగా వేలాది మందిని బలిగొన్న ఘటనలను మనం చూశాం.

ముస్లింలు, ముస్లిం రాజుల దగ్గర కీలక స్థానాల్లో హిందువులు పనిచేశారు. మొఘల్, కుతుబ్ షాహిల, అసఫ్ జాహిల, బీజపూర్, శివాజీ ఎవరి చరిత్రను చూసినా ఈ విషయం కనపడుతుంది. మొగలు చక్రవర్తి నవరత్నాల్లో బీర్బల్, తాన్‌సేన్‌లు ఉన్నారు. ఆయన ఆర్థిక మంత్రి రాజా తోడర్ మల్, సైన్యాధ్యక్షుడూ పనిచేసినవాడు రాజామాన్ సింగ్, అతను అక్బర్ బావమరిది కూడా గోల్కొండ కుతుబ్‌షాహిల దగ్గర అక్కన, మాదనలు కీలక స్థానాల్లో ఉన్నారు. హైదరాబాదు అసఫ్ జాహీల దగ్గర రాజా కిషన్ ప్రసాద్ లాంటి వారు మంత్రిత్వం నెరిపారు. బీజాపూర్ సుల్తాన్ దగ్గర తమకు నెలవారి వేతనాలు సరిగ్గా అందడం లేదంటూ తన దగ్గరకు వచ్చిన వేయిమంది ముస్లిం పఠాన్లను శివాజీ తన సైన్యంలో చేర్చుకున్నారు. శివాజీ అనంతరం పేష్వాల పాలనలో కూడా వారి అంతఃపురం శనివార్‌వాడకు అఫ్ఘాన్‌గార్డులు కాపలా కాసేవారు. 1857లో ఝాన్సీరాణి కోటను చుట్టుముట్టిన కంపెనీ సైన్యానికి అఫ్ఘాన్ రక్షకదళం గట్టి ప్రతిఘటనను ఇచ్చింది. హిందూ, ముస్లిం రాజులు భారతీయ బ్రిటిష్ సైనికులు కలిసి తిరుగుబాటు చేశారు. ఆ మొదటి స్వాతంత్ర్య పోరాటానికి నామమాత్రంగానైనా సరే నాయకత్వం వహించినవాడు, చివరి మొగల్ చక్రవర్తి బహద్దూర్ షా జఫర్. ఆ తిరుగుబాటును అణిచేసిన ఇంగ్లీషు ప్రభుత్వం ఆయన్ని రంగూన్ జైల్లో బంధీ చేసింది. ఆయన అక్కడే చనిపోయాడు. ఛత్రపతి శివాజీకి భవానిమాత ప్రత్యక్షమై ముస్లింలపై పోరాడేందుకు ఒక ఖడ్గం బహుకరించిందంటూ ఒక కట్టుకథ విస్తృత ప్రచారంలో ఉంది. నిజమేమిటంటే అది శివాజీకి పోర్చుగీసు వారు బహుకరించిన ఖడ్గమని, మ్యూజియంలో ఉన్న ఆ ఖడ్గంపై పోర్చుగీసు అక్షరాలున్నాయని పన్సారే ఎత్తిచూపారు. శివాజీ సైన్యంలో కనీసం పదమూడు మంది ముస్లిం సైనిక కమాండర్లు ఉండేవారు.

ఏ పరిస్థితుల్లో చేసినా శివాజీ తనరాజ్యంలో రైతులకు మేలుచేసే పలు చర్యలు చేపట్టారు. శిస్తు వసూల్ అధికారాలను ఫూడల్ యంత్రాంగం నుండి తొలగించి అందుకు అధికారులను నియమించారు. పాటిల్, దేశ్‌ముఖ్, వతందార్, ఇనాందార్ల అధికారాలను కత్తిరించారు. కనుకనే కులీనులు శివాజీని రాజుగా గుర్తించలేదు.శూద్రకులాలు శివాజీ వెంట నిలబడ్డాయి. వారి మద్దతుతో ఆయన తన రాజ్యాన్ని విస్తరించారు. శివాజీ నెలకొల్పిన విధానాలను పేష్వాలు తమ పాలనలో కూల్చేశారు. గ్రామ పెత్తందార్లు తమ పెత్తనాన్ని పునరుద్ధరించుకున్నారు. శివాజీకి ఆనాడు మద్దతుగా నిల్చిన వారిని రాచిరంపాన పెట్టారు. ఓటమిపాలైన శత్రురాజ్యాల్లోని మహిళల పట్ల శివాజీ చూపిన గౌరవమర్యాదల్ని పన్సారే ఉదాహరణతో చెప్పారు.

రైతుల నుండి శిస్తు వసూల్ చేస్తున్నప్పుడు నడుచుకోవాల్సిన పద్ధతి గురించి 1671 సెప్టెంబర్ 6వ తేదిన శివాజీ తన సుబేదార్ ఒకరికి రాసిన ఒక లేఖ పూర్తి పాఠాన్ని పన్సారే తన పుస్తకంలో ప్రచురించారు. "అధికారులు ప్రతి గ్రామం వెళ్లాలి. గ్రామంలో కౌల్దార్లందరినీ ఒక చోటుకి రమ్మనాలి. కౌల్దారు ఎంత మానవశ్రమ సమకూర్చుకోగలడో, అతని సామర్థ్యం ఎంతో నిర్ధారించుకోవాలి. దాన్నిబట్టి భూమిని ఆ రైతుకు ఇవ్వాలి. రైతు దగ్గర ఎడ్లు లేకపోతే ఒక జత ఎడ్లు ఇప్పించాలి. ఆహారం కోసం తిండిగింజలు కొలవాలి. ఆ రూపంలో ప్రభుత్వం ఇచ్చిన వడ్డీలేని అప్పును రైతులు చెల్లించగల స్థితిలో ఉన్నప్పుడు తీసుకోవాలి. రైతు పంట నష్టపోతే ఆ యేడు శిస్తు రద్దుచేయాలి. అందుబాటులో ఉన్న భూమినంతా సేద్యం కిందికి తేవాలి.

సైనికాధికార్లకు శివాజీ 1673 మే 19న ఒక లేఖ రాశారు. రైతుల నుండి తిండిగింజలు, గుర్రాలకు గడ్డి బలవంతంగా లాక్కోరాదు. సైన్యానికి అవసరమైన తిండిగింజలు, గడ్డి, వంటచెరుకు, కూరగాయలు డబ్బులిచ్చి కొనాలి. వాటికి మేము మీకు కేటాయించిన ధనం సరిపోతుంది. పంటపొలాల గుండా గుర్రాలతో పంటల్ని నష్టపరచరాదు. నావికా దళానికి కావాల్సిన పనసకర్ర కోసం రైతు అంగీకారంతో డబ్బు చెల్లించాకే చెట్టుపై చేయివేయాలి. మనుస్మృతికి భిన్నంగా ఉన్నత కులాలవారు చేసిన నేరాలకు కూడా శివాజీ కఠిన శిక్షలు వేశారు.

ఈ బడ్జెట్‌తో పేదరికం లేని భారత్ సాధ్యమేనా?



బి. వెంకట్
9490098045

2025-26కుగాను ఇటీవల పార్లమెంట్ లో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలుగింటి కోడలు. ఆమె గురజాడ మాటల్ని ఉటంకిస్తూ ప్రసంగాన్ని ప్రారంభించారు. 'తిండి కలిగితే కండ కలదోయ్.. కండ కలవాడే మనిషోయ్' అన్నారు గురజాడ. మరి ఇంత గొప్ప నీతివాక్యాల్ని పలికిన మంత్రి కేటాయింపుల్లో దేశ ప్రజలకు ఏంచేశారు? వారి ఉపాధికి, సామాజిక అభివృద్ధికి ఎంత పెంచారు? ఆలోచించాల్సిన సయమమిది.ఈ బడ్జెట్ తీరూ తెన్నుల్ని పరిశీలిస్తే గనుక సంపన్నుల కోసమే అన్నట్టుగా ఉంది తప్ప పేదలకు ఒరగబెట్టిందేమీ లేదు. గతంతో పోల్చిచూస్తే బడ్జెట్ సైజు కాస్త పెరిగిందంతే. ప్రతి పద్దుకూ ఐదు శాతం కేటాయింపులు పెరిగితే.. పోయినసారి కేటాయింపులతో సమానంగా ఉంటుంది. ఉత్పత్తి వర్గాలైన గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కార్మికులు, పట్టణ ప్రాంతాల్లోని అసంఘటిత కార్మికులు, కార్మికులు, సామాజికంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలు, ఓబీసీలు, మహిళలకు కేటాయింపులు చాలా ముఖ్యం. వారిని అడ్రెస్ చేయకుండా ఎన్ని కేటాయింపులు చేసినా నిరుపయోగమే. ఎన్ని గొప్ప పదాలు పలికినా నిష్ప్రయోజనమే.

పేదలు కడుపు నిండా తినాలన్నా, కంటినిండా నిద్రపోవాలన్నా వారికి కావాల్సింది ఉపాధి. దానికి అధిక నిధులు కేటాయించాల్సింది పోయి గతేడాదిలాగే ఈ యేడూ నామమాత్రపు నిధులు విదిల్చారు. ఇలాగైతే వారికి తిండి ఎలా కలుగుతుంది?కండ ఎలా పెరుగుతుంది? తిండి,కండ పక్కనపెడితే పూర్తిగా బక్కచిక్కి చావకుంటే చాలు. ఉపాధి హామీకి గత బడ్జెట్లో రూ.86 వేల కోట్లు ఇవ్వగా సవరించిన దాంట్లో 86 వేల కోట్లే ఇచ్చారు. ఇప్పుడూ అంతే. ఐదు శాతం పెంచాలన్నా సుమారు రూ.90 వేల కోట్లు, కానీ అంతే ఉంచారు. వాస్తవానికి ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలు కావాలంటే కనీసం రూ.2.5 లక్షల కోట్లు అవసరం. అలా కేటాయిస్తే గనుక గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గుతాయి. కొనుగోలు శక్తి పెరుగుతుంది.

ఉపాధి హామీ అంటే? మోడీ దృష్టిలో అదానీ,అంబానీ లాంటి కార్పొరేట్లకు ఉపాధి కల్పించడం. పేదరికాన్ని నిర్మూలించాలంటే ఆహార భద్రతకు ఎక్కువ నిధులు కేటాయించాలి. 24 కోట్ల రేషన్‌కార్డుల్లో 84 కోట్ల మంది ఆహార భద్రత మీద ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో రూ.2.70 లక్షల కోట్లు ఇచ్చారు. మోడీ ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ తగ్గిస్తూ పోయినేడాది రూ.2.03 లక్షల కోట్లకు కుదించింది. సవరించిన అంచనాల్లో రూ.1.97 లక్షల కోట్లకు కుదించారు. ఇక అంతకంటే ఎక్కువ కేటాయించలేనని మోడీ సర్కార్ చెప్పేసింది. ఇప్పుడు రూ.2.04 లక్షల కోట్లు ఇచ్చేస్తున్నామని ప్రకటించింది. పేదరికం లేని భారతాన్ని ఎలా సృష్టిస్తారు?

దేశంలో 65 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నారు. పోయిన ఏడాది గ్రామాలకు రూ.2.60 లక్షల కోట్లు కేటాయించింది. ఖర్చుపెట్టింది 1.90 లక్షల కోట్ల రూపాయలే. అంటే, రూ.75 వేల కోట్లను గ్రామాల అభివృద్ధికి ఇక ఖర్చు పెట్టలేమని పార్లమెంట్ సాక్షిగా మోడీ సర్కారు తెగించి చెప్పింది. వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరు శుభ్రంగా లేకపోవడం, సరైన ఆహారం అందకపోవడమేనని ఐక్యరాజ్యసమితి ఘోషిస్తున్నది. పోయిన సంవత్సరం జల్ జీవన్ (రక్షిత తాగునీటి జలాల కోసం)కు రూ.70 వేల కోట్లు కేటాయించి..దాన్ని రూ.22 వేల కోట్లకు సవరించారు. 70 శాతం నిధులనే జల్‌జీవన్‌కు వాడారు. ఇప్పుడు రూ.65 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు గొప్పగా చెప్పింది. పోయినసారే



ఖర్చు పెట్టలేదు. ఈసారి ఏం ఖర్చు పెడుతుంది?

ఇంకా విచిత్రమైన, ఆందోళనకరమైన అంశాలేమిటంటే రైతులకు అత్యంత ముఖ్యమైనది యూరియా. పోయిన బడ్జెట్‌లో యూరియాకు రూ.1.19 లక్షల కోట్లు కేటాయించి రూ.1.18 లక్షల కోట్లను ఖర్చు చేసింది. ఇప్పుడు 1.18 లక్షల కోట్ల రూపాయలనే ప్రకటించింది. వ్యవసాయానికి సరిగ్గా నిధులు ప్రకటిస్తే రైతు బతుకుతాడు. ఈ ప్రభుత్వానికి అది ఇష్టం లేదు. రైతులు బతికితే కంపెనీలు వ్యవసాయంలోకి రావు. జీడీపీలో రూ.70 లక్షల కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ రంగంపై అంబానీ, అదానీ లాంటి బహుళజాతి కంపెనీల దృష్టి పడింది. అందుకే ఫెర్టిలైజర్లకు ఇచ్చే నిధులను పెంచలేదు. రైతులు దివాళా తీస్తే కార్పొరేట్లు వ్యవసాయాన్ని కబ్జా చేయడం సులువవుతుందనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కనిపిస్తున్నది. అందుకే వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు తగ్గించిందనే విషయం తేటతెల్లమవుతున్నది.

మూడో అంశం, సామాజిక న్యాయం. ఎవరు అవునన్నా, కాదన్నా మన దేశంలో కులవివక్ష ఉంది. మతపరమైన దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇవన్నీ నిర్మూలించాలనే విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఉండాలి. సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలి. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యత కల్పించాలి. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు రూ.54 వేల కోట్లు కేటాయిస్తే..సిమెంట్, ఐరన్ రేటు పెరిగిన నేపథ్యంలో అవి సరిపోవని నిరసనల ద్వారా తెలియజేశాము. అయినా, సర్కారుకు పట్టలేదు. రూ.32,426 కోట్లు అంటే దాదాపు 40 శాతం నిధులు కేటాయించిన దాంట్లో కత్తిరించి పడేసింది. ఇది అహంభావంతో కూడుకున్న చర్య కాదా? అర్బన్ ప్రాంతానికి సంబంధించి రూ.30 వేల కోట్లు ఇచ్చారు. ఖర్చు పెట్టింది రూ.13,672 కోట్లు మాత్రమే. 60 శాతానికిపైగా నిధులు ఖర్చు పెట్టలేదు. కాగితాల్లో ఇప్పుడుల ఇండ్లు కట్టుకునేందుకు రూ.60 వేలు ఇస్తామంటున్నారు? ఏమనాలి ఈ ప్రభుత్వాన్ని? ఇండ్లు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం అనొద్దా? గతేడాది ఆరోగ్యరంగానికి రూ.89 వేల కోట్లు కేటాయించి రూ.88 వేల కోట్లే ఖర్చు పెట్టారు. విద్యారంగానికి రూ.1.25 లక్షల కోట్లు కేటాయించి ఖర్చు పెట్టింది రూ.1.14 లక్షల కోట్లే. అంటే సవరించిన దాంట్లో ఎనిమిది శాతం తగ్గించింది. సాంఘిక సంక్షేమం పట్ల మరింత దుర్మార్గంగా వ్యవహరించింది.

ఈనాటికీ అంటరానితనం విలయతాండవం చేస్తున్నది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నవారికి రక్షణ లేదు. దేశంలో కుల దురహంకార హత్యలు పెరగడమే దీనికి సజీవ సాక్ష్యం. ఈ పరిస్థితిని ఎదిరించే శక్తి రావాలంటే సామాజిక న్యాయం కీలకం. పోయినసారి రూ.52 వేల కోట్లు కేటాయించి..సవరణల్లో రూ.46 వేల కోట్లకు తగ్గించారు. అంటే 18 శాతం కుదించారు. కేటాయింపుల్లో పేపర్ల మీద బాగా చూపి గ్రామీణ ప్రాంతాలకు, సంక్షేమ రంగాలకు, సామాన్య ప్రజానీకానికి సంబంధించిన నిధుల్లో కేంద్రం నిర్దాక్షిణ్యంగా కోత పెడుతున్నదనేది ముమ్మాటికీ నిజం. రక్షణ శాఖకు పెంచింది. కార్పొరేట్లకు పన్నుల రాయితీ ఎక్కువగా ఇచ్చింది. కార్పొరేట్లకు సవరించిన అంశాల్లో పెంచుకుంటూ పోతున్నది. సామాజిక అంశాలకేమో క్రమేణా తగ్గిస్తూ వస్తున్నది. ప్రధానమంత్రి పేరుతో ఎస్సీ పిల్లల స్కాలర్‌షిప్పుకు పోయినసారి రూ.6,050 కోట్లు కేటాయిస్తే సరిపోవని స్పష్టంగా చెప్పాము. అందులో రూ.4,500 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. సవరించిన దాంట్లో 22 శాతం కోత పెట్టారు. ఎస్సీ, ఎస్టీ పిల్లలకు ఇది అన్యాయం చేయడం కాదా? ఆ పిల్లలు ఉన్నత చదువులు చదవొద్దనే కుట్ర దాని వెనుక ఉన్నట్టేగా? ఇది ఆధిపత్య కులాల బడ్జెట్ అని ఎందుకు అనకూడదు? ఇప్పుడు రూ.7 వేల కోట్లు ఇస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఎస్టీ పిల్లలకు ఇచ్చింది రూ.4,300 కోట్లు. సరిపోవని వాదించినా ఖర్చు పెట్టింది రూ.3,630 కోట్లే. సవరణ పేరుతో మోడీ సర్కారు కోత కోస్తున్నదనే విషయం స్పష్టమవుతున్నది. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఎనిమిది కోట్ల మంది మూడేండ్లలోపు చిన్నారులున్నారు. కోటిమంది వరకు గర్భిణులున్నారు. తల్లికి పౌష్టికాహారం అందిస్తే పిల్లలు ఆరోగ్యంగా పుడతారనే ఉద్దేశంతోనే అంగన్‌వాడీ కేంద్రాలను పెట్టారు. పోషణ్-1, పోషణ్-2 రెండింటికీ బడ్జెట్‌లో కోశారు. గత బడ్జెట్‌లో వైబ్రెంట్ ఇండియా అనే పథకాన్ని పెట్టారు. రూ.1,000 కోట్లు కేటాయించి రూ.209 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. వైబ్రెంట్ ఇండియా అంటే ఇదేనా?

ఈ బడ్జెట్ ఆసాంతం పరిశీలిస్తే అంతా ఆకలిచావులను పెంచే బడ్జెట్. నిరుద్యోగాన్ని పెంచే బడ్జెట్. కొనుగోలు శక్తిని తగ్గించే బడ్జెట్. అసమానతలను పెంచే బడ్జెట్. వలసలను పెంచే బడ్జెట్. కార్పొరేట్లు తయారు చేస్తే ఆరెస్సెస్ డైరెక్షన్‌లో పార్లమెంట్‌లో చదివిన బడ్జెట్. అందుకే ప్రజాపోరాటాల ద్వారానే పాలకుల మెడలు వంచాలి. హక్కుల్ని, ఆర్థిక నిధుల్ని సాధించుకోవాలి.

జర్నలిస్టులను బెదిరించడం సరికాదు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని రాయన్నపేట గ్రామంలో సినీ నిర్మాత కెపి చౌదరి అంత్యక్రియలు వార్తను కవరేజ్ కోసం వెళ్ళిన 10టీవీ జర్నలిస్టు గుగులోతు మురళిపై సినీనటి హేమ దురుసుగా ప్రవర్తించి, బెదిరించడాన్ని సిపిఎం బోనకల్ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ పంతు తీవ్రంగా ఖండించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నీడనిచ్చే చెట్లు నేలమట్టం

నవతెలంగాణ-ముదిగొండ



పాలకులు వృక్షాలను పెంచండి..వృక్ష సంపదను సంరక్షించండి అంటూ చెప్తుండగా మరోపక్క ఏపుగా పెరిగి నీడను ఇస్తున్న చెట్లను అధికారులు దగ్గరుండి నేలమట్టం చేస్తునానరు. ఈఘటన సాక్షాత్తు మండల కేంద్రమైన ముదిగొండ ప్రభుత్వ కార్యాలయంలో బుధవారం జరిగింది. ముదిగొండ విద్యాశాఖ కార్యాలయం ఆవరణంలో చుట్టూ ఉన్న నీడనిచ్చే చెట్లు అదే శాఖ అధికారులు దగ్గరుండి చెట్లను తొలగించారు. నీడనిచ్చే చెట్లను తొలగించడంపై రానున్న వేసవికాలంలో ఇబ్బందులు ఎదురవుతాయని కార్యాలయంకు వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

ప్రణాళికతో చదివి విజయం సాధించాలి : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం

జీవితంలో విద్యార్థులు ప్రణాళికతో చదివి నిర్దేశించుకున్న లక్ష్యం సాధించడంలో విజయవంతం కావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్, స్థానిక ఎస్.ఎస్.పి. క్యాంప్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన, మోటివేషన్ తరగతులను పరిశీలించారు. అంతకుముందు మోటివేషన్ స్పీకర్ నాగేశ్వర్‌రావు పిల్లలకు నిర్వహించిన అవగాహన, మోటివేషన్ తరగతిని జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి కూర్చొని ఆసక్తిగా విన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రావినూతల-నారాయణపురం రోడ్డుకు నిధులు మంజూరు పట్ల కృతజ్ఞతలు

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని రావినూతల నుంచి వయా నారాయణపురం మీదుగా చిన్న బీరవల్లి వరకు బీటీ రోడ్డుకు రూ 3.33 కోట్లు మంజూరు చేయటం పట్ల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు నారాయణపురం కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మల్లు భట్టి విక్రమార్కకు ప్రత్యేకంగా నారాయణపురం గ్రామ కాంగ్రెస్ నాయకుడు సూర్యదేవర సుధాకర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించడానికి కృషి చేసిన టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, మాజీ జడ్పిటిసి మోదుగు సుధీర్‌బాబు, మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి కోటేశ్వరరావులకు నారాయణపురం గ్రామ కాంగ్రెస్ క్లస్టర్ ఇంచార్జి చేబ్రోలు వెంకటేశ్వర్లు, నారాయణపురం కాంగ్రెస్ బండి పవన్, గ్రామ శాఖ అధ్యక్షులు బత్తినేని తిరుపతయ్య, కుంటముక్కలు ప్రభాకర్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

కన్నవారి కలలు నిజం చేయాలి : తహశీల్దార్

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలోని న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ పాఠశాలను ముదిగొండ తహశీల్దార్ సునీతా ఎలిజబెత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్ రూమ్, బాత్రూంలతోపాటు, తరగతి గదులను ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ఆమె మాట్లాడుతూ సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులందరితో ముచ్చటిస్తూ కలిసి వారితో సమానంగా నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. తహశీల్దార్ వెంట రెవిన్యూ ఇన్స్పెక్టర్స్ వహీదాసుల్తానా, ప్రసన్న కుమార్, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిరా, ఉపాధ్యాయులు ఉన్నారు.

మిర్చి ధర పడిపోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఖాసీం

నవతెలంగాణ-కొణిజర్ల

మిర్చి ధర పడిపోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు షేక్ ఖాసీం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గుబ్బగుర్తి గ్రామాల్లో మిర్చి రైతుల తోటి కలిసి మిర్చి కల్లాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్టపడి మిర్చి పంటని పండిస్తే అమ్మేసమయంలో సగానికి సగం రేట్లు తగ్గడం వలన అసలు, కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చిని స్థానిక వ్యాపారులే తక్కువ రేట్ కి కొనుగోలు చేస్తున్నారన్నారు. గత సంవత్సరం మిర్చి వ్యాపారులు సుమారు 50 లక్షల బస్తాలు మిర్చిని కొనుగోలు చేసి ఏసీల్లో పెట్టుకొని అమ్ముకున్నారని, ఈ ఏడాది కూడా తక్కువ ధరకు కొనుగోలు చేసి మళ్లీ ఏసీల్లో పెట్టుకుంటున్నారన్నారు. మిర్చి ధరలు తగ్గటం వల్ల రైతులు క్వింటాకి పది వేలు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ ఉపేందర్‌కు సీపీ అభినందనలు

నవతెలంగాణ- ముదిగొండ



ముదిగొండ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నేలమర్రి ఉపేందర్ పోలీస్ మీట్ ఆఫ్ స్టేట్ లెవెల్ హ్యాండ్ బాల్ విభాగంలో జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు కరీంనగర్ పిటిసి, సిటిసిలో జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చగా సీపీ సునీల్ దత్ బుధవారం కమిషనర్ కార్యాలయంలో అభినందించారు. మూడు జిల్లాల నుండి ఏడుగురు కానిస్టేబుళ్ళు భద్రాద్రి జోన్ తరుపున రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనపరిచి తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. సీపీతో పాటు ముదిగొండ సిఐ వడ్డేపల్లి మురళీ ఉపేందర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి ..ఏడుగురిపై కేసు నమోదు

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని గనియతండ సమీపంలో సాగర్‌కాల్వపై పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం రాత్రి ఎస్ఐ డి.హరిత ఆధ్వర్యంలో దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులు పరారుకాగా ఐదుగురుని అదుపులో తీసుకున్నారు. రూ 9,040నగదు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నవతెలంగాణ-ముదిగొండ



వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి,సురక్షితంగా తమ గమ్య స్థానాలకు చేరుకోవాలని పోలీసులు అన్నారు. మండల కేంద్రమైన ముదిగొండలో పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు, ఆర్టీఓ జారీచేసిన చట్ట ప్రకారమే వాహనాల్లో పరిమితికిమించి ప్రయాణికులను ఎక్కించవద్దని, డ్రైవర్ ముందు సీటులో కుడి, ఎడమ పక్కన ఎవరిని కూర్చోబెట్టొద్దని పోలీసులు చెప్పారు.

బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

నవతెలంగాణ - బోనకల్

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మక ఘట్టానికి అసెంబ్లీ వేదికైందన్నారు.కుల గణనతో బీసీలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు. బీసీల హక్కుల సాధనలో ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్లు బలహీన వర్గాల చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం దేశ బిసి కుల గణనకు మరింత బలం చేకూరుస్తుందన్నారు.షెడ్యూల్ కులాలకు సంబంధించి కూడా వర్గీకరణ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం మరో చారిత్రక నిర్ణయం అన్నారు. ప్రతిపక్షాల పొంతన లేని మాటలు కుల గణనపై అనవసర రాద్ధాంతాలు రాష్ట్రానికి కీడు చేస్తాయి తప్ప న్యాయం చేయలేవు అన్నారు.పూర్తి పారదర్శకంగా సమయం వెచ్చించి కులగణన జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న బలహీన వర్గాల వారు బాగుపడడం జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారన్నారు. సామాజిక న్యాయం, సమపాలన తెలంగాణ ప్రజలకు అందాలని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ చారిత్రక నిర్ణయం తీసుకుని తెలంగాణలో బలహీన వర్గాలకు రిజర్వేషన్లను జనాభా ప్రతిపాదికను పెంచటం గొప్ప నిర్ణయం అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వానికి బలహీన వర్గాల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలి

- రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి
- మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలి
- కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టం చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్‌లు

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్





కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మద్దతు ధర చట్టం చేయాలని, రైతులకు పంటలకు పెట్టుబడి సాయం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఉన్న వ్యవసాయ మార్కెట్లో మిర్చికి వస్తున్న ధరను రైతులను అడిగి తెలుసుకోవటానికి మిర్చి మార్కెట్ యార్డుని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు, యర్రా శ్రీకాంత్‌లు మాట్లాడుతూ రైతులు అసలే నకిలీ విత్తనాలతో మోసపోతా ఉన్నారని, అంతేకాకుండా మిర్చి పంటకు ఎకరాకు లక్షల రూపాయలు పెట్టుబడి అవుతుందని, మిర్చి ధర గత సంవత్సరం ఒక క్వింటాలకు 25 వేల రూపాయలు పలికిన ధర ఈ సంవత్సరం జెండా పాట 15 వేల రూపాయలు చేయడం 13వేల రూపాయలు రైతుల నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ మిర్చిని నాణ్యతగా తెస్తున్నా జెండాపాట ప్రకారం కొనుగోలు చేయడం లేదన్నారు. అందరి రైతుల దగ్గర కూడా జెండా పాట ప్రకారం కొనుగోలు చేయాలని, అలా చేయని పక్షంలో రైతులు చాలా నష్టపోతా ఉన్నారన్నారు. ఇక్కడ ఖరీదారులు కూడా రేట్లు తగ్గించి కొనడం జరుగుతుందన్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం పత్తికి గాని మిర్చికి గాని కనీసం మద్దతు ధర ప్రకటించకుండా మార్క్ఫెడ్ విధానాన్ని నాఫెడ్ విధానాన్ని తీసుకురావాలన్నారు. దాని ద్వారా మిర్చి ఖరీదును చేయాలని, ఆ విధంగా రైతుకి కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఢిల్లీలో రైతులు ఒక సంవత్సర కాలం నుండి తమ హక్కుల కోసం మద్దతు ద్వారా కావాలని పోరాటాలు చేస్తా ఉంటే మోడీ ఏమీ పట్టించుకోకుండా మౌనంగా ఉంటున్నాడన్నారు. వెంటనే రైతుల సమస్యలు తెలుసుకొని రైతు నాయకులను చర్చలకు పిలిచి వాళ్ల సమస్యల పరిష్కారం చేసే విధంగా కృషి చేయాలని అన్నారు. అలాంటప్పుడే రైతు క్షేమంగా ఉంటాడని లేనిపక్షంలో రైతులు చాలామంది పెట్టుబడి కూడా రాకుండా నష్టపోతారన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావుని, మార్కెట్ కార్యదర్శిని కలిసి రైతుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, షేక్ మీరా సాహెబ్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బండారు యాకయ్య, ఖమ్మం డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు వజేనపల్లి శ్రీనివాసరావు, నాయకులు 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, షేక్ సైదులు, షేక్ హిమామ్, యర్రా రంజిత్, శీలం వీరబాబు, వ్యాపార వర్గాల నాయకులు పోతురాజు జార్జి, బండారు వీరబాబు, బజ్జూరి రమణారెడ్డి, పగడాల మోహన్రావు, ఈశ్వర్, మేడబోయిన లింగయ్య, రంగు హనుమంత చారి, షేక్ బాబు, మహిళా సంఘం త్రీ టౌన్ అధ్యక్షురాలు బండారు సునీత తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- దేశవ్యాప్త నిరసనలో పాల్గొన్న ఆర్టీసీ ఖమ్మం డిపో కార్మికులు
- గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలి
- రాష్ట్ర నేతలు గడ్డం లింగమూర్తి, బత్తినేని హనుమంతరావు

నవతెలంగాణ-ఖమ్మం



భారతదేశ కార్మిక వర్గానికి అనుకూలంగా ఉన్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించడాన్ని నిరసిస్తూ, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం దేశ వ్యాపిత నిరసన దినం పాటించాలని జాతీయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్-ఎస్‌డబ్ల్యూఎఫ్ (సిఐటియు), స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్-ఎస్‌డబ్ల్యూయు (ఐఎన్‌టియుసి) సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం డిపోలో కార్మికులు నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూయు రాష్ట్ర కార్యదర్శి బత్తినేని హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 26 కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్‌గా రూపొందించారని, భారతదేశ కార్మిక వర్గానికి నష్ట దాయకమైనటువంటి, కార్మికుల శ్రమశక్తిని కారుచౌకగా పెట్టుబడు దారులకు దోచిపెట్టి కార్మికులను కట్టు బానిసలుగా నిలబెట్టేందుకు రూపొందించిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే 26 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆర్టీసీలో కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, ఆర్టీసీలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ఖమ్మం రీజనల్ కార్యనిర్వాహక అధ్యక్షులు గుండు మాధవరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సుల పథకంలో మార్పులు చేయాలని, ఆర్టీసీ సంస్థ ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి నిర్వహించేందుకు గాను ఆర్టీసీలకు నిధులు సమకూర్చాలని కోరుతూ విద్యుత్ బస్సులు, ప్రజలు ఆర్టీసీపై ప్రభావం అనే అంశంపై ఈనెల 7న, శుక్రవారం సాయంత్రం ఖమ్మం డిపో వద్ద జరిగే బహిరంగ సదస్సులో ఆర్టీసీలోని అన్ని సంఘాల నాయకులకు ఆహ్వానం పలుకుతున్నామని, బహిరంగ సదస్సులో పాల్గొనడం ద్వారా విద్యుత్ బస్సుల పథకం పై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.ఆర్టీసీ ఉద్యోగులందరూ పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పగిళ్లపల్లి నరసింహారావు, బుగ్గవీటి లింగమూర్తి, కుక్కల కృష్ణయ్య, బొక్కా నాగిరెడ్డి, ఆర్.వీరబాబు, బండి పుల్లయ్య, రమా, జొన్నలగడ్డ జయశ్రీ, గౌస్ పాషా, లాల్ బీ, జ్యోతి, రేణుక, శోభారాణి, రమణకుమారి, షేక్ జానీ, విజయలక్ష్మి రాధ, యమున, మీసాల రవి, రాంబాబు, రఘు, కిరణ్, స్వామి, మల్లికాంబ, శోభారాణి, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.



10న కేంద్ర బడ్జెట్ పై మహాధర్నా

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బండి పద్మ

నవతెలంగాణ-ముదిగొండ

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఈనెల 10న హైదరాబాద్‌లో మహా ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి పద్మ, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు తెలిపారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో సిపిఐ(ఎం) మండల కమిటీ సమావేశం పంద్రకొల రాంబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు, బిజెపి తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్న నిధులు తేవటంలో వైఫల్యం చెందారన్నారు. దేశ ప్రజల బడ్జెట్ కాదని, ఎన్నికల బడ్జెట్ అని వారు విమర్శించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పేద వర్గాల ప్రజలను కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో బీసీల రిజర్వేషన్ పెంచాలన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని బండి పద్మ, మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. రైతు భరోసా రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. హైదరాబాదులో జరిగే మహాధర్నాకు పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్రా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మండల నాయకులు టీఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, పయ్యావుల ప్రభావతి, మందరపు పద్మావతి, కోలేటి అరుణ, ఇరుకు నాగేశ్వరరావు, బట్టు రాజు, రాయల శ్రీనివాసరావు, మేడా నారాయణ, చెన్ను అంజయ్య, మంకెన దామోదర్, కోలేటి ఉపేందర్‌రావు, యంద్రపల్లి రవికుమార్, కందిమల్ల తిరుపతి, మాదారపు సత్యనారాయణ, నంబూరి వెంకటేశ్వరరావు, సామినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీనివాసరావు

నవతెలంగాణ- నేలకొండపల్లి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులతో సంబంధం లేకుండా పేదలందరికీ 12 వేల రూపాయల ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం సంఘం మండల కార్యదర్శి దుగ్గి వెంకటేశ్వర్లు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పేదలందరికీ 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించే విషయంలో ఉపాధి హామీ పనులకు లింకు పెట్టడం వెనుక లబ్ధిదారులను కుదించేందుకు చేసే కుట్రలో భాగమేనన్నారు. ప్రతి పేదవాడికి ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు తగ్గించడం ద్వారా భవిష్యత్తులో పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో సంపన్నులకు కొమ్ము కాస్తూ పేదలకు మాత్రం నిత్యావసరాల ధరలు పెంచుతూ పన్నుల రూపంలో భారాలు మోపిందని మండిపడ్డారు. పేదల కష్టాన్ని పన్నుల రూపంలో గుంజుకుని కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. రైతులు రుణాలు తీసుకుంటే జప్తు చేసి వసూలు చేసే ప్రభుత్వం సంపన్నులు తీసుకునే వేలకోట్ల రూపాయలు ఎగ్గొట్టిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవసాయ కూలీలు, కార్మికులు, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడాన్ని నిరసిస్తూ స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరి పొట్టి శ్రీరాములు సెంటర్లో ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలను కాల్చివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షుడు కె.వి.రామిరెడ్డి, పెదపాక మల్లేశ్వరరావు, కాల్వ కోటేశ్వరరావు, పొట్ట పింజర వెంకటేశ్వర్లు, కొలికపొంగు వెంకటనరసయ్య, వెంకటప్పయ్య, బొడ్డు ఆంజనేయులు, గుడిపూడి వెంకటేశ్వర్లు(స్వామి), సామల మల్లికార్జున్‌రావు, పెదపాక నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశంలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించిన కాంగ్రెస్ పార్టీకి దళితుల పట్ల బీసీల పట్ల అ పారమైన ప్రేమ ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలను నిర్వహించారు. అనంతరం ర్యాలీని ర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు శీలం ప్రతాపరెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, కడియం శ్రీనివాసరావు, పంభి సాంబశివరావు, షేక్ ఇస్మాయిల్, మల్లెల లక్ష్మణరావు, మూల్పూరి శ్రీనివాసరావు, పసుపులేటి వెంకటనారాయణ, రాజీవ్‌గాంధీ, గుడేటి బాబురావు, దేవరకొండ శ్రీనివాసరావు, లింగాల నాగేశ్వరరావు, సగుర్తి వెంకటనారాయణ, కొండ, అనిల్ కుమార్, సగుర్తి కిషో ర్, దేవరకొండ రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను విస్మరించిన కేంద్ర బడ్జెట్

- 10న హైదరాబాదులో మహాధర్నా
- అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-కొణిజర్ల



బడ్జెట్లో తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం పూర్తిగా అన్యాయం చేసిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు విమర్శించారు. పార్టీ మండల కమిటీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయం సంక్రాంతి రామచంద్ర భవన్‌లో మోత్కూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వివిధ రంగాలకు తగిన స్థాయిలో నిధులు కేటాయించుకోవటాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాదులో మహా ధర్నా కార్యక్రమం చేపట్టామని ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని నిరసనలో పాల్గొనాలి పిలుపునిచ్చారు. సీతారామ ప్రాజెక్టు కనీసం బడ్జెట్లో రూపాయి కేటాయించలేదని, బయ్యారం పరిశ్రమ ఏర్పాటు ఊసేలేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. వ్యవసాయరంగానికి పూర్తిగా విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్ రూపొందించారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఫిబ్రవరి 10న ఖమ్మం కదిరలి రావాలని కోరారు. సమావేశంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, జిల్లా కమిటీ సభ్యురాలు మెరుగు రమణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, వైరా డివిజన్ కమిటీ సభ్యులు దొడ్డపునేని కృష్ణార్జునరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తాతా పద్మ, మండల కమిటీ సభ్యులు కట్టా రాంబాబు, చింతపల్లి ప్రసాదరావు, తాళ్లపల్లి విజయ, భానోత్ హరిచంద్, లింగాల చిన్న దానయ్య, కురెల్లి సరోజిని, కావూరి సత్యనారాయణ, షేక్ మహబూబ్ అలీ, మురికిపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు వితరణ

- పూర్వ విద్యార్థుల సహకారం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలనే మంచి ఉద్దేశంతో ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు బెంచీలను వితరణ చేశారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యనభ్యసించిన జమలాపురం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు ఇండియన్ ఆర్మీలో పని చేస్తున్న ముల్లంగి రమేష్, బిఎస్ఎఫ్‌లో పనిచేస్తున్న గద్దల కిరణ్ వీరిద్దరూ ఇండియా సరిహద్దులలో పనిచేస్తు 50 వేల రూపాయల విలువ కలిగిన 8 బెంచీలను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగులవంచ జ్యోతి మాట్లాడుతూ వీరిని ఆదర్శంగా తీసుకొని ఈ పాఠశాల నందు చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు తమ తోడ్పాటును అందించాలని కోరారు. బెంచీలను పాఠశాలకు అందించిన పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి లాజరు, గద్దల కిషోర్, గద్దల రాజశేఖర్, మేసిపోగు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

- సైబర్ క్రైమ్ ఏసీపీ

నవతెలంగాణ-ఖమ్మం

సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ.. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఫణిందర్ అన్నారు. విజయ ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో సైబర్ క్రైమ్స్‌పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాల పై రిపోర్ట్ కోసం సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించండి

- ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం

నవతెలంగాణ-కల్లూరు

కిష్టయ్యబంజర గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ ప్రజలకు తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించండని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులు చక్రవర్తి, పంచాయతీ ప్రత్యేక అధికారి రత్తమ్మ, ఇన్చార్జి కార్యదర్శి సరోజిని ఆధ్వర్యంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. గత కొంతకాలంగా నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని మంగళవారం ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం



పత్రికల్లో రావడంతో స్పందించిన ఎమ్మెల్యే ప్రజలకు ఇబ్బందులు కలుగుకుండా తాగునీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పైప్ లైన్ జంక్షన్‌లకు అడ్జస్మెంట్ గేట్ వాల్వు ఏర్పాటు, పైపుల జాయింట్ పనులు చేపట్టారు. ఒకటి రెండు రోజుల్లో నీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కార్యదర్శుల ఇష్టారాజ్యం

- స్థానికంగా ఉండరు.. గ్రామాలలో సమస్యలు పట్టించుకోరు
- డీఎస్ఆర్ యాప్ సిమ్ కార్డులు గుమస్తాల చేతిలో...

నవతెలంగాణ-వేంసూరు

మండలంలో 26 గ్రామ పంచాయతీలలో 16 మంది పంచాయతీ కార్యదర్శులు జిల్లా కేంద్రంలో ఉండి విధులు నిర్వహించటంతో గ్రామాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు విపరీతంగా పెరగటం, గ్రామాలలో ఫాగింగ్ నిర్వహించకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రతిరోజు పిఎస్‌సి ఆధ్వర్యంలో గ్రామాలలో వైద్య క్యాంపులు నిర్వహిస్తున్నారు. కార్యదర్శులు మాత్రం వారంలో నాలుగు రోజులు విధులకు వస్తారని, వచ్చిన రోజు 12 గంటలకు రావటం రెండు గంటలకు వెళ్లటం ఆనవాయితీగా వస్తోంది. ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో డైలీ శానిటేషన్ రిపోర్టుకు డీఎస్ఆర్ యాప్ ద్వారా హాజరు వేసుకోవటం, ప్రతిరోజు ఉదయం 9 గంటలకు గ్రామపంచాయతీలో రెండు ప్రదేశాలలో యాప్ ద్వారా డ్రైన్లు అంగన్వాడీ నర్సరీలు షెడ్లలో ఫొటోలను అప్లోడ్ చేయవలసి ఉంది. ఆ యాప్ సిమ్‌లను గుమస్తాల చేత చేయించడం విధులకు డుమ్మా కొట్టడం అంతా సంబంధిత అధికారి ఆదేశాలు మారకే జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెల హెచ్ఆర్ఏ తీసుకుంటున్నారు. మండలానికి చెందిన కొందరు కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యేకి ఫిర్యాదులు చేశారు. డివిజన్ వ్యాప్తంగా (టాక్సు) ఇంటి పన్నుల వసూళ్లలో మండల చివరి స్థానంలో 38 శాతం వసూళ్లు బట్టి మండలంలో ఎంపీఓ పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఈ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు

అందుబాటులో ఉండడం లేదు : పిల్లి భాస్కర్, మర్లపాడు

గ్రామాలలో చిన్న చిన్న అవసరాలకు గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి తిరగాల్సి వస్తుంది. కూలి పనులకు వెళ్లేవారు పనులను మానుకుని ఎంపీడీవో కార్యాలయానికి వస్తున్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా



స్పందించి స్థానికంగా గ్రామాలలో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటే ప్రజలకు అందుబాటులో ఉంటారు.

ఫాగింగ్ చేయాలి : అరవపల్లి జగన్మోహన్రావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి

అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామాలలో దోమల వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఫాగింగ్ చేయించాలి.

బడ్జెట్లో వ్యవసాయ, అసంఘటిత రంగాలకు
రెండు లక్షల కోట్లు కేటాయించాలి

- అఖిల పక్ష కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-ఖమ్మం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 - 26 బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, అసంఘటిత రంగానికి రెండు లక్షల కోట్ల రూపాయలను కేటాయించాలని అఖిలపక్ష కార్మిక, రైతు సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం ఖమ్మం అంబేద్కర్ సెంటర్‌లో ఐఎన్‌టియుసి, ఏఐటియుసి, సిఐటియు, టియుసిఐ, ఐఎఫ్టియు, ఏఐకేఎస్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్, వ్యవసాయ కార్మిక కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎండి వై.పాషా, టీయుసిఐ జిల్లా నాయకులు సి.వై పుల్లయ్య ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ఐ. వెంకన్న మాట్లాడుతూ 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్ల పన్నులు తగ్గించి, పెట్టుబడిదారుల, ఆస్తులను పెంచి వారిని సంపన్నులుగా మార్చేలా ఉందన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు తగ్గేల సామాన్యులకు లాభం చేకూరేలా ఏ ఒక్క అంశం లేదన్నారు. 50,65, 345 కోట్ల బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేవలం 2.7 శాతం మేర 1,32,470 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించారన్నారు. 2024 - 25వ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి 1,31,195 వేల కోట్ల రూపాయల కేటాయించినా విడుదల చేసింది కేవలం మాత్రం 87003 వేల కోట్ల రూపాయలు మాత్రమేనన్నారు.



కార్మికులు దాచుకునే పీఎఫ్, ఇతర విషయాలలో కేంద్ర ప్రభుత్వ జోక్యం పెరిగి వారికి రావాల్సిన పరిహారంలో చాలా ఇబ్బందులు తలెత్తయన్నారు. లేబర్ కోడుల కారణంగా కార్మికుల హక్కులు హరించి పోయే అవకాశం ఉందన్నారు. 42వ లేబర్ కాంగ్రెస్ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ రంగాలలో 46 శాతం ప్రజలు పనిచేస్తుండగా, మిగిలిన 29 మంది ప్రజలు అసంఘటిత రంగంలో పనిచేసి ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూరుస్తున్న తరుణంలో బడ్జెట్లో ఆయా రంగాలకు కేటాయింపులు చేయకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. ఇప్పటికైనా మోడీ తన నియంతృత్వ పోకడలను మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విష్ణు, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వై.విక్రం, పి.రమ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, వత్సవాయి జానకి రాములు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు, నగర అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు, జిల్లా నాయకులు పాల్వంచ కృష్ణ, ఏఐటియుసి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర కార్పొరేటర్ బి. జి. క్లెమెంట్, జిల్లా అధ్యక్షులు గాదే లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఎండి జాకీరుద్దీన్, జిల్లా నాయకులు ఏ శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు షేక్ సుభాహాన్, జిల్లా నాయకులు గూగులోతు పటేల్ , గౌని, మోహన్ రావు పాల్గొన్నారు.

పది నెలలుగా జీతం లేదు

- పస్తులుండి ప్రజల దాహార్తిని తీరుస్తున్నాం : బోరు మెకానిక్ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-కామేపల్లి

గ్రామ పంచాయతీలో ఎక్కువగా ప్రజలు మంచినీటి బోర్లపై ఆధారపడి ఉన్నారు. మిషన్ భగీరథ నీరు వస్తున్న అప్పుడప్పుడు రిపేర్లతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు బోర్లే దిక్కు. మండలంలో ఏకైక మెకానిక్‌గా ఉన్న లక్ష్మీనారాయణ నిత్యం ప్రజల దాహార్తిని తీరుస్తూ. తను మాత్రం పది నెలలుగా జీతం లేకుండా పనిచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

భార్య హత్య కేసులో ముదిగొండ మండలం బాణాపురం తండాకు చెందిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ తేజావత్ ఉపేందర్ నాయక్, అతడి తల్లి పద్మకు జీవిత ఖైదు విధిస్తూ ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. రాజగోపాల్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా పాలారాం తండాకు చెందిన భూక్యా కల్యాణికి ఉపేందర్ నాయక్‌తో 2017 మే 18న వివాహం జరిగింది. వీరికి ఒక పాప పుట్టిన తర్వాత అదనపు కట్నం తేవాలంటూ భర్త ఉపేందర్ తోపాటు అత్త పద్మ, మామ కృష్ణ, ఆడపడుచు కవిత కలిసి వేధింపులకు గురిచేశారని 2019లో అనంతగిరి ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. 2020 ఫిబ్రవరి 12న మీ కూతురు కళ్లు తిరిగి పడిపోయిందని అల్లుడు ఫోన్ చేసి చెప్పడంతో కళ్యాణి తల్లిదండ్రులు వెంటనే వెళ్లి చూడగా ఆమె శరీర భాగాలపై రక్త గాయాలై విగతజీవిగా పడి ఉంది. తండ్రి కాళియా ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్తమామలు, ఆడపడుచు, మరో మహిళపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు, ప్రభుత్వ పక్షాల వాదనలను పరిశీలించిన న్యాయమూర్తి రాజగోపాల్, భర్త ఉపేందర్ నాయక్, అత్త పద్మపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధించారు. మామ కృష్ణ ఆడపడుచు కవిత మరో మహిళ అరుణను విడుదల చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ శంకర్ వాదించగా అధికారులు కె.శ్రీకాంత్ డి.నాగేశ్వరరావు, సీడీఓ పి. ఆదినారాయణ ఏ సూర్యనారాయణ, యూసూఫ్ సహకరించారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు అప్రజాస్వామికం

నవతెలంగాణ-తల్లాడ

మాజీ సర్పంచులను ముందస్తు అరెస్ట్ చేయటం అప్రజాస్వామికమని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు అన్నారు. జేఏసీ పిలుపుమేరకు హైదరాబాద్ వెళ్లే తాజా మాజీ సర్పంచులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసి 13 నెలలైనా వారి బిల్లులు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. అనేక చోట్ల అప్పులు తెచ్చి గ్రామపంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులను విడుదల చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలపై చూపుతున్న నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం అన్నారు. బిల్లులను విడుదల చేయాలని అనేకమార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళిన బిల్లులు విడుదల చేయకుండా మొండిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లేందుకు హైదరాబాదు వెళుతున్న మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఇకనైనా బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లపై నిఘా

నవతెలంగాణ-ఖమ్మం

ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవర్లు అధిక సంఖ్యలో పట్టుబడుతున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ట్రాఫిక్ పోలీసులు ప్రతిరోజు నగరంలో వాహనాల తనిఖీలు చేపడుతున్నారని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం మత్తులో వాహనాలను నడపడం ఒకటైతే మరొకటి ర్యాష్ డ్రైవింగ్ అని, అదేవిధంగా మైనర్లు బైకులు, కార్లు నడుపుతూ వరుసగా ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. గతంలో మైనర్ డ్రైవింగ్ చేస్తు పోలీసు వారికి పట్టుబడితే జరిమానా వేసి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించడం జరిగిందని, ఇక నుంచి డ్రైవింగ్ చేస్తున్న మైనర్ల వాహనాలు సీజ్ చేసి, వారితో పాటు వారి తల్లిదండ్రులను న్యాయస్థానంలో హజరు పరచడం జరుగుతుందని, తద్వారా న్యాయస్థానం శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుందని అన్నారు. అదేవిధంగా లైసెన్సు, నంబర్ ప్లేట్ నంబర్ సక్రమంగా లేని, నంబర్ ట్యాంపరింగ్ కలిగిన, నంబర్ తుడిపివేసిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామని పట్టుబడిన వాహనాలపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



కెమెరాలు పగలగొడతానని సినీనటి హేమ హెచ్చరిక

- టెన్ టీవీ జర్నలిస్ట్ మురళిపై దురుసుగా ప్రవర్తన
- బెదిరింపులపై టీడబ్ల్యూజేఎఫ్ ఖండన రాయన్నపేటలో ఘటన



జర్నలిస్టుకు చేతులు చూపుతో బెదిరిస్తున్న సినీనటి హేమ



అంత్యక్రియలకు హాజరైన సినీ ఆర్టిస్టులు

నవతెలంగాణ-బోనకల్

వార్త కవరేజ్‌కి వెళ్లిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై సినీనటి హేమ దురుసుగా ప్రవర్తించి బెదిరించిన సంఘటన మండల పరిధిలోని రాయన్నపేట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. జర్నలిస్టులపై హేమ ప్రవర్తించిన తీరును టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఫొటోలు తీస్తే కెమెరాను పగలగొడతానని బెదిరించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బోనకల్ మండల పరిధిలోనే రాయన్నపేట గ్రామానికి చెందిన సినీ నిర్మాత బోడేపూడి కృష్ణ ప్రసాద్ చౌదరి (కేపీ చౌదరి) సోమవారం గోవాలో ఆత్మహత్య చేసుకున్న సంగతి విదితమే.

మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తన స్వగ్రామమైన రాయన్నపేటకు కుటుంబ సభ్యులు మంగళవారం అర్ధరాత్రి తీసుకువచ్చారు. కేపీ చౌదరి అంత్యక్రియలలో పాల్గొనటానికి తెలుగు సినిమా రంగానికి చెందిన పలువురు సినీ నటులు, నటీమణులు వస్తున్నట్లు రెండు రోజులుగా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అదేవిధంగా కేపీ చౌదరి ఆత్మహత్య కూడా సంచలనంగా మారడంతో పలువురు జర్నలిస్టులు వార్త కవరేజ్ కోసం బుధవారం గ్రామానికి వెళ్లారు. అంత్యక్రియల అంతిమయాత్రలో సినీ నటీమణులు సురేఖ వాణి, జ్యోతి, దేవి, ఇంకా పలువురు పాల్గొన్నారు. అంత్యక్రియల అనంతరం ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు కేపీ చౌదరి ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ హేమ ఉన్నారు. ఈ క్రమంలో టెన్ టీవీ రిపోర్టర్ గుగులోతు మురళి వాయిస్ ఇవ్వమని హేమను అడిగారు. అక్కడ కొద్ది మందితో మాట్లాడుతుండగా మురళి వీడియో తీయటానికి ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా హేమ ఆవేశంతో వీడియో తీయవద్దని చెప్పడంతో ఆపేశారు. బోడేపూడి కృష్ణ ప్రసాద్ చౌదరిని మీరే చంపేశారని, హెడ్లైన్స్‌కు డబ్బులు ఉండవా, డబ్బులు లేవని అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని రాశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. మాకు పిల్లలు ఉన్నారని, మీకు పిల్లలు లేరా వీడియో తీస్తే కెమెరాలు బద్దలు కొడతానని ఇక్కడి నుంచి తక్షణమే వెళ్ళిపోవాలని నటి హేమ చిందులు వేసింది. జర్నలిస్టుపై హేమ దురుసుగా ప్రవర్తించి, బెదిరించటాన్ని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. బోనకల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సురభి వెంకన్న, యార్లగడ్డ శ్రీనివాసరావు, విలేకరులు ఖండించారు.

తండ్రికి తల గొరివి పెట్టిన పదేళ్ల కుమారుడు

గోవాలో ఆత్మహత్య చేసుకున్న రాయన్నపేట గ్రామానికి చెందిన బోడేపూడి కృష్ణ ప్రసాద్ చౌదరి అంత్యక్రియలు రాయన్నపేట గ్రామంలో బుధవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు భార్య శ్రేషిత, పదేళ్ల కుమారుడు కార్తికేయ హాజరయ్యారు. తండ్రి కృష్ణ ప్రసాద్ చౌదరికి కుమారుడు కార్తికేయ తలకొరివి పెట్టాడు. గత కొన్ని సంవత్సరాలుగా భార్యాభర్తలు వివాదాల నేపథ్యంలో విడివిడిగా ఉంటున్నారు. అయితే భార్య వద్ద కుమారుడు ఉంటున్నాడు. కృష్ణ ప్రసాద్ చౌదరి అంత్యక్రియలకు కుమారుడుతో కలిసి భార్య హాజరైంది. సినీ ఆరిస్టులు జ్యోతి, సురేఖ వాణి, దేవి అంత్యక్రియల వద్ద కృష్ణ ప్రసాద్ చౌదరి మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించారు. హైద్రాబాద్, గోవా నుంచి స్నేహితులు హాజరయ్యారు. గ్రామస్తులు కూడా చాలా మంచివాడు అంటూ కితాబ్ ఇచ్చారు. ప్రతి దీపావళికి రాయన్నపేట వస్తాడని, దీపావళి రోజు దాదాపు గ్రామస్తులందరికీ ఉచితంగా బాణసంచా ఇస్తాడని తెల్లవారులు తన ఇంటి ముందు బాణసంచా కాలుస్తూ అందరితో కలిసి మెలిసి ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. అప్పుడప్పుడు తల్లి వద్దకు వచ్చేవాడని, ఎవరైనా పిలిస్తేనే మాట్లాడేవాడని అటువంటివాడు ఆత్మహత్య చేసుకోవటం తమకు ఆశ్చర్యాన్ని కలుగజేస్తుందని గ్రామస్తులు తెలిపారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి : అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కారేపల్లి

స్థానిక ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పీ.శ్రీజ అన్నారు. బుధవారం కారేపల్లి మండలంలో పోలింగ్ సరంజామా పంపిణి కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. కేంద్రంలో సౌకర్యాలపై తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో జీ.సురేందర్ లతో సమీక్షించారు. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితా, పోలింగ్ బూతులలో సౌకర్యాల కల్పన, సమస్యత్మాక గ్రామాల గుర్తింపు వంటి ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన మరమ్మత్తులు, మౌలిక వసతుల కల్పనకు రూ.30 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. వీరి వెంట ఆర్ఐ నర్సింహరావు ఉన్నారు.



మట్టూరి సీతారత్నంకు ఘన నివాళి

- లింగాలలో ముగిసిన అంత్యక్రియలు

నవతెలంగాణ కల్లూరు



మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన మట్టూరి భద్రయ్య సతీమణి సీతారత్నం మృతదేహాన్ని సీపీఐ(ఎం), బీఆర్ఎస్ నాయకులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సీతారత్నం మనవాళ్లు అమెరికా నుండి బుధవారం రావటంతో సాయంత్రం చిన్న కుమారుడు స్టాలిన్ అంత్యక్రియలు నిర్వహించారు. నివాళి అర్పించిన వారిలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు భాస్కరరావు, ఎం.సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండు రంగారావు, జాజిరి శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు, పారుపల్లి ఝాన్సీ, సీనియర్ నాయకులు కొండపల్లి పవన్, దొడ్డా లక్ష్మీనారాయణ, చింతలపూడి రాజారావు, వీరభద్రం, మండల కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి సర్వేశ్వర రావు డివిజన్ కమిటీ సభ్యులు రావుల రాజబాబు, పాకాల పాటి ఝాన్సీ, మోరంపూడి వెంకటేశ్వరరావు, డాక్టర్ రాధా క్రిష్ణమూర్తి, అర్వపల్లి గోపాల రావు, చెరుకూరి శంకరరావు, కటుకూరి వెంకటేశ్వర్లు, తన్నీరు క్రిష్ణార్జునరావు ఉన్నారు.

యుటిఎఫ్ నివాళి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు జీవీ నాగమల్లేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షులు రాయల నాగేశ్వరరావు, కే.విజయ్ కుమార్, రిటైర్డ్ టీచర్ గద్దం రాజశేఖర్, తదితరులు సీతారత్నంకు నివాళులర్పించారు.

బీఆర్ఎస్ నాయకులు నివాళి :సీతారత్నం భౌతికగాయాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధు, స్థానిక నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

వెజిటేబుల్ జ్యూస్ పాయింటును ప్రారంభించిన చేగువేరా భూపతి ఫౌండేషన్ చైర్మెన్ చంద్రశేఖర్

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ కాలేజ్ ఎదురుగా భాగంలో గేటు పక్కన ఉదయం ఏడు గంటలకు వాణి వెజిటేబుల్ జ్యూస్ పాయింటును చేగువేరా భూపతి ఫౌండేషన్ (సిబిఎఫ్) చైర్మన్ జి. చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఇలాంటి కీర, బీట్రూట్, క్యారెటు, సొరకాయ, జొన్న జావ, రాగిజావలు, ప్రతి ఒక్కరూ తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఎఫ్ సభ్యులు గంటా భీమయ్య, మాచర్ల కొండలరావు, నాని, జ్యూస్ పాయింట్ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడి దాతృత్వం

- విద్యార్థులకు మినరల్ వాటర్ అందిస్తున్న నరసింహారావు

నవతెలంగాణ-వైరా

మండలంలోని రెబ్బవరం ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు నరసింహారావు రూ. 8వేలతో విద్యార్థులకు మినరల్ వాటర్ అందిస్తున్నారు. మొత్తం 200 విద్యార్థిని విద్యార్థులకు తన స్వంత ఖర్చుతో ఈ సంవత్సరం చివరి పని దినం వరకు అందిస్తానని చెప్పారు. నరసింహారావు తీసుకున్న నిర్ణయానికి విద్యార్థుల తల్లి దండ్రులు, గ్రామస్తులు, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ తులశమ్మ, ఉపాధ్యాయులు వెంకట్రావు, శ్రీనివాసరావు, సూర్యప్రకాశరావు, కిరణ్, లలిత, సరస్వతిలు ఉపాధ్యాయులు నరసింహారావును అభినందించారు.

క్లినికల్ అప్రెంటిస్షిప్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఖమ్మం

ఇంటర్మీడియట్ ఎంపీ హెచ్‌డబ్ల్యూ (ఫిమేల్) ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి ఒక సంవత్సరం క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అందించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు ఆస్పత్రి పేరున డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకొని ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల వారు తమ బయోడేటా ఫారంతో పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 15 లోగా అందజేయాలని పేర్కొన్నారు.

సాంబశివరావుకు సండ్ర, తాతా మధు నివాళి

తల్లాడ : వెంకన్నపేట గ్రామానికి చెందిన కళ్యాణం సాంబశివరావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు బుధవారం పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, ఆర్.వీర మోహన్ రెడ్డి, దుగ్గిదేవర వెంకట్ లాల్, ముఖ్య మురళి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | ఫిబ్రవరి 06, 2025 | www.navatelangana.com

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-మణుగూరు



హైదరాబాద్ అసెంబ్లీ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఛేసిలో వారిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కనివిని ఎరగని రీతిలో దేశంలో ఏ రాష్ట్రం చేయలేని బృహత్కర కార్యక్రమాన్ని బీసీ కుల గణనను అసెంబ్లీలో ప్రవేశపెట్టి బీసీల పక్ష పార్టీగా బీసీల పక్షాన ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీరు హర్షణీయం అన్నారు. అదే విధంగా సమాజంలో వెనకబడిన వర్గం ఎన్నో సంవత్సరాల కల ఎస్సీ వర్గీకరణ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈరోజు వారి అభ్యున్నతి కొరకు విద్య, ఉద్యోగం, ఆర్థికంగా మెరుగుపడాలని వారి వాటాను వారి కేటాయించాలని ఇలాంటి బృహత్కర కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టి అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతూ సహచర ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నల్ల చట్టాలను ప్రతిఘటించాలి

నవతెలంగాణ-దమ్మపేట

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, కార్మిక చట్టాలను దేశ ప్రజలు ప్రతిఘటించాలని సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పడిన సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జునరావు, ఎఐకెఎస్ నాయకులు సుంకరపాక ధర్మలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కేంద్రంలో నియంతగా కొనసాగుతూ వ్యవసాయక మూడు నల్ల చట్టాలను, 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక కర్షకులకు కట్టు బానిసలుగా చేసే చట్టాలను తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన వైఖరిని అని అన్నారు. దేశవ్యాప్తంగా పెల్లుబికిన రైతు పోరాటాలను చూసిన బిజెపి ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకుంటామని లిఖితపూర్వకంగా వ్రాసి ఇచ్చి, తమ ఎన్నికల ప్రయోజనాల కోసం పచ్చి మోసకారితనాన్ని మోడీ ప్రభుత్వం దివాలా కోరు విధానాన్ని అనుసరించిందని అన్నారు. పెట్టుబడిదారులకు ఆదానీ, అంబానీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా మోడీ సంస్కరణ ఆర్థిక విధానాలు ఉన్నాయని ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. దానికి నిదర్శనమే దేశ ఆర్థిక బడ్జెట్ రూపకల్పనగా ఉంది. బీహార్ తదితర ఎన్నికల నేపథ్యంలో నూసంపన్నుల గెలిపించుకోవడం కోసం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నికల బడ్జెట్ సంపన్నుల కోసం ఏర్పాటు చేసిన విధంగా ఉన్నది తప్ప అట్టడుగు వర్గాలకు పేదలకు పనికొచ్చే బడ్జెట్ లాగా లేదని విమర్శించారు. మోడీ ఆర్థిక పారిశ్రామిక సంస్కరణ విధానాలని ప్రజలు దేశవ్యాప్తంగా ప్రజలు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎయుకెఎస్ డివిజన్ నాయకులు పండూరి వీరబాబు, జగదీష్, మల్లేష్, మంగరాజు, పిఓడబ్ల్యూ నాయకులు గంగాధర నాగమణి, దాసరి సుజాత, పవిత్ర, టియుసిఐ నాయకులు అనిల్‌కుమార్, జుంజునూరి నాగరాజు, సిఐటియు కృష్ణ, హరిబాబు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్ : పాల్వంచ పట్టణం సిఆర్ భవన్ సిపిఐ పార్టీ కార్యాలయంలో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ ఎంఎల్-మాస్ లైన్ పార్టీల అనుబంధ రైతు, కార్మిక సంఘాల నాయకత్వంలో నిరసన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అడుసుమిల్లి సాయిబాబు, సత్య, వేల్పుల రమేష్ అధ్యక్షత వహించారు. రైతు, కార్మిక సంఘాల నాయకులు బండి నాగేశ్వరరావు కె.బ్రహ్మాచారి కల్లూరి కిషోర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, సిఐటియు, టి యు సి ఐ సంఘాల నాయకులు ఇట్టి వెంకట్రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, తులసి రామ్, వీసంశెట్టి పద్మజ, విశ్వేశ్వర రావు, గోనేల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం సిఆర్ భవన్ సిపిఐ పార్టీ కార్యాలయంలో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ ఎంఎల్-మాస్ లైన్ పార్టీల అనుబంధ రైతు,కార్మిక సంఘాల నాయకత్వంలో నిరసన కార్యక్రమం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడుసుమిల్లి సాయిబాబు, కె.సత్య, వేల్పుల రమేష్ అధ్యక్షత వహించారు. రైతు, కార్మిక సంఘాల నాయకులు బండి నాగేశ్వరరావు, కె.బ్రహ్మాచారి కల్లూరి కిషోర్‌లి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, సిఐటియు, టియుసిఐ సంఘాల నాయకులు ఇట్టి వెంకట్రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, తులసి రామ్, వీసంశెట్టి పద్మజ, విశ్వేశ్వరరావు, గోనేల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : మోడీ వ్యవసాయ చట్టాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ ఎంఎల్ ఎన్.డి ప్రజా పంథా మాస్ లైన్ నాయకులు నేతృత్వంలో బుధవారం నిరసన చేపట్టారు. ముందుగా అశ్వారావుపేటలోని మూడు రోడ్ల ప్రధాన కూడలిలో గల భారత రత్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం పలు అంశాలు పై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సలీం, పుల్లయ్య, ప్రభాకర్ రావు, రామక్రిష్ణ, చిరంజీవి, సోడెం ప్రసాద్, కల్లయ్యలు పాల్గొన్నారు.

ములకలపల్లి : బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసర్వించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన కార్యదర్శి పోతుగంటి లక్ష్మణ్, సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దేశవ్యాప్తంగా వ్యవసాయ మూడు చట్టాలను రద్దు చేయాలని లేబర్ కోట్లను ఉపసర్వించుకోవాలని తదితర డిమాండ్లతో ఎస్‌కేయం పిలుపులో భాగంగా మండల కేంద్రంలోని వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు నరాటి ప్రసాద్ ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకులు పోతుగంటి లక్ష్మణ్, సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు, వామపక్ష ప్రజాసంఘాల నాయకులు కుంజా కృష్ణ, మరాటి రమేష్, ఎండీ యూసుఫ్, కొరస రామకృష్ణ, గోగ్గల ఆదినారాయణ, ఎర్రగొర్ల రామారావు, గడ్డం వెంకటేశ్వర్లు, గోపగాని లక్ష్మీ నరసయ్య, తేజావత్ జగ్గు, నకిరేకంటి నాగేశ్వరరావు, బుగ్గ వెంకట నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.











గుండెపోటుతో సోము వెంకటాచారి మృతి

నవతెలంగాణ-చంద్రుగొండ

సీనియర్ ఎలక్ట్రీషియన్ సోము వెంకటాచారి గుండెపోటుతో మృతి చెందారు. మండల ప్రయివేట్ ఎలక్ట్రిషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలకు రూ.5వేలు యూనియన్ తరపున యూనియన్ అధ్యక్షుడు షేక్ ఆసిఫ్ యూనియన్ కమిటీ సభ్యులు వారి కుమారుడుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాబురావు, సెక్రటరీ వీరేంద్ర, హైమత్, ఆవిద్, నజీర్, షావలి, వెంకటాచారి, రమేష్, అక్బర్, లక్ష్మణ్, షబ్బీర్, రాము, సతీష్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

డాక్టర్ దుర్గా భవాని

నవతెలంగాణ-పినపాక

ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గా భవాని తెలిపారు. బుధవారం ఆమె పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల పోతిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి, అక్కడ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకా ఏ మోతాదులో వేస్తున్నారో పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులు బిడ్డల ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సదుపాయం ఉన్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

నవతెలంగాణ-పినపాక

ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతూ గురుకులం పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. బుధవారం విప్పలగుంపు గ్రామంలో ఎంఈఓ కొమరం నాగయ్య చేతుల మీదుగా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోలెం శ్రీనివాసరావు అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నవోదయ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మహర్షి స్వచ్ఛంద సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉద్దేశంతో స్టడీ మెటీరియల్ అందజేయడం గొప్ప విషయం అన్నారు. స్టడీ మెటీరియల్‌ను విప్పలగుంపుతో పాటు కిష్టాపురం, కొత్తూరు, అమరవరం ప్రాథమిక పాఠశాలల్లో సైతం అందజేశారు. అనంతరం మహర్షి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావును ఎంఈఓ, ఇతర ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రాంగోపాల్, డిఆర్పీలు శ్రీకాంత్, రాజేష్, ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, లచ్చు, జమ మూర్తి, ప్రశాంత్, ఉపాధ్యాయులు, సిఆర్పీలు పాపారావు, సాంబ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వర ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవం

- నూతన అధ్యక్షులుగా బండారు నరేంద్ర

నవతెలంగాణ-పినపాక



మండలంలోని సీతంపేట గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర దేవస్థాన ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం దేవస్థానంలో సమావేశమైన సభ్యులు తొలుత పలు అభివృద్ధి అంశాలపై, శివరాత్రి మహోత్సవం గురించి చర్చించారు. అనంతరం ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులుగా బండారు నరేంద్ర, కొండేరు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులుగా అరే శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా బండారు రామ చందర్‌రావు, కోశాధికారిగా అరే లెనిన్ ప్రసాద్, కొండేరు కృష్ణ మూర్తితో పాటు16 మంది సభ్యులుతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు బండారు నరేంద్ర, కొండేరు వెంకటేశ్వర్లు సంయుక్తంగా మాట్లాడుతూ రాబోయే శివరాత్రి మహోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రజలకు ఎటువంటి సమస్యలు కలగకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం అని తెలిపారు. ఆలయ అభివృద్ధి కొరకు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాజ రాజేశ్వర ఆలయ నూతన కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-పినపాక

జీఎస్ఎస్డే కేర్ సెంటర్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు జిఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నూతన దుస్తులను అందజేశారు. బుధవారం మండల పరిధి తోగ్గూడెం గ్రామంలోని 80 మంది పేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో తోగ్గూడెం ప్రాథమిక ప్రధాన ఉపాధ్యాయురాలు కుంజా అనిత, ఉపాధ్యాయులు అనిల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిఎస్ఎస్ సంస్థ ప్రతినిధి మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి మంచి అవకాశాన్ని వినియోగించుకొని చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎస్ సంస్థ సెంటర్ ఇంచార్జ్ బడే సాగర్, టీచర్ మైపా రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతోనే రోడ్డు ప్రమాదాలు

- ఎస్ఐ రాజ్ కుమార్

నవతెలంగాణ-పినపాక

నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఎస్సై రాజ్ కుమార్ వాహనదారులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారుల పైన కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ ని బంధనలు, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, టీఎస్పీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏక్ పెడ్ మాకే నామ్

నవతెలంగాణ-పాల్వంచ

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా యువ అధికారి భూక్య ప్రవీణ్ సింగ్ ఆదేశాల మేరకు, అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కమరతపు భానుచందర్ ప్రోత్సాహంతో, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.పద్మ సహకారంతో గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పాల్వంచలో ఏక్ పేడ్ మాకేనామ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా యువతతో మొక్కలు నాటించడం, వ్యాసరచన పోటీ నిర్వహించి అందులో ప్రదమ బహుమతి ద్వితీయ బహుమతి అందజేశారు. అలాగే మొక్కల గురించి, పర్యావరణం గురించి అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఎన్ఎస్ఎస్ రెండవ యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు సహకరించినందుకు నెహ్రూ యువ కేంద్ర వారు కళాశాల ప్రిన్సిపల్ పద్మ, అధ్యాపక బృందానికి, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సబ్ జైల్లో క్షయ వ్యాధిపై ప్రత్యేక వైద్య శిబిరం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

100 డేస్ ఇంటెన్సివ్ టీబీ కంపెగెన్ క్షయ శివిర్ క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం భద్రాచలంలోని ప్రత్యేక సబ్ జైలు ప్రాంగణంలో ఉపేంద్ర సబ్ జైలర్ అధ్యక్షతన ఆక్టివ్ టిబి కేస్ ఫైండింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్, సోమయ్య, డిపిపి ఎం/ఏసిఎస్ఎం కార్డినేటర్ క్షయ వ్యాధి లక్షణాలను, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్షయ వ్యాధి అనుమానితుల వద్దనుండి తెమడ శాంపిల్స్ సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రసాద్, ఎస్‌టిఎస్, ఎన్ టిఈపికి స్టాప్ తదితరులు పాల్గొన్నారు.

బాలమేళాను సందర్శించిన కాంప్లెక్సు హెచ్‌ఎం హరిత

నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట కాంప్లెక్సు పరిధిలోని పేట మాలపల్లి, అశ్వారావుపేట (ఉర్దూ) పాఠశాలల్లో నిర్వహిస్తున్న బాల మేళా - 2025ను బుధవారం కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయురాలు పి.హరిత సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. తెలుగు, ఆంగ్లం, గణితాలలో విద్యార్థులకు ఫ్లేకార్డు ద్వారా వారి నైపుణ్యాలను ప్రదర్శింప చేశారు. గణిత సామర్థ్యాలను ఆటల ద్వారా ప్రదర్శింప చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట కాంప్లెక్సు సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, ఆర్‌పి సత్యనారాయణ, ఉపాధ్యాయులు అరుణ, సుజాత, కృష్ణవేణి, హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్‌రావు

నవతెలంగాణ-దమ్మపేట

మధ్యాహ్నం భోజనం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు, వంట బిల్లులు, గుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు వేసవి సెలవులలో కూడా వేతనాలు మంజూరు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.10వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, కృష్ణవేణి, బి.నాగమణి, ఈశ్వరమ్మ, మంగ, నిర్మల, రైతు సంఘం నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలు చెల్లించాలి

అశ్వారావుపేట : మధ్యాహ్నం భోజనం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు వంట, గుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వింత పత్రాన్ని ఎంసీఓ మహబూబ్ కు అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగ దుర్గ, సీత, యామిని, మహాలక్ష్మి, పద్మ, విజయ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కోల్ ఇండియాలో టీమ్ ఛాంపియన్ షిప్ సాధించిన సింగరేణి క్యారమ్ జట్టు

నవతెలంగాణ-కొత్తగూడెం

జార్ఖండ్‌లోని రాంచీలో సిఎంపిడిఐఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న కోల్ ఇండియా గెమ్స్‌లో సింగరేణి కాలరీస్‌కు చెందిన క్రీడా కారులు వివిధ క్రీడా విభాగాల్లో అదరగొడుతున్నారు. కోల్ ఇండియా క్యారమ్స్ టోర్నమెంట్‌లో టిమ్ ఛాంపియన్ షిప్‌ను సింగరేణి క్యారమ్ జట్టు దక్కించుకుంది. జార్ఖండ్‌లోని రాంచీ వేదికగాలో సిఎంపిడిఐఎల్ ఆధ్వర్యంలో కోల్ ఇండియా పరిధిలోని మొత్తం 10 బొగ్గు సంస్థల జట్లు తలపడుతున్న కోల్ ఇండియా క్యారమ్స్ టోర్నమెంట్స్‌లలో బుధవారం టిమ్ ఛాంపియన్ షిప్ పోటీలలో సింగరేణి జట్టు చక్కటి ప్రదర్శనతో టిమ్ ఛాంపియన్ షిప్ సాధించింది.డబుల్స్ విభాగంలో సింగరేణి భూపాలపల్లి ఏరియా క్రీడాకారుడు బి.శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియా ఓ.మల్లేష్ రన్నర్స్‌గా నిలిచారు. సింగిల్స్ విభాగంలో శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారుడు ఆర్.సృజన్ రావు, ఫైనల్స్‌కు అర్హత సాధించాడు.

కోల్ ఇండియాలో సింగరేణి జైత్రయాత్ర...

మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరుగుతున్న కోల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌లో సింగరేణి జట్టు చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. కోల్ ఇండియా పరిధిలోని లోని మొత్తం 10 బొగ్గు సంస్థల జట్లు తలపడుతున్న ఈ టోర్నీలో గ్రూప్-ఏలో సింగరేణి సహ ఎన్‌సిఎల్, ఎంసిఎల్ బొగ్గు రంగ సంస్థలున్నాయి. గ్రూప్-బీలో సిసిఎల్, ఎస్ఈసిఎల్, సిఎంపిడిఐఎల్, గ్రూప్-సిలో డబల్యూసిఎల్, ఈసిఎల్, సిఐఎల్, బిసిసిఎల్ జట్లు ఉన్నాయి. మంగళవారం ఎంసిఎల్‌తో జరిగిన మ్యాచ్‌లో సింగరేణి జట్టు 28 పరుగుల తేడాతో గెలుపొందగా...బుధవారం నాగపూర్‌లోని వెటర్నరీ కాలేజీ గ్రౌండ్‌లో ఎన్‌సిఎల్‌తో జరిగిన పోటీలో 3 వికెట్ల తేడాతో (ఎస్‌సిసిఎల్ స్కోర్: 118/20 ఓవర్లు అండ్ ఎన్‌సిఎల్ స్కోర్ 117/19 ఓవర్లు) ఒక ఓవర్ మిగిలి ఉండగానే విజయ ఢంకా మోగించింది. దీంతో గ్రూప్-ఏ విజేతగా అగ్రస్థానం సాధించడంతో పాటు సెమీ ఫైనల్‌లోకి ప్రవేశించినది. సింగరేణి జట్టు విజయంలో బ్యాట్ మెన్స్ శశికాంత్, శశ్వంత్, అల్ రౌండర్ హరి కిషన్, బౌలర్లు యుగంధర్, మహేశ్ కీలక పాత్ర పోషించారు.

ఆర్టీసీ కార్మికులకు పెరుగుతున్న పనిబారం

- విద్యుత్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ మేనేజ్మెంట్‌కు అప్పగించాలి
- పూర్తి హక్కులు ఆర్టీసీ తీసుకోవాలి
- ఎస్‌డబ్ల్యూఎఫ్ తెలంగాణ స్టేట్ సెక్రటరీ విఎస్.రావు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆర్టీసీలో రోజురోజుకు కార్మికులకు పనిబారం పెరుగుతుందని, విద్యుత్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ మేనేజ్‌మెంట్‌కు అప్పగించాలని, పూర్తి హక్కులు ఆర్టీసీ తీసుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ తెలంగాణ స్టేట్ సెక్రటరీ విఎస్.రావు అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటియూ) ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ స్టేట్ సెక్రటరీ విఎస్.రావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీలో పనిబారాలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చే విద్యుత్ బస్సులను కేంద్ర ప్రభుత్వమే, సవరణ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యుత్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ మేనేజ్‌మెంట్‌కు అప్పజెప్పి, పూర్తి హక్కులు ఆర్టీసీ మేనేజ్‌మెంట్ తీసుకోవాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రద్దు చేసిన 26 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఆర్టీసీలో కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికల జరపాలని, తదితర విషయాలను కార్మికుల దృష్టికి తీసుకొచ్చారు. మొదటిగా కార్మికుల యొక్క పని పరిస్థితులను తెలుసుకొని, వారికి వివరణ ఇచ్చారు.




ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు శామ్యూల్ జాకబ్, జిల్లా ఎస్‌డబ్ల్యూఎఫ్ ట్రెజరర్ పర్వీన్, జిల్లా నాయకులు శివరామ కృష్ణ, ఎస్‌డబ్ల్యూఎఫ్ సీనియర్ నాయకులు ఎంఎస్.రెడ్డి, డిపో నాయకులు బి.నాగేశ్వరరావు, కె.శంకర్, ఎస్‌కె.రఫీ, మహిళా నాయకులు మోహిని కుమారి, సుజాత, రమణ, సబితా, మాధవి, లత, రామ కృష్ణ, సోమయ్య, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

- కాంగ్రెస్ పార్టీని గోదారిలో ముంచుతాం
- కేసీఆర్‌ను ఎదురుకోవడం కాంగ్రెస్ వల్ల కాదు
- ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొనేందుకే బీఆర్ఎస్ నేతలపై కేసులు
- అధికారంలోకి వస్తే తప్పుడు కేసులు పెట్టిన అధికారులను వదలం
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

నవతెలంగాణ-ఇల్లందు

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనూ సత్తా చాటుతామని, కాంగ్రెస్ పార్టీని గోదావరిలో ముంచుతామని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. స్థానిక ఐతా ఫంక్షన్ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఇలా ఏ ఎన్నికలు జరిగినా సిద్ధంగా ఉన్నామన్నారు. గత ఎన్నికల్లో అమలు గాని హామీలు ఇచ్చి 14 నెలలైనా అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. చెప్పిందే చెప్తుతూ మోసం చేస్తూ పబ్బం గడుపుకునే దొంగలు, దోపిడి దారులు ఉన్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలలో ఇప్పటివరకు లక్షా 38 వేల కోట్లు అప్పులు చేశారని అన్నారు. ప్రజల దృష్టి మలిచేందుకు డైవర్షన్ రాజకీయాలు నడపడంలో సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధహస్తుడని అన్నారు. పైనుంచి కింది స్థాయి వరకు నేతలంతా దాటవేత, ఎగవేత, పంగనామాలు పెట్టడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. హామీలు అమలు చేయలేక టైంపాస్ రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేయడం చేతకావడం లేదు. ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుంటున్నారు. ప్రజా వ్యతిరేకత మొదలైందని ఇటీవల జరిగిన గ్రామ పాలనలోనే ప్రజలు నిలదీస్తే ఎమ్మెల్యేలు, మంత్రులు తోకముడిచారని అన్నారు. శ్రీరాముడు, సమ్మక్క, వీరభద్రుడు తదితర దేవులపై ప్రమాణాలు చేశారని, శాపాలు తగులుతుందని, వనవాసం చేస్తారని అన్నారు. ఎన్నికల్లో నాయకులను గెలవనియకుండా రాష్ట్రంలో, జిల్లాలో తప్పుడు కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. టేకులపల్లి మండలం పిఏసిఎస్ ఛైర్మెన్ లక్కినేని సురేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజును అరెస్టు చేసి రిమాండ్ చేసి జైల్లో పెట్టారని అన్నారు. ఎన్ని కేసులు పెట్టిన ఆధరం బెదరమన్నారు. అధికారంలోకి వస్తే తప్పుడు కేసులు పెట్టిన వారు 33 జిల్లాల్లో ఎక్కడున్నా అధికారులను వదలమని హెచ్చరించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ దిండిగాల రాజేందర్, నాయకులు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ, ఎస్.రంగనాథ్, టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, ఇల్లందు ఆత్మ కమిటీ మాజీ ఛైర్మెన్ అజ్మీర భావు సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ గుడిలో పంచమ పుష్కర మహా కుంభాభిషేక మహెూత్సవాలు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

కేపీ జగన్నాధపురం శ్రీ కనకదుర్గ(పెద్దమ్మ తల్లి) దేవాలయంలో అమ్మవారి పంచమ పుష్కర (షష్యాబ్ది) పూర్వక మహా కుంభాభిషేక మహెూత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రజనీకుమారి తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆమె బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గురువారం నుండి సోమవారం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. గురువారం తొలిరోజు విగ్నేశ్వర పూజ, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశముతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 2వ రోజు జలాధివాసం, 3వ రోజు క్షీరాదివాసం, 4వ రోజు ధాన్యాదివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం, హిరణ్యాధివాసం, షయ్యదివాసం కార్యక్రమాలు ఉంటాయన్నారు. చివరి రోజు (10న) నూతక్కి శ్రీనివాసరావు-రాజకుమారి దంపతులిచే నిర్మించిన కళ్యాణ మండపం, అన్నదాన సత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.ఉదయం 11.30 గంటలకు శివాలయంలో స్వామివారి, పరివార దేవతా సహిత జీవధ్వజ ప్రతిష్ట మహెూత్సవం, మధ్యాహ్నం 12:15 నిమిషాలకు అమ్మవారి ఆలయ ప్రతిష్ట జరిగి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ధర్మపురి మఠాధిపతులు సరస్వతి స్వామి చే మహా కుంభాభిషేక మహెూత్సవం ఉంటుందన్నారు. అనంతరం 12:30 గంటలకు మహా అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే దేవాలయ ప్రాంగణంలో సర్వ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రచార రథంతో విస్తృత ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు.

సీపీఐ(ఎం)కి ఐలయ్య జీవితం అంకితం

నవతెలంగాణ-అశ్వారావుపేట

కొత్తగూడెం ప్రాంతంలో సీపీఐ(ఎం) విస్తరణకు కాసాని ఐలయ్య ఎనలేని కృషి చేసారని, కుటుంబసమేతంగా పార్టీ అంకితం అయి పార్టీ ఎదుగుదలకు పనిచేసిన ఆయన జీవితాన్నే అంకితం చేసిన ఆదర్శ మార్క్సిస్టు చరితార్థుడు అయ్యారని జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య ఆయన సేవలను కొనియాడారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం సుందరయ్య భవన్‌లో మండల కమిటీ సభ్యులు మడకం గోవిందరావు అధ్యక్షతన ఐలయ్య సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీలో అయినా భార్యాభర్తలు ఇరువురు పార్టీకి సేవలు చేయడం అరుదని, కానీ కాసాని ఐలయ్య - లక్ష్మిలు అలాంటి అరుదైన ఘనతను రాజకీయంగా సాధించారని అన్నారు. వారి ఇరువురు ఆశయాలను కార్యకర్తలు నేరవేర్చడమే వారికి నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చిరంజీవి, మండల కార్యదర్శి సోడెం ప్రసాద్, మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ల జీతగాడు మోడీ'

నవతెలంగాణ-కొత్తగూడెం

బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేఎం, ఫ్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా నాయకులు గుమ్మడి నర్సయ్య ఏజె.రమేష్, ముత్యాల విశ్వనాథంలు విమర్శించారు. బుధవారం కొత్తగూడెంలోని మంచి కంటి భవన్‌లో జిల్లా సదస్సు కున్సోత్ ధర్మా, సలిగంటి శ్రీనివాస్, బుర్ర వెంకన్న, ఎస్‌కె.ఉమర్, భూక్యా కిషన్‌ల అధ్యక్షతన జరిగింది, ఈ సదస్సులో కె.జమలయ్య, రేపాకుల శ్రీనివాస్, జడ సీతారామయ్య కందగట్ల సురేందర్, చంద్ర అరుణ, అన్నవరపు సత్యనారాయణలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళనా కార్యక్రమాలకు కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. దేశ ప్రజలపై మరిన్ని భారాలు మోపుతూ బడ్జెట్లో కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చారన్నారు. పేదలందరికీ ఇంటి నిర్మాణం గురించి ప్రస్తావన లేదన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే కనీస మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పేదలందరికీ విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలపై గ్రామ గ్రామాన ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దిబోయిన సతీష్, భూక్యా రమేష్, రేసు ఎల్లయ్య, బాలకృష్ణ, రాములు, రఘు, సంధ్య, రుహీన, తదితరులు పాల్గొన్నారు.

3వ రోజుకు చేరుకున్న ముత్యాలమ్మ జాతర

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న శ్రీ ముత్యాలమ్మ జాతర మహెూత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం మూడవరోజు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు ముత్యాలమ్మ చెట్టు వద్ద మొక్కుబడులు చెల్లించుకున్నారు. దుమ్ముగూడెం గ్రామానికి చెందిన గవర్న రామ్మోహన్‌రావు-నవీన దంపతులు అందజేసిన పట్టుచీరతో అమ్మవారిని ఉదయం అలంకరణ నిర్వహించగా, వెంకటాపురం వాస్తవ్యులు వేముల ప్రభాకర్‌రావు-ఆదిలక్ష్మి దంపతులు అందజేసిన పట్టుచీరతో మధ్యాహ్నం అలంకరణ, చిన్న నల్ల బిల్లు వాస్తవ్యులు పచ్చి సాయి వరప్రసాద్-బేబీ రాణి అందజేసిన పట్టుచీరలతో ప్రత్యేక అలంకరణ పుష్పబిసేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారి ప్రథమ గరిగల ఊరేగింపు కార్యక్రమాన్ని మేళ తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రతి ఇంటికి వెళ్లి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. రాత్రి 8 గంటలకు సోనీ వైన్స్ అధినేత ఎండి హలీంఖాన్ ఆర్థిక సహాయంతో భీమవరం వారిచే నిర్వహించిన మోహన్ ఆర్కెస్ట్రా ప్రేక్షకులను సందడి చేశారు. కాగా ఆలయ కమిటీ చైర్మన్ చుక్క గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ వారు భక్తులకు ఎటువంటి కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదాన వితరణ అందజేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దుమ్ముగూడెం పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



బూర్గంపాడు ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా బిజ్జం వెంకటరామిరెడ్డి
- ప్రధాన కార్యదర్శిగా జి.ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం బూర్గంపాడులోని ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశానికి సీనియర్ పాత్రికేయులు తోకల మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా బిజ్జం వెంకటరామిరెడ్డి(సాక్షి), ప్రధాన కార్యద ర్శిగా జి.ప్రవీణ్ కుమార్ (వెలుగు), కోశాధికారిగా గోడపర్తి రాంబాబు (వార్త)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షులుగా తోకల మోహన్ రావు (నవతెలంగాణ) ఎన్నుకున్నారు. అలాగే గౌరవ సలహాదారులుగా కొండారెడ్డి, అజ్మీర వెంకన్న, ఉపాధ్యక్షులుగా మారుడి చంద్రశేఖర్ రెడ్డి, మందపాటి వెంకట రెడ్డి, రాము, సహాయ కార్యదర్శులుగా గొట్టే ముక్కల అన్వేష్ రాజ్, పల్లంటి రమేష్ ఎన్నుకున్నారు. అదేవిధంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ బర్ల జోష్, ప్రచార కార్యదర్శి తేజవత్ గాంధీ, కమిటీ సభ్యులుగా జక్కిరెడ్డి మల్లారెడ్డి, పోలిన రామకృష్ణ, చారి, దుద్దుకూరి మురళీకృష్ణ, కందుకూరి శ్రీని వాస చారి, మహేష్ లను ఎన్నుకున్నారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తాం:

జర్నలిస్టుల సంక్షేమ కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు బిజ్జం వెంకటరామి రెడ్డి, జి.ప్రవీణ్ కుమార్ లు అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన, ఇన్సూరెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని వారు తెలిపారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



కుటుంబ కలహాల నేపథ్యంలో మిర్చి సాగుకు ఉపయోగించే క్రిమి సంహారక పౌడర్ ఓ వివాహిత తిని బలవన్మరణానికి యత్నించిన ఘటన ఆళ్ళపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కెవి.సంఘమిత్ర, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన వనపర్తి జయశ్రీ అనే వివాహిత తన భర్త వనపర్తి రమేష్‌తో వివాదం జరిగిందన్నారు. దాంతో మనస్థాపానికి గురై, మిర్చి సాగులో పూతకు వాడె పౌడర్ మింగింది. విషయం తెలుసుకున్న భర్త ఇరుగుపొరుగు వారి సహకారంతో ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో ఆమెకు వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యాధికారి సూచన మేరకు కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం స్థానిక 108 వాహనంలో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి ఆసుపత్రిలో ఆమె ఆరోగ్య పరిస్థితి కొంత నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. బుధవారం పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని మందులు అందించే గది, రక్త పరీక్ష కేంద్రం, ఇన్ పేషెంట్ వార్డు, గర్భిణీ స్త్రీల వార్డ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఇన్ పేషెంట్‌లో ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్ వివరాలు, సిబ్బంది వివరాలు, మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కుక్క కాటు ఇచ్చే వ్యాక్సినేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, ఆసుపత్రిని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఔషధ నిల్వలు స్టాక్ పెట్టుకోవాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు శుచికరమైన బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వివిధ సమస్యలతో ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్‌తో పాటు పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ రాంప్రసాద్, డాక్టర్లు శైలేష్, మోహన్, వంశీ, ప్రసాద్, రాంప్రసాద్, లావణ్య, నర్సింగ్ సూపర్డెంట్ సరళ, సిబ్బంది పాల్గొన్నారు.

సంపన్నులకు దోచిపెట్టే బడ్జెట్

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి

నవతెలంగాణ-భద్రాచలంరూరల్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు దోచిపెట్టే బడ్జెట్ అని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిఐటియు, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలంలో నిరసన కార్యక్రమం చేపట్టి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మాచారి మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు కర్షకులకుమహిళలకు సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా ఉందని అన్నారు. సంపన్న వర్గాలకు పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు మేలు చేసే బడ్జెట్ గా ఉందని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ తీరు చూస్తే ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తుందో అర్థమవుతుందని అన్నారు. ప్రజలకొనుగోలు శక్తిపంచే ప్రతిపాదనలు బడ్జెట్ లో లేవని తెలిపారు. దేశ సంపదనంతా కార్పొరేట్లకు దోచి పెట్టే విధంగా బడ్జెట్ రూపకల్పన చేసి కార్మికులకు కనీస వేతనాలు పెంచకుండా పేదరికం నిరుద్యోగం సామాన్యులపై ధరల భారం పెరిగే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యవాదులు మేధావులు ప్రజలు ప్రతి ఒక్కరూ ఈ బడ్జెట్ వ్యతిరేకించాలని కోరారు. కార్మిక వర్గాన్ని నట్టేట ముంచుతూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ ఆర్థిక దివాలా కోరు తనానికి నిదర్శనమని అన్నారు. ఈ బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసిందని ఈ రాష్ట్రంలో 8 మంది ఎంపీలు 8 మంది ఎమ్మెల్యేలు ఉన్న తెలంగాణకు రావాల్సిన నిధులు తేవడంలో పూర్తిగా బిజెపి విఫలమైందన్నారు. తక్షణమే కార్మిక కర్షక వ్యతిరేకమైన బడ్జెట్ ను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పని గంటలు పెంచి పెట్టుబడిదారులకు లాభాలు పెంచే చర్యలనుబడ్జెట్‌లోప్రతిపాదించటం దుర్మార్గ మైనచర్యగా నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎంబి నర్సారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం స్వామి, ఐద్వా నాయకురాళ్ళు, యు.జ్యోతి, జి.జ్యోతి, శ్రీను, వేణు, అజయ్, రాయల రాములు, ఎంవిఎస్ నారయణ, గజ్జలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


నవతెలంగాణ-అశ్వాపురం

సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాహుప్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని జగ్గారం క్రాస్ రోడ్‌లో హెవీ వాటర్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా పనిచేస్తున్న మహిళా కార్మికులకు ఆయన అవగాహన సదస్సును నిర్వహించారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు పెచ్చు మీరు పోతున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తత అవసరమన్నారు. అగంతకుల ద్వారా వచ్చే ఫోన్ కాల్స్, వారు చెప్పే మాయమాటలు పట్ల ఆకర్షితులవ్వకుండా జాగ్రత్తతో వ్యవహరించాలని ఆయన తెలిపారు. మీ ఫోన్ల నుండి ఓటీపీలుగాని బ్యాంకు సేవలకు సంబంధించిన అంశాలు గాని తెలియని వ్యక్తులతో పాలుపంచుకోవద్దన్నారు. అనుమానాస్పదమైన కాల్స్ ఏమైనా వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తతో మెలగాలని ఆయన కోరారు.

అదృశ్యమైన విద్యార్థిని ఘటనపై ఆందోళన

- కళాశాల ఎదుట బైఠాయించిన బంధువులు

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడులోని ఓ కళాశాల నుంచి అదృశ్య మైన బాలిక బంధువులు బుధవారం కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. తమ కుమార్తె అదృశ్యమై నాలుగు రోజులు గడుస్తున్నా ఇంత వరకు ఆచూకీ లభ్యం కాలేదని కళాశాల ఎదుట బైఠాయించారు. కళాశాల బాధ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అదృశ్యం ఘటనపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని దీంట్లో తమ నిర్లక్ష్యం ఏమీ లేదని కళాశాల బాధ్యులు బంధువులకు పేర్కొన్నారు. తాజా పరిస్థితిపై పోలీసులను అడిగి తెలుసుకోవాలని సూచించడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య, నాయకులు ఏవి రావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాటన్ననగర్ గుత్తికోయ ప్రజలకు సికింద్రాబాద్ హీలింగ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఎస్కే సోందు పాషా సౌజన్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ చంద్రభాను, సిఐ టి.సురేష్ దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం డీఎస్పీ చంద్రభాను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్, కానిస్టేబుల్ కే ఉపేందర్, టిఎస్ఎస్‌పి సిబ్బంది, గొత్తికోయ ప్రజలు పాల్గొన్నారు.

మంచి ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులు కష్టపడి చదవాలి

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



గిరిజన విద్యార్థులు భవిష్యత్తులో వేసే మొదటి అడుగు ప్రారంభం అయ్యేది పదవ తరగతిలో పొందిన మార్కుల తోటే ఆధారపడి ఉంటుందని, త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి మంచి ఫలితాలతో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించినప్పుడే విద్యార్థులు పడ్డ కష్టానికి ఫలితం దక్కుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. బుధవారం మండలంలోని రేగుబల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనాలు చేసి ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నది లేనిది విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థినిలతో ప్రత్యేకంగా సమావేశమై పరీక్షలలో పాటించవలసిన మెలుకువల గురించి సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు వ్యవసాయం మరియు కూలి పనులు చేసుకుంటూ మీ మీద ఎంతో నమ్మకంతో మా పిల్లలు బాగా చదువుకొని వృద్ధిలోకి వస్తారని ఆశపడతారని వారి ఆశను నమ్మకాన్ని వమ్ము చేయకుండా శ్రద్ధగా చదువుకొని మీ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలతో పాటు మీ విద్యాభ్యాసాన్ని పై చదువులు చదవడానికి వెసులుబాటు కల్పించుకోవాలని అన్నారు. పిల్లలను ఎవరిని ఇంటికి పంపకూడదని, హెచ్‌ఎం, సబ్జెక్ట్ టీచర్లు ఎవరు సెలవులు పెట్టకూడదని అన్నారు. విద్యార్థినిలు స్లిప్ టెస్టులు రాసిన తర్వాత మార్కుల జాబితాను చూసి మీరు రాసింది కరెక్టో కాదో సంబంధిత ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని అన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థినిలకు రగ్గులు, స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏటిడిఓ అశోక్‌కుమార్, ఎస్ఓ ఉదయభాస్కర్, తాసిల్దార్ మామిడి అశోక్ కుమార్, హెచ్‌ఎం సావిత్రి, వార్డెన్ శారద, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయడమే ఐలయ్యకి నివాళి

నవతెలంగాణ-ములకలపల్లి







ప్రజా ఉద్యమాల రథసారథి ఎర్రజెండా ముద్దుబిడ్డ అమరజీవి కామ్రేడ్ కాసాని ఐలయ్య ఆశయాలకు అనుగుణంగా దోపిడీ లేని రాజ్యం కోసం కార్యకర్తలు ఉవ్వెత్తిన ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో పొడియం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన అమరజీవి కాసాని ఐలయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఐలయ్య భూస్వాములు పెత్తందారులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి అనేక నిర్బంధాలు పోలీస్ కేసులు ఎదురైనప్పటికీ ఎదురొడ్డి ప్రజల పక్షాన నిలిచి వేల మందికి భూములు, ఇళ్ల స్థలాలు వచ్చేవరకు పోరాడినటువంటి గొప్ప నాయకుడు కాసాని ఐలయ్యఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, గౌరీ నాగేశ్వరరావు, మాలోతు రావూజా, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, పాయం అమల, గొగ్గల ఆదినారాయణ, కుంజా రాంమూర్తి, కీసరి వెంకట్రావు, బుగ్గా వెంకట నర్సమ్మ, వర్సా శ్రీరాములు, గుగులోతు రవిందర్, సోయం కృష్ణ, చేడే పద్మావతి, గోపాగాని లక్ష్మీనరసయ్య, బైరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం : అమరజీవి పేదల పెన్నిధి కాసాని అయిలయ్య స్ఫూర్తితో భూ పోరాటాలు ఉధృతం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ తెలిపారు, బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాసాని అయిలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, సంధ్య, రాములు, రఘు, రుహీన, మెస్సు రామ కోటమ్మ, భారతమ్మ, అరుణ, లలిత, నిహారిక, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రూరల్ : కార్మిక, కర్షక పక్షపాతి కాసాని ఐలయ్య అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నార్సారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రామాలయం ఏరియాలో జరిగిన శాఖ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొని కాసాని ఐలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నార్సారెడ్డి మాట్లాడారు. పట్టణ కమిటీ సభ్యులు డి. రాఘవయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆది, పోసి, గంగ, సుధా, భవాని, తదితరులుపాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయం ప్రారంభించేదెన్నడో..?

- సర్వాంగ సుందరంగా భవన నిర్మాణం పూర్తి
- త్వరగా వాడుకలోకి తేవాలంటున్న రైతులు

నవతెలంగాణ-అశ్వాపురం



మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వెనుక సర్వాంగ సుందరంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం ప్రారంభం ఎన్నడో అని రైతులు ఎదురుచూస్తున్నారు. అశ్వాపురం పిఎసిఎస్ పరిధిలోని రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సొసైటీ ద్వారా కొన్ని అలాగే నాబార్డు నిధులతో కలుపుకొని సుమారు రూ. 60 లక్షల అంచనా వ్యయంతో భవనాన్ని పూర్తి చేశారు. భవనం క్రింది భాగంలో రైతులకు అవసరమైనటువంటి ఎరువులతో పాటు ఇతరత్రాలు నిలువ చేసేందుకు వీలుగా భవనం నిర్మించటం తో పాటు పై ఫ్లోర్ లో రైతులకు సేవలందించేందుకు అణువుగా సమావేశం మందిరం తో పాటు సుందరంగా భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అలాగే సొసైటీ భవనంలో రైతులకు సేవలందించే విధంగానే కాకుండా వ్యాపార పరంగా ఉపయోగపడేందుకు కూడా రోడ్డు వైపు కొన్ని సెటర్లును నిర్మాణం చేశారు. అయితే ఇది నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సంబంధిత శాఖ ఉన్నతాధికారులు దీని ప్రారంభించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఈ సొసైటీ పరిధిలోని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ కార్యాలయాన్ని త్వరితిగతిన పూర్తి చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని అశ్వాపురం పిఎసిఎస్ పరిధిలో ఉన్న రైతులు కోరుతున్నారు.

మట్టిదిబ్బలు విరిగిపడి ముగ్గురు కూలీలు దుర్మరణం

మృతుల్లో తండ్రీకొడుకు





నవతెలంగాణ-కొణిజర్ల

హైదరాబాద్ ఎల్బీనగర్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కూలీలపై మట్టిదిబ్బలు విరిగిపడడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. ఓ హోటల్ వెనుక ప్రాంతంలో నిర్మిస్తున్న భవనం పనులకు ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం మలుపల్లి గ్రామానికి చెందిన వలస కూలీలు వీరయ్య(48), ఆయన చిన్న కుమారుడు రాము (19), వీరయ్య బావమరిది కుమారుడు వాసు (18) సెల్లార్ తవ్వుతుండగా మట్టిదిబ్బలు కూలి వారిపై పడడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పొట్టకూటి కోసం వెళ్లి కానరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించాయి.

ఇళ్లల్లోకి వచ్చి చేరుతున్న సాగర్ నీరు

పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు



నవతెలంగాణ - బోనకల్

మండల కేంద్రంలోని నారాయణపురం మైనర్ నుంచి కాలువ పొంగి పక్కనే గల గిరిజన వాసుల ఇళ్లల్లోకి చేరుతున్నాయి. అయినా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్ నుంచి నారాయణపురం మైనరు వెళ్తుంది. అయితే స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో వివిధ రకాల వ్యాపారులు తమకు సంబంధించిన చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి కాలువలో వేస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోతుంది. సాగర్ నీరు వచ్చినప్పుడు ఈ చెత్తాచెదారం వలన నీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేక కాలువ పొంగి పక్కనే గల ఇళ్లల్లోకి చేరుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సంఘటనలు గతంలో 10 సార్లకు పైగా జరిగింది. ఈ విషయాన్ని స్థానికులు బోనకల్ నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. అయినా వారి నుంచి ఏమాత్రం స్పందన లేదని బాధితులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం కూడా సాగర నీరు ఇళ్లల్లోకి వచ్చి చేరాయి. దీంతో వారు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. బాధితులు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, మీడియాలో అనేకసార్లు వార్తలు వచ్చిన నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా బోనకల్ నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని, లేనియెడల స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్, నీటిపారుదుల శాఖ కార్యాలయం వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని బాధితులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల అల్పాహారానికి వితరణ



నవతెలంగాణ-కల్లూరు

ఎంపీపీఎస్ కల్లూరు పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా 315 నుండి 415 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో తరగతిలో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారికి కనీస సామర్థ్యలైన చదవడం, రాయడం, గణితంలో నిత్యజీవితంలో కావలసిన చతుర్విదా ప్రక్రియలపై పట్టుకోసం కృషి చేయడం జరుగుతుంది. వారి సామర్థ్యాలు ఇంకా మెరుగు పరచడం కోసం వివిధ రకాల పుస్తకాలు, ఆర్ట్ క్లాసులతో వారి ప్రతిభను వెలికితీయడం జరుగుతుంది. ఇందులో భాగంగా అదే పాఠశాలలో పనిచేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరక రామారావు దాతల దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించి విద్యార్థులకు మంచి పౌష్టిక ఆహారం లభిస్తే వారు ఇంకా బాగా చదవగలరని పిల్లలకు మంచి పోషకాలతో కూడిన "చిక్కీలు మరియు మిల్లెట్ బిస్కట్స్‌ను సుమారు 40వేలు విలువ గల పౌష్టిక ఆహారాన్ని అందించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల యందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం వాసిరెడ్డి నాగపద్మా, ఉపాధ్యాయులు వరక రామారావు, రమాదేవి, మామిడాల వెంకటేశ్వరావు, అనితకుమారి, ఫణిశంకర్ రెడ్డి, ఫణి స్ఫూర్తీ ఫౌండేషన్ దాతల సేవలు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ముస్లింల ఐక్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో కమలాపురం మసీదులో ముస్లింల ఐక్య సంఘం క్యాలెండర్ తోపాటు, సంఘ సభ్యత పుస్తకాలను ముస్లింల ఐక్య సంఘం మధిర సెంట్రల్ కమిటీ అధ్యక్షులు షేక్ మౌలానా ముజాహిద్ బుధవారం లాంచనీయంగా ఆవిష్కరించారు. ముస్లింల ఐక్య సంఘం మధిర డివిజన్ అడ్వైజర్‌గా మహమ్మద్ అజ్గర్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మధిర సెంట్రల్ కమిటీ సభ్యులు జనాబ్ షేక్ గౌసిద్దీన్, కాంట్రాక్టర్ షేక్ హుస్సేన్ సాహెబ్, ముస్లింల ఐక్య సంఘం మండల అధ్యక్షులు షేక్ మహబూబ్, ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ రహమాన్, జనరల్ సెక్రెటరీ షేక్ తాజుద్దీన్ బాబా, జాయింట్ సెక్రెటరీ సలావుద్దీన్, ట్రెజరీ షేక్ ఖాసిం, కమిటీ సభ్యులు షేక్ పాషా, సత్తార్మియా, నాగుల్ మీరా, సదర్ సాహెబ్, మజీద్ కమిటీ సభ్యులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యదర్శికి బ్రెయిన్ స్ట్రోక్

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మేడ రాధాకృష్ణమూర్తికి సోమవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సహచర పంచాయతీ కార్యదర్శులు తెలిపిన వివరాల ప్రకారం మేడా రాధాకృష్ణమూర్తి బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే గత వారం రోజుల నుంచి చేతులు లాగుతున్నాయంటూ సహచర పంచాయతీ కార్యదర్శులకు చెప్పాడు. మామూలు నొప్పిగా భావిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఖమ్మంలోని తన ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు అనంతరం తలలో సుమారు 70 శాతం వరకు రక్తం గడ్డ కట్టినట్లు తెలిపారని తెలిపారు. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిపారు. పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు కుటుంబ సభ్యులకు సూచించినట్లు తెలిసింది. పలువురు సహచర పంచాయతీ కార్యదర్శులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యానికి పెద్ద ఎత్తున ఖర్చు అయ్యే అవకాశము ఉందని, మానవతావాదులు సహచర పంచాయతీ కార్యదర్శులు ఆర్థిక సహాయాన్ని అందించాలని బంధువులు కోరుతున్నారు. 9866801614 నెంబర్‌కు ఫోన్ పే చేయగలరని విన్నవించుకుంటున్నారు.

బాణాపురం ఉన్నత పాఠశాల సందర్శన

నవతెలంగాణ- ముదిగొండ

పీఎంశ్రీ పథకంలో భాగంగా (ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) ట్వినింగ్ స్కూల్ ముదిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శాంతితో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బాణాపురం ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల గ్రంథాలయము సైన్సు గది, కంప్యూటర్ ల్యాబ్ వాటి నిర్వహణ పని విధానాన్ని పరిశీలించారు. అనంతరం రెండు ఉన్నత పాఠశాలల విద్యార్థులతో సంయుక్తంగా కబడ్డీ, వాలీబాల్, పోటీలతో పాటు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రెండు హైస్కూల్‌ల విద్యార్థిని, విద్యార్థుల మధ్య స్నేహపూర్వక, సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డి రమణయ్య, బాణాపురం, చిరుమర్రి, ముదిగొండ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇవి రామిరెడ్డి, ఎన్వికె ప్రసాద్, కె.శాంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

నవతెలంగాణ-సత్తుపల్లి

లారీ ఢీకొని వ్యక్తి ఒకరు అక్కడికక్కడే మృత్యువాతకు గురైన ఘటన సత్తుపల్లి మండలం తాళ్లమడ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగింది. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావునగర్‌కు చెందిన ఎస్కే షాజహాన్ (32) ఎస్కే ఆసిఫ్ ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వస్తుండగా తాళ్లమడ వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షాజహాన్ లారీ వెనుక చక్రాల కింద పడటంతో తలభాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆసిఫ్ కుడిచేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన సత్తుపల్లి ఎస్సై రఘు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మాంసం దుకాణం నిర్వహిస్తున్న మృతుడు షాజహాన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మనదే

- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో రానుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వ పథకాలు విజయవంతంగా అమలు జరుగుతున్నాయన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని అనేక కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారి మాటలను పట్టించుకోనవసరం లేదని దయానంద్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. గ్రూపులకు తావులేకుండా అందరి ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విషయం మీదేనని, ఇందులో మా ప్రమేయం ఎంతమాత్రం ఉండబోదని దయానంద్ తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, శివా వేణుబాబు, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, దొడ్డా శ్రీనివాసరావు, ఉడతనేని అప్పారావు, మందపాటి ముత్తారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం బోనస్, రైతు భరోసా, రుణమాఫీ డబ్బు....

రైతుల బ్యాంకు ఖాతాలకు వెంటనే జమ చేయాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



నవతెలంగాణ-ఖమ్మం

ధాన్యం బోనస్, రుణమాఫీ, రైతు భరోసా డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు వెంటనే జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం సుందరయ్య భవన్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రైతు రుణమాఫీ 60%, ధాన్యం బోనస్ 70%, రైతు భరోసా 96% పెండింగ్లో ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అందించే రైతు బంధు పేరు మార్చి భరోసా చేసిన మూడు వ్యవసాయ సీజన్లో రైతులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటే ఒక సీజన్లో మాత్రమే రైతు భరోసా విడుదల చేసింది అన్నారు. రెండు సీజన్‌ల పెండింగ్ ఉంటే పెంచిన మొత్తంతో వేయాల్సి ఉండగా కేవలం సగం మాత్రమే మండలంలో అతి చిన్న రెవెన్యూ గ్రామంలో రైతులకు భరోసా విడుదల చేసి మిగితా గ్రామాలను పెండింగ్లో ఉంచారన్నారు. డిసెంబర్ 10 నుంచి ధాన్యం విక్రయం చేసిన రైతులకు బోనస్ అందలేదని, జిల్లాలో 60 శాతం రైతులకు రుణమాఫీ పూర్తి కాలేదని అన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలు నమ్మి రెండు లక్షల రూపాయలు పైన అప్పు ఉన్న రైతులు బ్యాంకులకు అప్పు చెల్లించి రుణమాఫీ కాక, కొత్త అప్పు రాక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు అని అన్నారు. రుణమాఫీ, ధాన్యం బోనస్, రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా 9 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కాక ఇబ్బందులు పడుతున్నారని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రులు హామీ ఇచ్చారని, మరో వారం రోజులు పాటు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులు సమస్యలు పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతులకు, పేదలకు, కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని, కేంద్ర బడ్జెట్‌కి సవరణలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 10 హైదరాబాద్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు, తాతా భాస్కరరావు, బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్కె మీరా, దుగ్గి కృష్ణ, సహాయ కార్యదర్శులు గోడవర్తి నాగేశ్వరరావు, బిక్కసాని గంగాధర్, సభ్యులు శీలం సత్యనారాయణరెడ్డి, మల్లేల సన్మధరావు, బాణాల శ్రీనివాసరావు, బింగ్గి రమేష్, కుసుపూడి మధు, కోల్లేటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంను కలిసిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆయన ఛాంబరులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్‌తో పాటుగా కలుసుకొని వినతిపత్రం అందించారు. కల్లూరులో కొత్తగా పాలిటెక్నిక్ కళాశాలను, ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి అందించిన వినతిపత్రంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పేర్కొన్నారు. దీంతో పాటు సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలిపారు.



వేతనాల కోసం పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వాలంటూ ఆసుపత్రి ఆవరణలో సమ్మె చేశారు. బుధవారం ఉదయం నుంచి విధులకు హాజరు కాకుండా ఆసుపత్రి ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. మూడు రోజుల నుంచి ఆసుపత్రిలో పారిశుధ్యం చేయకపోవడంతో వార్డుల్లో ఎక్కడ చెత్త అక్కడే ఉండటంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఓపీలో సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉండటంతో మున్సిపల్ కార్మికులను పిలిపించి పారిశుధ్యం చేయాలని అధికారులు సూచించడంతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను లోపలకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని శాంతింపజేశారు. కాంట్రాక్టర్ జీతాలు ఇచ్చే దాకా విధుల్లోకి వచ్చేది లేదని కార్మికులు స్పష్టం చేస్తున్నారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు చొరవ తీసుకొని ఈనెల 14వ తేదీ లోపు వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. తొలుత ఖమ్మం జిల్లా ప్రభుత్వ హస్పటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు, ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ మూడు నెలలుగా చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ కాంట్రాక్టర్ ప్రసాద్ రెడ్డి జీతాలు ఇవ్వడం లేదని అన్నారు.ప్రభుత్వం నుంచి మాకు బడ్జెట్ ఇవ్వకపోవడంతో కార్మికులకు జీతాలు ఇవ్వలేదని కాంట్రాక్టర్ చెబుతున్నారని, మూడు రోజుల నుంచి పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్న పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఇంటి అద్దెలకట్టలేక యజమానులతో మాటలు పడుతూ పిల్లలకు స్కూల్ ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎప్పుడైనా జిల్లాలను మంత్రులు, అధికారులు స్పందించి వెంటనే వారికి వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 14వ తేదీ వరకు గడువు పెట్టారని గడువులోగా వేతనాలు చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఫలించిన రైతు సంఘం కృషి

- మిగిలిన ధాన్యం కొనుగోలుకు లభించిన అనుమతి

నవతెలంగాణ-వైరా

వైరా ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలోని విప్పలమడక, సిరిపురం గ్రామాలలో మిగిలిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, విప్పలమడక మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, నాయకులు తోట నాగేశ్వరావు, బాణాల శ్రీనివాసరావులు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఎంఎల్ఏ రాందాస్ నాయక్, రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా తర్వాత జిల్లా కలెక్టర్‌తో ధాన్యం కొనుగోలుకు ఆదేశించారు. అయినా ఫలితం లేకపోవటంతో రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం ధాన్యం రాశుల వద్ద కు వెళ్లి రైతులతో కలిసి ఆందోళన చేయటంతో ధాన్యం రైతుల గోస ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పతాక శీర్షికల్లో వచ్చి జిల్లా అధికారులను, ప్రజా ప్రతినిధులను కదిలించింది. బుధవారం సాయంత్రానికి ధాన్యం కొనుగోలుకు పర్మిషన్ లభించింది. విషయం తెలుసుకున్న రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది. గురువారం ఒక్క రోజే కాటాలు వేయుటకు పర్మిషన్ రావటంతో రైతులు కాటా వేసే ముఠాలను బుధవారం రాత్రే మాట్లాడుకుని ధాన్యం తరలించే పనిలో నిమగ్నమయ్యారు. కొంత నష్టం జరిగినా ప్రభుత్వం ఇస్తున్న బోనస్ ఉపయోగ పడుతుందన్న ఆశతో రైతులు ఇన్నాళ్లు ఎదురుచూశారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



నవతెలంగాణ-వైరా

బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని వల్లాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వడ్డేపూడి రమేష్ బుధవారం ఉదయం మొక్కజొన్న పంటకు సాగునీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. రమేష్ తనకున్న ఎకరం పొలంతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేశాడు. మోటర్ ఆన్ చేసి ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. రమేష్ పొలం వద్ద విద్యుత్ మోటార్ నడుస్తుండగా ఎవరు కనబడకపోవడంతో, గమనించిన మరో రైతు యలమాటి లక్ష్మణ్ రమేష్ కోసం గాలించాడు. పొలాల సమీపంలో ఉన్న బావి వద్ద రమేష్ చెప్పులు, కండువా కనిపించాయి. విషయాన్ని రమేష్ భార్య కృష్ణవేణికి, స్థానికులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత స్థానికులు రమేష్ కోసం బావిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య కృష్ణవేణి, కుమార్తె కీర్తి ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై ఎవిఆర్ భాగ్యరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సొమ్మును పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న కేంద్రం





నవతెలంగాణ-పెనుబల్లి

ప్రజల సొమ్ముని బడ్జెట్ పేరుతో బడా పెట్టుబడి దారులకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతోందని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు చలమాల విట్టల్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తూ బడ్జెట్ కాగితాలను తగులబెట్టారు. ఈ సందర్భంగా విట్టల్ మాట్లాడుతూ బడ్జెట్‌లో నిరుపేదలకు కాదని అంబానీ, ఆదానిలకు లక్షల కోట్లలో ప్రజల సొమ్ముని దోచిపెడుతున్నారని ఆరోపించారు. కార్మికులది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ కార్మికులది కాదని రైతాంగానికి అన్యాయం చేసే బడ్జెట్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లు తెలంగాణకి నిధులు కేటాయించకుండాతీరని అన్యాయం చేసిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గాయం తిరుపతి రావు అన్నార. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు కేంద్రంలో ఇద్దరు మంత్రులుగా ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు చలమాల నరసింహారావు, నల్లమల అరుణ ప్రతాప్, చిలక రామచంద్ర, సభ్యులు అంబోజు బుడ్డయ్య, మిద్దె స్వామి, కడియం రాజు, దుర్గయ్య, చెన్నారావు, కృష్ణ, అన్నపురెడ్డిపల్లి లక్ష్మయ్య , పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం

తల్లాడ : కేంద్ర బడ్జెట్ ప్రతులను సీఐటియు నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు అయినాల రామలింగేశ్వర రావు మాట్లాడుతూ 90శాతం దేశ సంపద సృష్టికర్తలైన కార్మికులకు రైతులకు బడ్జెట్లో తీరని అన్యాయం జరిగిందన్నారు. పేదలపై పన్నులు వేసి ప్రతి కొద్దిమంది కార్పొరేటర్లకు దేశ సంపదను దోచుపెట్టే బడ్జెట్ అని అభివర్ణచారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నల్లమోతు మోహన్ రావు, సిఐటియు నాయకులు గుడిపల్లి కృష్ణయ్య, తాడిపల్లి నరేష్, దాడిపల్లి భరత్, గుడిపల్లి బిక్షం, షేక్ జానీ దడిపల్లి రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించకపోతే కాంగ్రెస్‌ను గద్దెదించే వరకూ కొట్లాడుతాం

- పాల్వంచలో ఎస్ఎఫ్ఐ మహాసభల ప్రారంభ సూచికగా మహాప్రదర్శన
- పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజు
- రీయంబర్స్మెంట్ చెల్లించాలని డిమాండ్



నవతెలంగాణ-పాల్వంచ

విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే కాంగ్రెస్‌ను గద్దెదించే వరకు కొట్లాడుతాం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), జిల్లా 4వ మహాసభలు పాల్వంచ పట్టణ కేంద్రంలోపెద్దమ్మ గుడి రాయల్ ఫంక్షన్ హాల్ వద్ద ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభ సూచికగా స్థానిక అంబేద్కర్ సెంటర్ నుండి కేటీపీఎస్ గేట్ వరకు విద్యార్థి మహాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్నదని, పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల కోసం కోసం, మెస్ కాస్మోటిక్స్ చార్జీల పెంపు కోసం, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్ గ్రేడ్ చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు.

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఫీజులు నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహించామన్నారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్, ప్రభుత్వ హైస్కూల్లో ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసామన్నారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెరిగాయన్నారు. . విద్యార్థులలో దేశభక్తి భావాలు పెంపొందించడానికి జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు, సమాజం పట్ల అవగాహన కల్పించేందుకు పలు అంశాలపై సెమినార్లు, చర్చాగోష్ఠులు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. నల్లమల్ల సురేష్, శరభారెడ్డి వంటి అనేక మంది విద్యార్థి అమరవీరులు ప్రాణ త్యాగం చేసిన గడ్డపై 4వ మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకం అన్నారు. జిల్లా మహాసభలకు జిల్లాలోని 23 మండలాల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. భవిష్యత్తులో జిల్లా విద్యారంగ అభివృద్ధికి అనేక అంశాలపై సమగ్రంగా చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. మహాసభల జయప్రదానికి విద్యారంగ శ్రేయోభిలాషులు, మేధావులు, ఉపాధ్యాయులు, అభ్యుదయవాదులు, విద్యార్థులు తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి అభిమన్యు, జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.భూపేందర్, జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రామ్ చరణ్, జిల్లా నాయకులు బి సాయి, నవీన్ పాల్గొన్నారు.

కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి

- ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికలు జరపాలి
- పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలి
- నిరసన కార్యక్రమంలో ఇల్లందు బస్ డిపో ఎస్డబ్ల్యుఎఫ్(సీఐటియు) కార్మిక సంఘం

నవతెలంగాణ -ఇల్లందు

ఆర్టీసీ కార్మిక సంఘాలపై గత ప్రభుత్వం పెట్టిన ఆంక్షలను ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని, గుర్తింపు సంఘాల ఎన్నికలు జరపాలని టీఎస్ ఆర్టిసి ఇల్లందు బస్ డిపో ఎస్డబ్ల్యుఎఫ్(సిఐటియు) గౌరవ అధ్యక్షులు తాలూరు కృష్ణ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇమ్మడి వెంకటేశ్వర్లు(ఐవి) జే. ఉపేంద్ర చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరసన దినంలో భాగంగా బుధవారం డిపో కార్మికులు బ్యాడ్జీలు ధరించి ఆర్టీసీ డిపో గేటు దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మస్టర్ల కుదింపు, పని గంటల పెంపు, డబుల్ డ్యూటీ చేయాలని ఒత్తిడి, డబుల్ డ్యూటీలు చేయకపోతే అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. విశ్రాంతి లేని డబుల్ డ్యూటీలు చేయడం వల్ల మానసిక ఒత్తిడికి గురై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు పునరాలోచన చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇల్లందు డిపోలో కార్మికులకు మూడు నెలల ఓటీ ఇవ్వాల్సి ఉందని త్వరగా ఇప్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. రాత్రి 8 గంటల లోపు డ్యూటీలు దిగే విధంగా మహిళా కండక్టర్లకు డ్యూటీలు వేయాలన్నారు. కొన్ని బస్సులకు డబల్ డోర్లు ఉన్నాయని వెనక డోర్ మూయించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎల్ రావు, నజీర్, సురేష్, అంజయ్య, ఉమామహేశ్వరి, లచ్చయ్య జెఎస్రావు, బివి,రత్నం తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో డంపింగ్ యార్డ్ లొల్లి

- వేలమంది పోలీసుల పహారాలో అర్ధరాత్రి నుంచే పనులు ప్రారంభం
- రాత్రికి రాత్రే ప్రజల నిర్బంధం.. 144 సెక్షన్
- రాత్రి 12 గంటలకే బీఆర్ఎస్, బీజేపీ నాయకుల అరెస్టులు
- సెల్‌టవర్ ఎక్కి యువకుల నిరసన





నవతెలంగాణ-గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ భూముల్లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును స్థానికులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారు. పచ్చటి వ్యవసాయ పొలాలు, అడవితో ఆహ్లాదకరంగా ఉన్న ఈ ప్రాంతంలో.. హైదరాబాద్ నగర చెత్తను తీసుకువచ్చి కాలుష్యం చేయొద్దని ఇప్పటికే పలుమార్లు నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి నుంచి వేల మంది పోలీసు బలగాల మధ్య డంపింగ్ యార్డు పనులను చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి నుంచే స్థానికంగా ఉన్న గ్రామాలను ఎక్కడికక్కడ నిర్బంధించి.. బీఆర్ఎస్, బీజేపీ ముఖ్య నాయకులను అరెస్టు చేసి పనులు ప్రారంభించారు. ఈ పనుల గురించి తెలియడంతో స్థానిక ప్రజలు భగ్గుమన్నారు. పనులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయితే గ్రామాల్లో 144 సెక్షన్ విధించి.. పోలీసు పహారా మధ్య. జీహెచ్ఎంసీ అధికారులు, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డితోపాటు పోలీస్ ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టారు.

గ్రామ సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యేను అడ్డుకున్న పోలీసులు

బలవంతంగా డంపింగ్ యార్డు పనులు ప్రారంభించారన్న సమాచారంతో నల్లవల్లి గ్రామ ప్రజలను పరామర్శించేందుకు వచ్చిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ.. ఉన్నత న్యాయస్థానం స్టేటస్కో ఆదేశాలను ప్రభుత్వ పోలీసు యంత్రాంగం బేఖాతర్ చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో హైదరాబాద్ చెత్తను తీసుకువచ్చి అటవీ ప్రాంతం కలుషితం చేయడం సబబు కాదన్నారు. ఇక్కడి వ్యర్థాలు నర్సాపూర్ రాయరావ్ చెరువులోకి వచ్చి.. దాని కింది ఆయకట్టు వ్యవసాయ ఆధారిత ప్రాంతం మొత్తం కుప్పకూలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడుతుండగా.. ప్రస్తుతం గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉందంటూ ఏమైనా మాట్లాడాలంటే జిల్లా ఉన్నతాధికారులను కలిసి మాట్లాడండి అని చెప్పగా.. వినకపోవడంతో వెంటనే ఎమ్మెల్యేను కూడా అరెస్టు చేశారు. మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ పచ్చటి ప్రాంతాన్ని కాలుష్యం చేయొద్దని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోగా పనులు చేపట్టలేదన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకంగా ఈ పనులు చేపడుతున్నదని తెలిపారు. ఇదే విషయమై మంత్రి దామోదర రాజనర్సింహను గుమ్మడిదల బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డిలతోపాటు పలువురు నాయకులు గతంలో కలిసినప్పుడు.. వ్యవసాయ భూములను కాపాడుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అలాంటిది ఇప్పుడు ఈ పనులను చేపట్టడం వెనుక మతలబు ఏమున్నదని ప్రశ్నించారు. గుమ్మడిదల వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు పాలు, పెరుగు, కూరగాయలు, వివిధ రకాల పంటలను రైతులు తీసుకెళ్తుంటారన్నారు. ఈ డంపింగ్ యార్డుతో వ్యవసాయం మొత్తం దెబ్బతిని రైతులు రోడ్డున పడుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

సెల్‌టవర్ ఎక్కి యువకుల నిరసన

కొత్తపల్లి గ్రామానికి చెందిన సూరారం మహేష్, కొక్కొండ అశోక్, మాలోత్ రాజ్ అనే ముగ్గురు యువకులు టెలిఫోన్ సెల్ టవర్ ఎక్కి డంపింగ్ యార్డు పనులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. వేల మంది పోలీసులతో డంపింగ్ యార్డ్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ యార్డుకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తామని తెలిపారు. సంబంధిత పోలీసు అధికారులు వారితో మాట్లాడుతూ.. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకో వాలని బుజ్జగించడంతో యువకులు సెల్ టవర్‌పై నుంచి దిగారు.

దశాబ్దాల ఎదురుచూపులకు తెరదించాం

(మొదటిపేజీ తరువాయి)

తామిచ్చిన హామీ ప్రకారమే, పక్కా ప్రణాళికతో ఈ రెండు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులగణనలో దాదాపు లక్షమంది ఉద్యోగులు పాల్గొన్నారని చెప్పారు. ప్రణాళికాశాఖ, ప్రజలు, మీడియా సహా అందరూ దీనికి పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. కులగణన పూర్తి పారదర్శకంగా జరిగిందనీ, ఎవరెవరు దీనిలో పాల్గొనలేదో కొందరి ప్రముఖుల పేర్లను అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని తెలిపారు. వ్యక్తిగత సమాచారం మినహా కులగణన జరిగిన తీరుపై పూర్తిస్థాయి సమాచారాన్ని ప్రజల ముందు పెడతామన్నారు. ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు.

రేపటి నుంచి కుంభాభిషేక మహోత్సవం

- సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ
- కలెక్టర్ రాహుల్‌శర్మకు ఆహ్వాన పత్రిక అందించిన ఈఓ మహేష్

నవతెలంగాణ-మహదేవపూర్



జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో ఈనెల 7,8,9 తేదీల్లో మూడు రోజులపాటు మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి మహేష్, ఆలయ అర్చకులు బుధవారం తెలిపారు. 1982లో శృంగేరి జగద్గురుతో కుంభాభిషేక మహోత్సవం జరిగిందని, 42ఏండ్ల తర్వాత మళ్లీ కుంభాభిషేకాన్ని జరునుతున్నట్టు చెప్పారు. మూడు రోజులపాటు శత చండీ యాగం, సహస్ర గడాభిషేకం, మహా రుద్రం నిర్వహిస్తున్నామని, సందర్శకులు భారీ సంఖ్యలో పాల్గొని దర్శించుకోవాలని అన్నారు. అన్నదానం కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కాళేశ్వరంలో జరగబోయే కుంభాభిషేకం, మహాశివరాత్రి, సరస్వతీ పుష్కరాల బందోబస్తు ఏర్పాట్లను బుధారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పరిశీలించారు. మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాల్లో అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించుకుంటారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ పరిసరాలు, మెయిన్ ఘాట్, వీఐపీ ఘాట్, బైపాస్ రోడ్డు ను కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడి, మహదేవపూర్ సీఐ రామచందరావు, కాళేశ్వరం ఎస్ఐ జి.తమాశరెడ్డి తో కలిసి పరిశీలించారు. వాహనాలకు సరైన పార్కింగ్ ఉండేలా, ట్రాఫిక్ జామ్ కాకుండా, ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మహా కుంభాభిషేకం మహోత్సవాలకు జిల్లాకేంద్రంలోని ఐడీఓసీ కార్యా లయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో మహేష్ అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహా కుంభాభిషేకం మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారని, వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ఏర్పాట్లకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంటుందన్నారు. ఆయనవెంట దేవస్థానం సిబ్బంది, తదితరులున్నారు.

మామిడి పూతపై మంచు తీవ్రత

పది రోజులుగా పెరిగిన మంచు ప్రభావం

కొన్ని చోట్ల తీవ్రత.. మరికొన్ని చోట్ల నిల్..

రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల్లో మామిడి సాగు

అధిక తోటల్లో 30-35శాతం మాత్రమే పూత





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రధాన ఉద్యాన పంట మామిడిపై మంచు తీవ్రత అధికంగా ఉంది. ప్రతియేటా డిసెంబర్ మూడోవారం, జనవరి తొలి, మలి వారాల నాటికి పూర్తిస్థాయిలో రావాల్సిన పూత ఈ ఏడాది ఆలస్యమవుతోంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పిందెలు ఏర్పడి కాయలు కాయాల్సింది. మంచు ప్రభావం వల్ల చాలా చోట్ల ఆ పరిస్థితి కనిపించటం లేదు. వచ్చిన కొద్దిపాటి పూత కూడా పదిరోజులుగా కురుస్తున్న మంచుతో రాలుతోందని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌లో అధిక వర్షాలు, రాత్రివేళల్లో చలితీవ్రత, తెగుళ్ల ప్రభావం వల్ల పూత ఆశించిన మేర రావడం లేదని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. మంచు కారణంగా మామిడిని తేనె మంచు, బూడిద రంగు తెగులు, తామర తెగుళ్లు ఆశిస్తున్నాయి. అయితే, మంచు ప్రభావం అన్నిచోట్ల ఒకే రకంగా లేదు. కొన్ని జిల్లాల్లో తీవ్రంగా. ఉండగా.. మరికొన్ని జిల్లాల్లో ఇప్పటివరకు ఆ ప్రభావం లేదు.

40 శాతం పంట రావటం కష్టమే..!

రాష్ట్రవ్యాప్తంగా 4 నుంచి 5 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 50వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 33వేల ఎకరాల్లో సేద్యంలో ఉంది. దీనిలో ఖమ్మం చుట్టుపక్కల మండలాలు రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కూసుమంచి, చింతకాని తదితర ప్రాంతాల్లో 35శాతం వరకే పూత కనిపిస్తోంది. పెనుబల్లిలో కాత, పూత తక్కువగానే ఉండగా.. కల్లూరు డివిజన్‌లో ఒకింత పర్వాలేదనిపించేలా ఉంది. అయితే పది రోజులుగా కురుస్తున్న మంచుతో ఆ కొద్దిపాటి పూత కూడా రాలుతోంది. ఒక్కో చెట్టుకు ఆడ, మగ పూత ఉంటుంది. సుమారు పదివేల మగపూత ఉంటే ఒక్క ఆడపూత కాయగా మారుతుంది. మామిడి పంటకు మంచు వల్ల తెగుళ్ల సోకడంతో దిగుబడిపై ప్రభావం పడనుంది. ఈ ఏడాది 40శాతం పంట కూడా వచ్చే అవకాశాలు తక్కువేనని రైతాంగం అంటోంది.

సకాలంలో పూత వస్తేనే ఆశించిన దిగుబడి

మామిడి దిగుబడి ఆశాజనకంగా ఉండాలంటే పూత సకాలంలో రావటమే కీలకం. సాధారణంగా ముందుతేడాది బాగా కాపు వస్తే మరుసటి ఏడాది ఆ తోటలు పెద్దగా కాయవు. సకాలంలో పూత పూస్తే మార్చి చివరి నాటికి పంట వస్తే దిగుబడి, రేటు అధికంగా ఉంటుంది. టన్ను రూ.50వేల నుంచి రూ.75వేలు పలుకుతుంది. ఏప్రిల్‌లో దిగుబడి వస్తే రూ.15వేల నుంచి రూ.30వేలు, మేలో వస్తే మాత్రం రూ.8వేల నుంచి రూ.30వేలలోపే రేటు ఉంటుంది. ఈ ఏడాది పూతను బట్టి చూస్తే అధిక మొత్తం పంట మే నెలలోనే వచ్చే అవకాశం ఉందని రైతులంటున్నారు. 18నుంచి 25 ఏండ్ల వయసున్న మామిడి తోటల్లో ఎకరానికి 20-25 చెట్లు ఉంటాయి. అధిక సాంద్రత మామిడి తోటల్లో మాత్రం ఎకరానికి 250 చెట్ల వరకు పెంచుతారు. బాగా పండితే ఎకరానికి 4 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది రెండు టన్నుల దిగుబడి వస్తే ఎక్కువని రైతాంగం చెబుతోంది. పూత దశల వారీగా వస్తుంది. మంచు ప్రభావంతో పిందె కట్టే దశలో పూత రాలుతుండటంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. తెలంగాణలో అధికంగా బంగినపల్లి, చిన్నరసాలు, పెద్దరసాలు, తోతాపురి వంటి మామిడి రకాలు సాగు చేస్తారు.

పూత దశలో తోటలు..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 40 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. మెదక్ జిల్లాలో రామాయంపేట, నిజాంపేట్, నార్సింగ్, పాపన్న పేట, టెక్మాల్, చేగుంట, హవేలీ ఘనపూర్, తూప్రాన్, శివంపేట, సంగారెడ్డి జిల్లాలో కోహిర్, జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్, సదాశివపేట, కంది, పుల్కల్, రాయికోడ్, హుస్నాబాద్, వర్గల్, చేర్యాల, గజ్వేల్, జగదే వ్ పూర్ వంటి ప్రాంతాల్లో మామిడి తోటలున్నాయి. ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. వాతావరణ మార్పుల వల్ల పూత రాలుతున్నది. మంచు వల్ల పూత నిలవడం లేదు. చెట్లపైనే మారిపోవడం, నేలరాలిపోవడం వల్ల కాత 25 శాతం పైనే దెబ్బతిననుంది. తామర, ఇతర పురుగుల వల్ల పూత ఉండటం లేదు. రైతులు పురుగు మందులు స్ప్రే చేసినా ఫలితం ఉండట్లేదు. కొన్ని తోటల్లో పూత ఆలస్యంగా వచ్చిందని రైతులు చెబుతున్నారు. వాతావరణం సహకరించకపోతే దిగుబడి బాగా తగ్గుతుందని అంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మామిడి పూత బాగానే ఉన్నా, పిందె రాలిపోతున్నది. జిల్లాలో దిగుబడి 3 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రస్తుతానికి మామిడి పూతకు ఎక్కడా ఎలాంటి సమస్య కనిపించలేదు. కరీంనగర్ జిల్లాల్లో మామిడి పూత ఇప్పుడు ఇప్పుడే వస్తుంది. పెద్దగా సమస్య లేదని తోట యజమానులు అంటున్నారు.

మామిడి దిగుబడి మరింత తగ్గే చాన్స్..

ఈ ఏడాది మామిడి దిగుబడి, నాణ్యతపై తెగుళ్ల ప్రభావం అధికం ఉండనుంది. ఖమ్మం జిల్లాలో నాగార్జునసాగర్ ఆయకట్టులో ఎక్కువగా మామిడి చేస్తున్నారు. కాబట్టి కాయల్లో నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ కాలం నిల్వ ఉండవని వ్యాపారులు భావిస్తారు. హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో బెట్ట పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి కాబట్టి నీరుశాతం తక్కువగా ఉండి కాయలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయనే ప్రచారం ఉంది. ఈ కారణంతో ఎక్కువ మంది వ్యాపారులు అక్కడి పంటపై ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో పండే పంటను ముంబయి, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తారు. ఖమ్మం జిల్లా పంటను ఎక్కువగా మహారాష్ట్ర, పంజాబ్, హర్యానాకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అయితే ఈ ఏడాది పూత సకాలంలో రాకపోవడం, మంచు ప్రభావంతో తెగుళ్ల తీవ్రంగా ఉండటంతో ఏమేరకు వ్యాపారులు పంటపై ఆసక్తి చూపుతారనేది సందేహంగా ఉంది. ప్రతియేటా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రూ.400 కోట్లకు పైగా మామిడి వ్యాపారం సాగుతోంది. కానీ ప్రతికూల పరిస్థితుల కారణంగా ఈ ఏడాది రూ.200 కోట్ల పంట ఎగుమతి జరిగితే ఎక్కువని అంటున్నారు.

మంచుతో పూత రాలుతోంది..

ఈ ఏడాది పూత చాలా ఆలస్యంగా వచ్చింది. వారం, పదిరోజులుగా కురుస్తున్న మంచుతో తెగుళ్ల తీవ్రత అధికం అవుతోంది. మామిడి పూత బాగా రాలుతోంది. నేను 80 ఎకరాలు ఎకరం రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వెచ్చించి కౌలుకు తీసుకున్నా. పరిస్థితులు చూస్తుంటే నష్టాలు వస్తాయేమోనని భయంగా ఉంది.

- కమల్‌షా, కౌలు రైతు, కల్లూరు, ఖమ్మం జిల్లా

35శాతం పూతే పూసింది..

ఈ ఏడాది మంచు ప్రభావంతో 35 శాతం పూతే పూసింది. కల్లూరు డివిజన్‌లో ఒకింత ఆశాజనకంగా పూసినా ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల్లో మాత్రం బాగా పూత పూయటం తగ్గింది. మంచు, వర్షాల వల్ల పూత రావడం కూడా ఆలస్యమైంది. డిసెంబర్ నాటికి పూతతో చెట్లు కళకళలాడాల్సింది ఇప్పటికీ చాలా చోట్ల అనుకూలంగా పూత రావటం లేదు. మల్టీకే వంటి మందులు పిచికారీ చేయాలని రైతాంగానికి సూచిస్తున్నాం. పూత వచ్చేందుకు, తెగుళ్ల నివారణపై డిపార్ట్‌మెంట్ వైపు నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

- మధుసూదన్, ఖమ్మం జిల్లా ఉద్యాన అధికారి

టెట్‌లో తగ్గిన ఉత్తీర్ణత

- పేపర్-1లో 59.48 శాతం, పేపర్-2లో 31.21 శాతం అర్హత
- గతసారి కంటే పేపర్-1లో 7.65 శాతం, పేపర్-2లో 2.97 శాతం తగ్గుదల
- ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా విడుదల చేశారు. టెట్ ఫలితాల్లో గతసారి కంటే ఈసారి ఉత్తీర్ణత తగ్గింది. గతేడాది నవంబర్ నాలుగున టెట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. గతనెల రెండు నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. టెట్‌కు 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. పేపర్-1ను ఎనిమిది విడతల్లో ఏడు భాషల్లో (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, బెంగాలీ) నిర్వహించామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్-2ను 12 విడతల్లో ఏడు భాషల్లో (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, సంస్కృతం) నిర్వహించామని పేర్కొన్నారు. టెట్ పేపర్-1కు 94,327 మంది దరఖాస్తు చేయగా, 69,496 మంది పరీక్ష రాశారని వివరించారు. వారిలో 41,327 (59.48 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పేపర్-2లో మ్యాథ్స్, సైన్స్ విభాగానికి 93,263 మంది, సోషల్ స్టడీస్ విభాగానికి 88,163 మంది కలిపి మొత్తం 1,81,426 మంది దరఖాస్తు చేస్తే, మ్యాథ్స్, సైన్స్‌కు 69,390 మంది, సోషల్ స్టడీస్‌కు 66,412 మంది కలిపి 1,35,802 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో మ్యాథ్స్, సైన్స్‌కు 23,755 మంది, సోషల్ స్టడీస్‌కు 18,629 మంది కలిపి 42,384 (31.21 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. పేపర్-1, పేపర్-2 కలిపి 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 2,05,278 మంది రాతపరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. వారిలో 83,711 (30.36 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. గతేడాది మే 20 నుంచి జూన్ రెండు వరకు టెట్ పరీక్షలను నిర్వహించారు. జూన్ 12న ఫలితాలను విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 99,958 మంది దరఖాస్తు చేయగా, 85,996 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 57,725 (67.13 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2కు 2,86,381 మంది దరఖాస్తు చేస్తే, 1,50,491 మంది పరీక్ష రాశారు. వారిలో 51,443 (34.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. గతసారి టెట్ ఫలితాలతో పోలిస్తే ఈసారి టెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత తగ్గింది. పేపర్-1లో గతసారి 67.13 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి 59.48 శాతం మంది ఉతీర్ణత పొందారు. అంటే గతసారి కంటే ఈసారి పేపర్-1లో 7.65 శాతం ఉత్తీర్ణత తగ్గింది. పేపర్-2లో గతసారి 34.18 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈసారి పేపర్-2లో 31.21 శాతం మంది ఉత్తీర్ణత పొందారు. అంటే గతసారి కంటే ఈసారి పేపర్-2లో 2.97 శాతం మంది తగ్గారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. టెట్ ఫలితాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

టెట్-2024-2 ఫలితాలు

పేపర్	హాజరు	ఉత్తీర్ణత	శాతం
1	69,476	41,327	59.48
2 (మ్యాథ్స్, సైన్స్)	69,390	23,755	34.24
సోషల్ స్టడీస్	66,412	18,629	28.05
మొత్తం	1,35,802	42,384	31.21

టెట్‌ల ఉత్తీర్ణత వివరాలు

సంవత్సరం	పేపర్-1	పేపర్-2
2024-2	59.48	31.21
(2025, జనవరి 2 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ)		
2024-1	67.13	34.18
(మే 20 నుంచి జూన్ 2 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ)		
2023, సెప్టెంబర్ 15	36.89.	15.30
2022, జూన్ 12	32.68	49.64
2017, జులై 23	57.37	19.51
2016, మే 22	54.45	25.04
2014, మార్చి 16	73.92	32.32

ఎమ్మెల్సీ స్థానాల్లో ముగ్గురి నామినేషన్లు దాఖలు


నవతెలంగాణ-నల్లగొండ, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధులు

వరంగల్ -ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం, మెదక్- నిజామాబాద్- కరీంనగర్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండలో ఇద్దరు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు నల్లగొండ జిల్లా కలెక్టర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన బంకరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున మరో సెట్ నామినేషన్ వేసినట్టు చెప్పారు. నల్లగొండ చెందిన పన్నాల గోపాల్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు.

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఒక నామినేషన్ దాఖలైంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన గవ్వల శ్రీకాంత్ నామినేషన్ వేశారు. ఇక్కడ మొత్తంగా బుధవారం వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ స్థానానికి 9 మంది నామినేషన్ వేశారు.

మట్టిదిబ్బెలు పడి ముగ్గురు కూలీలు మృతి

- మరొకరికి గాయాలు
- ఎల్బీనగర్‌లో విషాద ఘటన



నవతెలంగాణ-హాయత్ నగర్

వారంతా అడ్డా కూలీలు.. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు వారివి. రోజు మాదిరిగానే నిర్మాణ రంగం పనికి వెళ్లారు. పని ప్రారంభించిన అరగంటకే ప్రమాదవశాత్తు ప్రహరీ కూలడంతో వారు విగతజీవులుగా మారారు. ఈ ఘటన హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో బుధవారం జరిగింది. ఎల్‌బీనగర్ పోలీసులు, తోటి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కుంజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల వీరయ్య(50)కు ఇద్దరు కుమారులు. బతుకుదెరువు కోసం 5 సంవత్సరాల కిందట నగరానికి వలస వచ్చి పెద్ద అంబర్‌పేటలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం వీరయ్య చిన్న కొడుకు రాము(21), తన మేనల్లుడు ముద్దం వాసు(21)ను తీసుకుని ఓ బిల్డర్ ద్వారా ఫోన్‌లో సమాచారం తెలుసుకుని ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురి కాలనీలో పనికి వెళ్లారు. సుమారు 1000 చదరపు గజాల స్థలంలో జరుగుతున్న సెల్లార్ నిర్మాణానికి సంబంధించి కింది భాగంలో పీసీసీ కాంక్రీటు పనుల్లో వారు ముగ్గురు నిమగ్నమయ్యారు. అయితే ఒక్కసారిగా 60 అడుగుల ఎత్తు నుంచి మట్టిదిబ్బెలు కూలిపోవడంతో మట్టి పెళ్లలు, రాళ్లు మీద పడటంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు, డీఆర్ఎఫ్ టీమ్ అక్కడకు చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వారితోపాటు పనిచేస్తూ గాయపడిన నల్లగొండ జిల్లా చింతపల్లికి చెందిన భిక్షపతికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమతి ఉంది : జోనల్ కమిషనర్

ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 1000 చదరపు గజాల స్థలంలో రెండు సెల్లార్‌లు, గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు 4 అంతస్తుల నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి రమేష్ అనే వ్యక్తికి గత ఏడాది డిసెంబర్‌లో అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. అయితే, నిర్మాణం జరుగుతున్న సమయంలో సరైన రక్షణ చర్యలు, కూలీలకు రక్షణ పరికరాలు లేకపోవడంతో ఈ ప్రమాదంలో ప్రాణం కోల్పోయినట్టు తెలుస్తోందన్నారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ నర్సింహారెడ్డి ఉన్నారు.

రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి : ఎమ్మెల్యే

ఘటనా స్థలంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భిక్షపతిని పరామర్శించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబానికి రూ.25 లక్షలు, హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు కూడా యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సెల్లర్ నిర్మాణంలో ఎలాంటి నిబంధనలూ పాటించకుండా పనులు చేయిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

17.03 లక్షల మందికి లబ్ధి

(మొదటిపేజీ తరువాయి)

చేశామని వివరించారు. వానాకాలం రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. యాసంగిలో 48.06 లక్షల మెట్రిక్ టన్నులు, రూ.10,547 కోట్లు ఉండగా, ఖరీఫ్‌లో 52.51 లక్షల మెట్రిక్ టన్నులు, రూ.12,178.97 కోట్లు చెల్లించామని తెలిపారు. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇచ్చి కొన్న ప్రభుత్వం అందుకు రూ. 1154 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. ఈ యాసంగికి కూడా సన్నాలకు బోనస్ కొనసాగించాలని ఆదేశించారు. పసుపు, మిరప పంటలకు మద్దతు ధర నిర్ణయించేందుకు కేంద్రానికి విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మేడారంలో ఘనంగా గుడి మెలిగే పండుగ

- మినీ జాతర పూజా కార్యక్రమాలు ప్రారంభం
- మేడారంలో సమ్మక్క, కన్నెపెల్లిలో సారలమ్మ ఆలయాలు శుద్ధి
- పూజారుల ప్రత్యేక పూజలు



నవతెలంగాణ- తాడ్వాయి

మేడారం మినీ జాతర ఉత్సవాలు ఊపందుకున్నాయి. ములుగు జిల్లా మేడారం, కన్నెపల్లి గ్రామాల్లో మినీ జాతరకు వారం ముందుగా నిర్వహించే గుడి మెలిగే పండుగ బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారులు మేడారం, కన్నెపల్లిలో సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య ఆధ్వర్యంలో పూజారులు వారి ఇండ్లను, దేవాలయాలను శుద్ధి చేసుకుని, అటవీ ప్రాంతానికి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించి గుడిపై కప్పారు. అనంతరం గుళ్లల్లో మహిళలు రంగురంగుల ముగ్గులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. గుడి మెలిగే పండగతో వనదేవతల మినీ జాతర ప్రారంభమైనట్టు పూజారులు భావిస్తారు. ఇప్పటినుంచి పూజారులు అత్యంత నియమనిష్టలు పాటిస్తారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన మునేందర్, పూజారులు కొక్కెర కృష్ణయ్య, మల్లెల ముత్తయ్య, బొక్కెన్న, మహేష్, సిద్దబోయిన అరుణ్, సిద్దబోయిన పాపారావు, సిద్దబోయిన నితిన్, అభ్యుదయ సంఘం అధ్యక్షులు సిద్దబోయిన బోజారావు, రానా రమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క పుట్టిన ఊరు బయ్యక్కపేటలో..

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వనదేవత సమ్మక్క పుట్టిన ఊరు బయ్యక్కపేటలో చందా వంశీయులైన(తలపతులు) సమ్మక్క పూజారులు బుధవారం ఘనంగా గుడి మెలిగే పండుగ నిర్వహించారు. పూజారుల సంఘం ప్రధాన కార్యదర్శి చందగోపాల్, సమ్మక్క ప్రధాన పూజారి చందా రఘుపతిరావు ఆధ్వర్యంలో చందా వంశీయులు ఉదయమే తలంటి స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి, ఇండ్లు, గుడిని శుభ్రపరచారు. అటవీ ప్రాంతానికి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించి గుడిపై కప్పారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం సమ్మక్క గతంలో ఉన్న గుడిసెను నూతన పరికరాలతో మళ్లీ నిర్మించారు. దాంతో బయ్యక్కపేటలో కూడా మినీ జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మేడారంలో లాగానే వారం ముందు నుండే ఈ గుడి మెలిగే పండుగ చేస్తారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు బయ్యక్కపేటలో ఘనంగా (మండే మెలిగే పండుగను) మినీ జాతరను నిర్వహించనున్నట్టు చందవంశీయులు తెలిపారు. సమ్మక్క పూజారులు తలపతులు చంద పరమయ్య, చంద్ర లక్ష్మణరావు, కృష్ణమూర్తి, చంద కళ్యాణ్ కుమార్, చంద గణేష్, మల్లెల సోమేష్, కోరం పాపారావు, పాయం వెంకటేశ్వర్లు, నాగులమ్మ పూజారి చందర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రేక్ ఫాస్ట్ అంటే అందరికీ గుర్తుకు వచ్చేవి ఇడ్లీ, ఉప్మా, దోశ, పూరీ... ఇవే. సాధారణంగా అన్ని ఇండ్లల్లో ఇవే ఉంటాయి. అయితే పిల్లలు ఏదైనా కొత్తగా కోరుకుంటారు. వాళ్ల కోసం హెల్దీగా ఏం చేయాలి అనే ఆలోచన రావడం సహజం. అలాంటి వారి కోసమే ఈ వెరైటీ హెల్దీ బ్రేక్ ఫాస్ట్‌లు. పిల్లలే కాదు ఇంటిల్లి పాదీ లొట్టలేసుకొని మరీ తినాల్సిందే. మరి అలాంటి బ్రేక్‌ఫాస్ట్‌లు ఏంటో, వాటిని ఎలా చేయాలో ఈరోజు తెలుసుకుందాం...



బ్రేక్ ఫాస్ట్‌కు సూపర్ ఆప్షన్స్

పోహా

కావాల్సిన పదార్థాలు: అటుకులు - ఒకటిన్నర కప్పు, నూనె - మూడు టేబుల్ స్పూన్లు, పల్లీలు - మూడు టేబుల్ స్పూన్లు, ఆవాలు - టీ స్పూన్, జీలకర్ర - టీ స్పూన్, ఎండు మిర్చి - రెండు, కరివేపాకు రెబ్బలు - రెండు, ఉల్లిగడ్డ తరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి (సన్నని తరుగు) - రెండు,



క్యారట్ తరుగు - పావు కప్పు, కాప్సికం తరుగు - పావు కప్పు, టమాటా సన్నని తరుగు - పావు కప్పు, ఉప్పు - రుచికి సరిపడా, పసుపు - పావు టీ స్పూను, ఫ్రోజెన్ బఠాణీ - పావు కప్పు, మొలకలు - అర కప్పు, పంచదార - పావు టీ స్పూను, నీళ్లు - నాలుగు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర - కొద్దిగా, నిమ్మరసం - టేబుల్ స్పూను.

తయారీ విధానం: ముందుగా అటుకులని జల్లించకుని నీళ్లతో తడిపి జల్లెడలో వదిలేయండి. తర్వాత స్టౌ ఆన్ చేసి నూనె వేడి చేసి అందులో పల్లీలు, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి కాసేపు వేగనివ్వాలి. అందులోనే ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేసి వేయించుకోవాలి. ఉల్లిగడ్డ ఎర్రగా మారిన తర్వాత అందులో క్యారట్, కాప్సికం ముక్కలు వేసి మూడు నిమిషాలు మగ్గనివ్వాలి. తర్వాత బఠాణీ, మొలకలు, టమాటా ముక్కలు, ఉప్పు, పసుపు వేసి కలిపి మూతపెట్టి మరో మూడు నిమిషాలు ఉడికించుకోవాలి. ఇప్పుడు తడిపిన అటుకులు వేసి చిదిరిపోకుండా బాగా కలపాలి. ఆ తర్వాత పంచదార వేసి కలిపి మూకుడు అంచుల వెంట నీళ్లు పోసి కదపకుండా మూత పెట్టి మూడు నాలుగు నిమిషాలు ఆవిరి మీద ఉడికించుకోవాలి. మూత తీసి నిమ్మరసం, కాస్త కొత్తిమీర తరుగు వేసి కలిపి దింపేసుకుంటే హెల్దీ స్ప్రౌట్స్ పోహ రెడీ!

మరమరాల వడలు

కావాల్సిన పదార్థాలు: మరమరాలు - ఒకటిన్నర కప్పులు, ఉల్లిగడ్డ - ఒకటి, పచ్చిమిర్చి - రెండు, కరివేపాకు - రెండు రెమ్మలు, ఉప్పు- రుచికి సరిపడా, కారం - అర టీ స్పూను, గరం మసాలా - పావు టీ స్పూను, ధనియాల పొడి - పావు టీ స్పూను, జీలకర్ర పొడి - పావు టీ స్పూను, అల్లం పేస్టు - అర టేబుల్ స్పూను, బియ్యం పిండి - రెండు చెంచాలు, మైదా - రెండు చెంచాలు

తయారీ విధానం: ముందుగా మరమరాలను ఒక గిన్నెలోకి తీసుకుని అందులో నీళ్లు పోసి ఐదు నిమిషాలు పక్కకు పెట్టాలి. ఈ లోపు ఉల్లిగడ్డ,



కరివేపాకు, పచ్చిమిర్చిని సన్నగా కట్ చేసి పక్కకు పెట్టుకోవాలి. మరమరాలు నానిన తర్వాత నీళ్లు లేకుండా పిండుకుంటూ ఓ బౌల్‌లోకి తీసుకోవాలి. ఇలా మరమరాలను మొత్తం గిన్నెలోకి తీసుకోవాలి.

అందులోకి సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, కరివేపాకు తరుగు వేయాలి. అలాగే రుచికి సరిపడా ఉప్పు, కారం, గరం మసాలా, ధనియాల పొడి, జీలకర్ర పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, బియ్యప్పిండి, మైదా వేసుకోవాలి. మైదా ఇష్టం లేకపోతే దాని బదులు శనగపిండి వేసుకోవాలి. ఇలా వేసుకున్న తర్వాత మసాలాలు మొత్తం మరమరాలకు పట్టే విధంగా బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత కొద్దికొద్దిగా నీళ్లు చిలకరించుకుంటూ మరమరాలను ముద్దగా వచ్చే వరకు కలుపుకోవాలి. అలా కలుపుకున్న తర్వాత మరమరాల మిశ్రమాన్ని కొంచెం తీసుకుని ఉండలాగ చేసి అరచేతిలో పెట్టి వడలుగా ఒత్తుకుని ఓ ప్లేట్‌లోకి తీసుకోవాలి. ఇలా మరమరాల మిశ్రమాన్ని మొత్తం వడలుగా ఒత్తుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి కడాయి పెట్టి డీప్ ఫ్రైకి సరిపడా నూనె పోసుకోవాలి. నూనె బాగా కాలిన తర్వాత ముందే సిద్ధం చేసుకున్న వడలను నూనెలో వేసి మీడియం ఫ్లేమ్‌లో రెండు వైపులా ఎర్రగా కాల్చుకోవాలి. ఇలా తయారు చేసిన వడలన్నింటినీ నూనెలో వేసి కాల్చుకోవాలి. అంతే ఎంతో టేస్టీగా ఉండే మరమరాల వడలు రెడీ. కేవలం నిమిషాల్లోనే ప్రిపేర్ చేసుకునే ఈ వడలను ఏదైనా చట్నీతో లేదా విడిగా తిన్నా రుచిగా వుంటాయి. నచ్చితే మీరూ ట్రై చేసుకోండి.

ఓట్స్ పకోడీ

కావాల్సిన పదార్థాలు: గుప్పెడు - జీడిపప్పులు, ఒక కప్పు - ఓట్స్, రెండు - ఉల్లిగడ్డలు, పావు కప్పు - శనగపిండి, పావు కప్పు - బియ్యప్పిండి, మూడు - పచ్చిమిర్చి, గుప్పెడు - కరివేపాకు, కొద్దిగా - కొత్తిమీర తరుగు, అరటీస్పూన్ - గరంమసాలా, పావుటీస్పూన్ -



పసుపు, తగినంత - కారం, కొద్దిగా - అల్లంవెల్లుల్లి పేస్ట్, రుచికి సరిపడా - ఉప్పు, నూనె - వేయించడానికి సరిపడా.

తయారీ విధానం: ఇందుకోసం ముందుగా ఒక గిన్నెలో ఓట్స్‌ను తీసుకొని అవి పూర్తిగా నిండిపోయేలా కాకుండా సగం వరకు మాత్రమే నీళ్లు పోసి కొద్దిసేపు నానబెట్టుకోవాలి. అవి నానేలోపు రెసిపీలోకి కావాల్సిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చిలను సన్నగా తరుక్కొని పక్కన పెట్టుకోవాలి. అలాగే జీడిపప్పు పలుకులు, కొత్తిమీర, కరివేపాకు సన్నగా కట్ చేసుకొని పక్కనుంచాలి. ఓట్స్ చక్కగా నాని మెత్తగా అయ్యాయనుకున్నాక నీళ్లు వడకట్టి వాటిని ఒక మిక్సింగ్ బౌల్‌లోకి తీసుకోవాలి. అందులో శనగపిండి, బియ్యప్పిండి యాడ్ చేసుకొని బాగా కలుపుకోవాలి. తర్వాత ముందుగా తరిగి పెట్టుకున్న సన్నని ఉల్లిగడ్డ, పచ్చి మిర్చి తరుగు వేసుకొని మరోసారి చక్కగా మిక్స్ చేసుకోవాలి. ఇప్పుడు ఉప్పు, సన్నగా తరుక్కున్న జీడిపప్పు పలుకులు, కొత్తిమీర, కరివేపాకు తరుగు, కారం, పసుపు, గరంమసాలా, అల్లంవెల్లుల్లి పేస్ట్ ఇలా మిగతా పదార్థాలన్నీ వేసుకొని అన్నీ కలిసేలా బాగా మిక్స్ చేసుకోవాలి. అవసరమైతే కొద్దిగా వాటర్ యాడ్ చేసుకొని పకోడీ పిండి మాదిరిగా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టుకొని ఆయిల్ వేసుకోవాలి. నూనె వేడయ్యాక ముందుగా కలిపి పెట్టుకున్న ఓట్స్ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకొని పకోడీల్లా వేసుకోవాలి. మీడియం ఫ్లేమ్ మీద అన్ని వైపులా పకోడీ చక్కగా కాలేంత వరకు వేయించుకోవాలి. ఎర్రగా వేగి, గోల్డెన్ కలర్‌లోకి వచ్చాయనుకున్నాక వాటిని తీసి టిష్యూ పేపర్ పరచిన ప్లేట్‌లో వేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా టిష్యూ పేపర్ అదనపు నూనెను పీల్చేస్తుంది. ఆ తర్వాత వేడివేడిగా సర్వ్ చేసుకుంటే చాలు.

అరటి కోలా బాల్స్

కావాల్సిన పదార్థాలు: అరటికాయలు - రెండు, పల్లీలు - కప్పు, కొబ్బరి తురుము - పావు కప్పు, అల్లం - అంగుళం ముక్క, పచ్చిమిర్చి - రెండు, కారం - టేబుల్ స్పూను, పసుపు - పావు చెంచా, సోంపు - పావు చెంచా, ఇంగువ - చిటికెడు, సన్నని ఉల్లిగడ్డ తరుగు - ముప్పావు కప్పు, ఉప్పు - రుచికి సరిపడా, కొత్తిమీర తరుగు - చారెడు, కరివేపాకు - రెండు రెమ్మలు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ విధానం: ముందుగా అరటికాయల చివర్లు కట్ చేసుకొని మరీ మెత్తగా కాకుండా ఉడికించుకోవాలి. ఆ తర్వాత వాటిని చల్లార్చుకొని తొక్క తీసి తురుముకొని పక్కనుంచాలి. అలాగే ఉల్లిగడ్డలను సన్నగా తరుక్కొని రెడీగా ఉంచుకోవాలి. కొత్తిమీర, కరివేపాకుని సన్నగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టుకొని పల్లీలను వేసి వేయించుకొని పొట్టు తీసుకొని పక్కన పెట్టుకోవాలి. మిక్సీ జార్



తీసుకొని అందులో వేయించుకున్న పల్లీలు, పచ్చిమిర్చి, అల్లం, పసుపు, సోంపు, కారం, ఇంగువ, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత వెడల్పాటి మిక్సింగ్ బౌల్ తీసుకొని అందులో మిక్సీ పట్టుకున్న పల్లీల మిశ్రమం, అరటికాయ తురుము, ఉల్లిగడ్డ తరుగు, కొత్తిమీర, కరివేపాకు తరుగు, కొబ్బరి తురుము వేసుకొని అన్నీ కలిసేలా ఒకసారి బాగా కలుపుకోవాలి. ఇందులో నుంచి కొద్దికొద్దిగా పిండిముద్దను తీసుకొని నిమ్మకాయంత సైజ్‌లో చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. ఇప్పుడు స్టౌపై కడాయి పెట్టుకొని ఆయిల్ వేసుకొని వేడి చేసుకోవాలి. నూనె వేడయ్యాక ఆ ఉండలను కాగుతున్న నూనెలో వేసి దోరగా వేయించుకోవాలి. అంతే ఘుమఘుమలాడే టేస్టీ అరటి కోలా బాల్స్ రెడీ. వీటిని చట్నీ లేదా సాస్‌తో తింటే సూపర్‌గా ఉంటాయి. ■

ఫోన్ చూస్తూ పడుకుంటున్నారా?

ఫోన్ మన జీవితంలో ఓ భాగమైపోయింది. ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకూ ఫోన్ చేతిలోనే ఉంటున్నది. ఇక పడుకునే ముందు కచ్చితంగా మొబైల్ చూస్తూ పడుకుంటున్నారు. ఇది సర్వసాధారణమైన ప్రక్రియగా మారిపోయింది. పిల్లల నుంచి పెద్దల వరకు పడుకునే ముందు కూడా ఫోన్ చేతిలో ఉండాల్సిందే. కొంతమంది మొబైల్ ఫోన్ పట్టుకుని అలానే నిద్రపోతారు. కొంతమంది అయితే తెల్లారేవరకు మొబైల్ చూసి తెల్లారిన తరువాత పడుకునే వారూ ఉన్నారంటే



ఆశ్చర్యపోనక్కరలేదు. పడుకునే ముందు ఎక్కువ సేపు ఫోన్ చూస్తే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని ఇటీవల ఓ సర్వేలో తేలింది.

అధిక రక్తపోటు

చైనాలోని హెబీ మెడికల్ యూనివర్శిటీకి చెందిన రీసెర్చ్ టీమ్ జరిపిన ఈ స్టడీలో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా, పగటిపూట కంప్యూటర్ ముందు, టీవీ ముందు లేదా వీడియో గేమ్‌లు ఆడటం కంటే రాత్రి పడుకునే ముందు ఫోన్ చూస్తున్నప్పుడు రక్తపోటు ఎక్కువగా ఉంటుందని ఆ అధ్యయనంలో వెల్లడైంది. నిద్రపోతున్నప్పుడు రీల్స్ చూడటం యువకులలో హై బీపీకి కారణమవుతుందని పేర్కొన్నారు.

నిద్ర పట్టదు

రాత్రిపూట కళ్లపై ఎక్కువ నీలిరంగు లైట్లు పడటం వల్ల నిద్ర పట్టదు. దీనివల్ల శరీర బరువు పెరగడం, కంటి చూపు మందగించడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే దీని వల్ల రక్తంలో గ్లూకోజ్ పెరగడం, యూరిక్ యాసిడ్ పెరగడం వంటి సమస్యలు వస్తాయని తెలిసింది.

అలాగే చిన్న పిల్లలు కూడా రాత్రి పడుకునే ముందు మొబైల్ చూడడం వల్ల వారి మెదడు పనితీరుపై ప్రభావం పడుతుందని, నరాలకు సంబంధించిన సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అందుకే రాత్రి పడుకోవడానికి రెండు గంటల ముందే మొబైల్స్ బంద్ చేయడం మంచిది. ■

కులగణన సర్వే తప్పులతడక

(మొదటిపేజి తరువాయి)

కమిషన్ జాబితా ప్రకారం 3.35 కోట్ల మంది ఓటర్లు, 18 ఏండ్లలోపు వారు 25 శాతం మందితో కలుపుకుంటే రాష్ట్ర జనాభా మొత్తం 4 కోట్లపైనే ఉంటుందని తెలిపారు. బీసీలపై కాంగ్రెస్ సర్కారు కుట్రకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని హెచ్చరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కులగణన నివేదిక బోగస్ అని విమర్శించారు. గతంలో బీసీ కమిషన్ ద్వారా కాకుండా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా సర్వే చేయిస్తే కోర్టు కొట్టేసిందనీ, అదే తప్పును మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పారు. 40 శాతం బీసీలను మాయం చేసి 56 శాతంపైన ఉన్న వారిని 46 శాతంగా చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బీసీలెవరూ సంబురాలు చేసుకోలేదనీ, గాంధీభవన్‌లోనే సంబురాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అసెంబ్లీ విప్ కె.పి.వివేకానంద మాట్లాడుతూ ఫిబ్రవరి 4 బడుగు, బలహీన వర్గాలకు చీకటి రోజని విమర్శించారు. మానసిక ఉన్మాదిలా ప్రవర్తించిన సీఎం రేవంత్ రెడ్డి నటనను ఎవరూ నమ్మలేదని కొట్టిపారేశారు. తమ అధినేత కేసీఆర్‌తో చర్చించి బీసీల కోసం ఉద్య మిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే వరకు కాంగ్రెస్‌ను విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.

కుల సర్వేను స్వాగతిస్తున్నాం : బీసీ కమిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి,రాజకీయ, కుల సర్వే- 2024 నివేదికను స్వాగతిస్తున్నామని బీసీ కమిషన్ తెలిపింది. ఈ మేరకు కమిషన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర జనాభాలో 96.9 శాతం సర్వే జరిగిందనీ, 3,56,323 కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదని పేర్కొంది. మొత్తంగా బీసీలు 56.66 గా ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించిన సర్వేలో తేలిందని వివరించింది.బీసీలు ఆశిస్తున్న 42 శాతం రిజర్వేషన్ల కంటే 14.33 శాతం ఎక్కువేనని పేర్కొంది. సర్వే రిపోర్ట్ అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాత బీసీల సంఖ్య తక్కువా? ఎక్కువా? అనే తర్జనభజన కంటే ఏ విధంగా ఆశించిన మేరకు రిజర్వేషన్లు సాధించుకుందామనే విషయంపై దృష్టి పెట్టాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది.

గాజాను స్వాధీనం చేసుకుంటాం

- ఆర్థికంగా అభివృద్ధి చేస్తామంటూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- వేరే దేశాలకు వెళ్లి స్థిరపడాలంటూ సూచనలు

- సరైన ఆలోచనే అన్న నెతన్యాహు
- ఉలిక్కిపడిన మధ్య ప్రాచ్యం
- ఖండించిన హమాస్
- మా భూమి నుంచి మమ్మల్నెలా పంపిస్తారని ప్రశ్న

వాషింగ్టన్, గాజా : ఇజ్రాయిల్ దాడులతో చిన్నాభిన్నమైన గాజా ప్రాంతాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని, అక్కడ అపరిమితమైన సంఖ్యలో ఉద్యోగాలను సృష్టిస్తామని, కొత్తగా ఇళ్లను నిర్మిస్తామని వెల్లడించారు. కాగా ట్రంప్ ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు.

వైట్‌హౌస్‌లో మంగళవారం ఇజ్రాయిల్ ప్రధాని



బెంజామిన్ నెతన్యాహుతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్, గాజాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. గాజా ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మాత్రమే ట్రంప్ చెప్పారు. అక్కడ నివసించడానికి ఎవరిని అనుమతిస్తారనే విషయాలు వెల్లడించలేదు. ప్రస్తుతం గాజాలో నివసిస్తున్న పాలస్తీనియన్లందరూ అక్కడ నుండి వెళ్ళిపోవాలని, మధ్య ప్రాచ్యంలోని ఇతర దేశాల్లో నివసించాలని అన్నారు. గాజాను తమ అధీనంలోకి తీసుకుని, దాడుల కారణంగా ధ్వంసమైన భవనాలన్నింటినీ కూల్చివేసి, పేలని బాంబులను నిర్వీర్యం చేసి, ఇతర ఆయుధాలను అక్కడ నుంచి తొలగించి, ఆ ప్రాంతాన్నంతా శుభ్రపరుస్తామని చెప్పారు. ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టిస్తామన్నారు. అక్కడ నివసించేవారికి ఇండ్లు కూడా నిర్మిస్తామన్నారు. వారికి వేరే ప్రత్యామ్నాయం లేకనే పాలస్తీనియన్లు గాజాకు తిరిగి వెళ్లానుకుంటున్నారని అన్నారు. ప్రమాదకరంగా వున్న భవనాల్లో నివసిస్తూ, అనుక్షణమూ భయం, భయంగా బతుకు వెళ్లదీసే బదులు భద్రత వున్న ఇళ్ళల్లో, మంచి వాతావరణంలో వారు జీవించవచ్చని సూచించారు. గాజాకు అమెరికా బలగాలను పంపే అవకాశం వుందా అని ప్రశ్నించగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గాజాను స్వాధీనం చేసుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నామని, భవిష్యత్‌లో మధ్యప్రాచ్యంలో పర్యటన సందర్భంగా గాజా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియాలను సందర్శిస్తానని ట్రంప్ చెప్పారు. గాజా స్ట్రిప్‌ను మృత్యువు, విధ్వంసాలకు చిహ్నంగా ట్రంప్ అభివర్ణించారు. నరకానికి ప్రవేశద్వారంలా వుందన్నారు. అక్కడ నివసించడం ఏ మాత్రమూ సరికాదన్నారు.

సౌదీ వైఖరిలో మార్పు వుండదు

స్వతంత్ర పాలస్తీనా ఏర్పాడాలన్న తమ సుదీర్ఘ డిమాండ్‌లో ఎలాంటి మార్పు వుండదని, తమ వైఖరి చాలా ధృఢంగా వుందని సౌదీ అరేబియా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మేరకు బుధవారం పదునైన పదజాలంతో కూడిన ప్రకటన జారీ చేసింది. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు కోసం సౌదీ చేస్తున్న కృషి ఆగదని యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ప్రకటిం చారు. అది జరగకుండా ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు ఏర్పాటు చేసుకోబోమని స్పష్టం చేశారు.

ఉలిక్కిపడిన మధ్య ప్రాచ్యం ! నిర్ద్వంద్వంగా తిరస్కరించిన హమాస్

గాజా నుంచి బయటకు వెళ్ళి పాలస్తీనియన్లు నివాసం ఏర్పరచుకోవాలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మధ్య ప్రాచ్యం ఉలిక్కిపడింది. ఇప్పటికే గాజాలో నెలకొన్న పరిస్థితులపై మధ్య ప్రాచ్య దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రంప్ వ్యాఖ్యలు దిగ్భ్రాంతికి గురి చేశాయి. కాగా హమాస్, ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. గాజాలో సాగిన ఊచకోతకు, విధ్వంసానికి ఇజ్రాయిల్‌ను బాధ్యురాలిని చేసి, శిక్షించడానికి బదులుగా ట్రంప్ ఈ రీతిలో మాట్లాడడం చాలా దారుణమని హమాస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో గందరగోళం సృష్టించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని హమాస్ నేత సమీ అబు జుహ్రీ అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు సృష్టించడానికే ట్రంప్ ఈ ప్రకటన చేశారని ఆయన విమర్శించారు.

చరిత్ర మారుతుందన్న నెతన్యాహు

ట్రంప్ ప్రతిపాదనపై నెతన్యాహు స్పందిస్తూ, దీనివల్ల చరిత్ర మారుతుందని భావిస్తున్నామని చెప్పారు. ఈ మార్గాన్ని అనుసరించడం సరైనదేనని భావిస్తున్నానన్నారు. గాజా మరోసారి ఇజ్రాయిల్‌కు ముప్పుగా మారరాదన్నది తమ లక్ష్యమని, ట్రంప్ దాన్ని మరింత పై స్థాయికి తీసుకెళుతున్నారని అన్నారు. అక్కడ నుండి మాపై చాలా దాడులు జరిగాయని, ఈ పరిస్థితుల్లో ట్రంప్ భిన్నంగా ఆలోచిస్తున్నారని అన్నారు. దీనిపై దృష్టి పెట్టాల్సి వుందన్నారు.

'రక్షణ'కే అధిక నిధులు

(మొదటిపేజి తరువాయి)

పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోంది. అక్కడ మౌలిక సదుపాయాలు లేవు. కాలం చెల్లిన పాఠ్యాంశాలతోనే బోధన జరుగుతోంది. లక్షలాది మంది విద్యార్థుల విద్యా నాణ్యత దెబ్బతింటోంది.

విధానాలు ఘనం...అమలు పేలవం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. దేశ జనాభాలో 70 శాతం మంది గ్రామాల్లోనే నివసిస్తున్నప్పటికీ వారికి 40 శాతం ఆస్పత్రి పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నర్సులు, రోగుల నిష్పత్తి కూడా 1:670గా ఉంది. సిఫార్సు చేసిన 1:300 కంటే ఇది చాలా తక్కువ. పేదలు, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ దవాఖానాలు నిధులు, సిబ్బంది, మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలు, తగినంత మంది సిబ్బంది ఉన్నప్పటికీ ఆరోగ్య సేవల ఖర్చు ఎక్కువ కావడంతో అవి లక్షలాది మందికి అందుబాటులో లేవు. దయనీయమైన పరిస్థితి ఏమిటంటే కేటాయించిన నిధులను కూడా ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకోలేకపోతోంది. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే వాస్తవ ఖర్చు తక్కువగా ఉంటోంది. విధానాలు ఘనంగానే ఉంటున్నా వాటి అమలు పేలవంగా ఉంటోంది. కేటాయింపులు కేవలం కాగితాలపై మాత్రమే కన్పిస్తున్నాయి.వాటి ఫలితాలు మాత్రం ఎక్కడా కన్పించడం లేదు. దేశంలో ఆరోగ్య రక్షణ కోసం ప్రజలు చేస్తున్న వ్యయంలో 62.6 శాతం వారి జేబుల నుండి వెచ్చిస్తున్నదే. ఇది ప్రపంచంలోనే అత్యధికం. దేశంలో పేదరికం పెరగడానికి వైద్య బిల్లులు ప్రధాన కారణంగా మారుతున్నాయి. సైన్యాన్ని ఆధునీకరిస్తున్న పాలకులు ఆస్పత్రులను ఎందుకు ఆధునీకరించడం లేదు? మౌలిక సదుపాయాల కల్పనలో ఎందుకు తాత్సారం చేస్తున్నారు?దేశం యొక్క బలాన్ని రక్షణ బడ్జెట్లను చూసో లేదా జీడీపీ గణాంకాలను చూసో అంచనా వేయలేమన్న విషయాన్ని ప్రజలందరూ గుర్తించాల్సి ఉంది. ప్రజల సామర్థ్యాన్ని బట్టే దానిని అంచనా వేయాల్సి ఉంటుంది. విద్య, ఆరోగ్య రంగాలకు పుష్కలంగా నిధులు కేటాయించి వాటిని సక్రమంగా ఖర్చు చేసినప్పుడే ప్రయోజనాలు పొందగలం. ప్రజలకు ఆరోగ్యం, నైపుణ్యం, సాధికారత కల్పించినప్పుడే దేశం సౌభాగ్యవంతం అవుతుంది.

దవాఖానాల్లో పడకల కొరత

ఇక ఆరోగ్య రంగం విషయానికి వస్తే దీనికి కేటాయింపులు పెరుగుతున్నాయన్న వాదనలో పాక్షికంగానే వాస్తవం ఉంది. 2015-16లో ఆరోగ్య రంగానికి రూ.33,152 కోట్లు కేటాయించగా 2025-26లో రూ.95,957 కోట్లు కేటాయించారు. అంటే వంద శాతానికి పైబడి పెరిగిందన్న మాట. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? కేటాయింపులు ఘనంగా ఉన్నప్పటికీ ఆస్పత్రుల్లో చాలినన్ని పడకలు లేవు. ప్రతి వెయ్యి మందికి కేవలం 1.4 పడకలు మాత్రమే ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన 3.5 పడకల కంటే ఇది బాగా తక్కువ. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ప్రతి వెయ్యి మందికీ అక్కడ 0,79 పడకలు మాత్రమే ఉన్నాయి. అంటే దేశానికి ఇంకా 24 లక్షల పడకలు అవసరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం వైద్యుడు, రోగుల నిష్పత్తి 1:1000 ఉండాల్సి ఉండగా అది 1:1511గా ఉంది.

ఢిల్లీ కింగ్ ఎవరు..?

(మొదటిపేజి తరువాయి)

63.83 శాతం పోలింగ్ జరగగా, అత్యల్పంగా సౌత్ ఈస్ట్ ఢిల్లీలో 53.77 శాతం పోలింగ్ నమోదైంది. ఈస్ట్ ఢిల్లీలో 58.98 శాతం, న్యూఢిల్లీలో 54.37 శాతం, షాదారాలో 61.35 శాతం, సౌత్ ఢిల్లీలో 55.72 శాతం, నార్త్ ఢిల్లీలో 57.24 శాతం, వెస్ట్ ఢిల్లీలో 57.42 శాతం, సెంట్రల్ ఢిల్లీలో 55.24, సౌత్ వెస్ట్ ఢిల్లీలో 58.86 శాతం, నార్త్ వెస్ట్‌లో 58.05 శాతం పోలింగ్ జరిగింది. సీలంపూర్, జాంగ్‌పుర, కస్తూర్బా నగర్‌లో నకిలీ ఓట్లు పోలవుతున్నాయంటూ ఆరోపణలు రావడంతో అధికారులు, పోలీసు యంత్రాంగం అప్రమత్త మయ్యాయి. పార్టీల ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని నిర్ధారించడం తో పరిస్థితి సద్దుమణిగింది.ఈ ఎన్నికల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్ కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక తదితారులు ఓటు వేశారు.

కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకూ పోరాడుదాం

(మొదటిపేజి తరువాయి)

సబ్సిడీలో కోత విధించొద్దనీ, రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలనీ, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలనీ, వ్యవసాయ మార్కెట్ సవరణ ముసాయిదాను రద్దు చేయాలనీ, తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టీ.సాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, ఏఐటీయూసీ నాయకులు ప్రేమ్ పావని, ఐఎన్‌టీయూసీ నాయకులు నాగన్న గౌడ్, బీఆర్ఎస్కేవీ నాయకులు రాంబాబు, టీయూసీఐ నాయకులు సూర్యం, ఐఎఫ్టీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, యూటీయూసీ నాయకులు భరత్, రైతు సంఘాల నాయకులు మామిడాల బిక్షపతి, భాస్కర్ మాట్లాడారు. 2025-26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 11 సంవత్సరాల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోక పోవడం మోసం చేయడమేనని అన్నారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసగించిందన్నారు. రైతు రుణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ చట్టానికి నిధుల పెంపును విస్మరించిందని తప్పుపట్టారు. విద్యుత్‌రంగ సంస్కరణలతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీమా రంగంలో ఎఫ్‌డీఐలు 74 శాతం నుంచి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమే. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రయివేటీకరించి, ఖనిజ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు బరితెగించింది. కార్మికవర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్‌ల రద్దుకు, కనీస వేతనం రూ.26 వేల డిమాండ్, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్న డిమాండ్, అసంఘటిత కార్మికుల సంక్షేమం వంటి అంశాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్య. వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం, అధికస్థాయి నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం, అసమానతలు, ప్రయివేటు పెట్టుబడుల పెంపు వంటి ఆర్థిక పరిస్థితుల నేపథ్యానికి అనుగుణంగా 2025-26 బడ్జెట్ రూపకల్పన చేయకపోవడం కొనుగోలు శక్తి క్షీణతకు దారితీస్తుంది. ఈ బడ్జెట్ సాధారణ ప్రజలు, కార్మికవర్గంపై రానున్న రోజుల్లో మరిన్ని భారాలు మోపి ఉపాధి కల్పన స్థాయిలను మరింత క్షీణింపజేస్తుంది. అదే సమయంలో సంపద పన్ను 3 శాతానికి తగ్గించి మధ్యతరగతిపై ఆదాయపు పన్ను విధింపు ధనవంతులకు లబ్ధి చేకూర్చడమే. పెన్షన్ రంగానికి నిధులు పెంచకపోవడం అన్యాయం అని వారు విమర్శించారు. స్థూలంగా 10 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, సంపన్నుల ప్రయోజనాలే ప్రాధాన్యతనిచ్చి ప్రవేశపెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకు ఐక్యంగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేష్, జయలక్ష్మి, ఈశ్వరరావు, కూరపాటి రమేష్, పద్మశ్రీ, రైతు సంఘం నాయకులు సంధ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బొప్పని పద్మ, కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



'తండేల్' మ్యాజిక్‌ని మీరూ చూస్తారు

- నాగచైతన్య

'నాకు ఎప్పటి నుంచో రియల్ లైఫ్ స్టోరీస్ ఆధారంగా సినిమాలు చేయాలని ఉండేది. పైగా ఇది మన తెలుగోళ్ళ కథ. ఈ కథ నాకెంతో స్ఫూర్తిని ఇచ్చింది. రూటెడ్‌గా ఉండే కథలు చేయడానికి బాగా ఇష్టపడతాను. ఆ ఇష్టంతోనే చాలా కష్టమైనప్పటికీ 'తండేల్' చేశాను' అని హీరో నాగ చైతన్య చెప్పారు.

నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో నాగచైతన్య బుధవారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

నా కెరీర్‌లో భారీ బడ్జెట్ సినిమా

నా కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ ప్రొడక్షన్, హై బడ్జెట్ మూవీ. అన్ని రకాలుగా బిగ్ స్పాన్ ఉంది. ఇప్పటికే సినిమా చూశాం. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సెకండ్ హాఫ్ అయితే యునానిమస్‌గా చాలా బాగా చెప్పారు. నాకు కూడా ఎమోషనల్ హై ఇచ్చింది. చివరి ముప్పై నిమిషాలు వెరీ శాటిస్ఫాక్షన్. క్లైమాక్స్ గ్రేట్ ఎమోషనల్ హై ఇస్తుంది.

ఆ ఛాన్స్ కనిపించింది..

ఈ కథలో రియల్ లైఫ్ క్యారెక్టర్ దొరికింది. యాక్టర్‌గా నెక్స్ట్ స్టెప్‌కి వెళ్ళే అవకాశం కనిపించింది. దాదాపు 8 నెలలు స్క్రిప్ట్, నా ట్రాన్స్‌ఫర్మేషన్ మీదే ఉన్నాను. శ్రీకాకుళం యాస కోసం శిక్షణ తీసుకున్నాను. నేను చేసిన రాజు పాత్ర ఓ ఫైటర్. జైల్లో ఉనప్పుడు బాధని ఓర్చుకొని తన వారికోసం ఎలా పోరాటం చేశాడు?, ఎలా బయటికి వచ్చాడనేది చాలా గొప్పగా ఉంటుంది. తన ప్రేమకథే తనకి బలాన్ని ఇస్తుంది. నటుడిగా నాకు బాగా సంతృప్తినిచ్చిన సినిమా. 'తండేల్' మ్యాజిక్‌ని మీరూ చూస్తారు (నవ్వుతూ).

నాకు డబుల్ ధమకా..

డైరెక్టర్ చందుతో నాకు ఇది మూడో సినిమా. నన్ను కొత్తగా ప్రజెంట్ చేయడానికి ప్రయత్నించాడు. ఇది అవుట్ అండ్ అవుట్ లవ్ స్టోరీ. లవ్ స్టోరీ వెనుక మిగతా లేయర్స్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటాయి. సాయి పల్లవి ఫెంటాస్టిక్ యాక్టర్. క్యారెక్టర్‌ని డీప్‌గా అర్థం చేసుకుంటుంది. దేవిశ్రీ ఇచ్చిన పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. ఈ కథ గీతా ఆర్ట్స్‌లో ఉండటం, అరవింద్, బన్నీవాసుతో మళ్ళీ కలిసి పనిచేయడాన్ని డబుల్ ధమాకాగా ఫీలవుతున్నాను.

కథే హీరోగా సినిమాలు తీస్తా..



శింగనమల రమేష్‌బాబు

'నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా మీద ప్యాషన్‌తో నిర్మాతగా మారాను. అయితే మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని నాపై కేసు పెట్టారు. 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశాను. అది తప్పుడు కేసు అని న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. తప్పుడు కేసులు కోర్టు ముందు నిలబడవు. నా న్యాయపోరాటం గెలిచింది' అని నిర్మాత శింగనమల రమేష్ బాబు అన్నారు. పవన్‌కళ్యాణ్, మహేష్‌బాబుతో 'కొమరంపులి', 'ఖలేజా' లాంటి భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించిన ఆయన ఓ కేసు నిమిత్తం 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు ఇటీవల ఆయన్ని నిర్దోషిగా తేల్చి, కేసు కొట్టి వేసింది. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం మీడియాతో సంభాషించారు.

- నాపై కేసు పెట్టిన వారిపై నాకు ఎలాంటి కక్ష సాధింపులు లేవు. ఏదైనా న్యాయపరంగానే పోరాటం చేస్తా.
- సినిమా నాకు తల్లి లాంటిది. భవిష్యత్తులోనూ ఇదే రంగంలో కొనసాగుతా. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిద్దరూ హీరోలుగా చేశారు. హిట్స్ అందుకున్నారు. ఇప్పుడు డైరెక్షన్ చేయాలని అనుకుంటున్నారు. నేను కూడా మంచి కథాబలం ఉన్న సినిమాలను నిర్మాతగా నిర్మిస్తా. అలాగే ఇతర సినిమాలకు ఫైనాన్షియర్‌గానూ చేస్తాను.
- అప్పట్లో సినిమాలు ఆరు నెలలు లేదా సంవత్సరంలోగా పూర్తయ్యేవి. కానీ నా దురదృష్టం కొద్ది నేను తెరకెక్కించిన రెండు పెద్ద హీరోల చిత్రాలు దాదాపు మూడేళ్ల సమయం చిత్రీకరణలోనే గడిచిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఆ రెండు చిత్రాలకు రూ.100 కోట్ల వరకూ నష్టపోయా.
- మేము సంపాదించింది ఫైనాన్స్ బిజినెస్ వల్లే. నాన్న నుంచి అది నాకు వచ్చింది. అయితే సినిమా మేకింగ్ అనేది ఎప్పటికీ ఓ జూదమే. ఆ గ్యాంబ్లింగ్ కారణంగానే నాకు రెండు సినిమాల్లో వందకోట్లు పోయింది. ఆ టైమ్‌లోనే కాదు జైలుకి వెళ్ళినప్పుడు కూడా ఏ హీరో కూడా నన్ను పలకరించలేదు. అయితే ప్రజెంట్ సినిమా నిర్మాణం బావుందని వింటున్నాను. నిర్మాతకు పది రూపాయలు మిగులుతాయని అంటున్నారు. అయితే 24 క్రాఫ్ట్ మన గ్రిప్‌లో ఉన్నప్పుడే సినిమా తీయాలి. ఇదే నా జర్నీలో నేర్చుకున్న గుణపాఠం. త్వరలో ఓ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ ఉండే అవకాశం ఉంది.

నవచిత్రం



వైవిధ్య ప్రేమకథా చిత్రం

హీరో కావాలన్న తన తనయుడు మారిశెట్టి అఖిల్ కలను నెరవేరుస్తూ అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయవేత్త, మారిశెట్టి శ్రీకాంత్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

భానుశ్రీ హీరోయిన్‌గా శ్రీధన్ దర్శకత్వంలో ఎ.కె.టెక్ మార్కెటింగ్ మూవీ క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ మంగళవారం సాయంత్రం అనకాపల్లి జిల్లా, చోడవరం మండలంలోని నిర్మాత సొంత గ్రామమైన లక్ష్మీపురంలోని రామాలయంలో ప్రారంభమైంది.

ఈ చిత్ర ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నట్టి కుమార్ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'అనకాపల్లి రాజకీయాలలో మంచి పేరున్న మారిశెట్టి శ్రీకాంత్ తన కుమారుడి ఆసక్తిని గమనించి, సినిమా నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయం' అని అన్నారు.

'ఈ సినిమా చిత్రీకరణ అనకాపల్లి చుట్టు పక్కల ఐదు రోజులపాటు జరుగుతుంది. ఇందులో భాగంగా ఒక పాట, ఒక ఫైట్ చిత్రీకరణ జరుపుతాం. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితర ప్రదేశాలలో షూటింగ్ చేస్తాం. త్వరలోనే మరిన్ని వివరాలను తెలియజేస్తాం' అని నిర్మాత మారిశెట్టి శ్రీకాంత్ చెప్పారు.




మారిశెట్టి అఖిల్, భానుశ్రీ

హీరో మారిశెట్టి అఖిల్ మాట్లాడుతూ, 'మొదట్నుంచి నాకు సినిమా రంగమంటే ఎనలేని మక్కువ. హీరో కావాలన్న నా అభిరుచికి మా నాన్న మద్దతు పలికారు. దాంతో నా నటనకు మెరుగులు దిద్దుకునేందుకు అన్నపూర్ణ ఫిలిం యాక్టింగ్ స్కూల్‌లో నటనలో శిక్షణ పొందాను. తప్పకుండా ఈ తొలి చిత్రం నా కెరీర్‌ను మలుపు తిప్పుతుందని భావిస్తున్నాను. మంచి కథతో రూపొందుతున్న ఈచిత్రంలో నాపాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది' అని అన్నారు.

దర్శకుడు శ్రీధన్ మాట్లాడుతూ, 'ఇదొక భిన్న ప్రేమకథ చిత్రం. హర్రర్, కామెడీ అంశాలతో దీన్ని తెరకెక్కించబోతున్నాం. కథానుగుణంగా ఈచిత్రాన్ని మా నిర్మాత ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తున్నారు. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని తెలిపారు.

అన్నీ అవాస్తవాలే !

పేదరికంపై పస లేని ప్రభుత్వ వాదనలు



కాలదోషం పట్టిన గణాంకాలతో కాకమ్మ కబుర్లు

తాజా నివేదికలో బయటపడ్డ బండారం

న్యూఢిల్లీ : 2022-23 సంవత్సరానికి సంబంధించి గత సంవత్సరం విడుదలైన కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) నివేదిక దేశంలోనెలకొన్న పేదరికంపై మరోసారి చర్చకు తెర లేపింది. నివేదిక విడుదల సందర్భంగా నిటి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ జనాభాలో పేదరిక హెడ్‌కౌంట్ నిష్పత్తి బాగా తగ్గి 5 శాతంగా నమోదైందని చెప్పుకొచ్చారు. ద్రవ్యోల్బణానికి సంబంధించి సవరించిన 2011-12 దారిద్ర్య రేఖను ఆధారంగా చేసుకొని ఆయన ఈ వాదన చేశారు. ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు, వేగవంతమైన ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని సుబ్రమణ్యం ఈ విజయాన్ని ఆపాదించుకున్నారు. అయితే రంగరాజన్ అనుసరించిన పద్ధతిని, 2022-23 హెసీఈఎస్ సమాచారాన్ని ఉపయోగించి సీపీ సేతు, ఎల్వీ అభినవ్ సూర్య, సీపీ రుతు ఓ విశ్లేషణ జరిపారు. దీని ప్రకారం భారతీయుల్లో 26.4 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి, దీనికి మధ్య 21 పర్సంటేజ్ పాయింట్ల వ్యత్యాసం కన్పిస్తోంది.

ప్రభుత్వ వాదనలో కచ్చితత్వం ఏది?

తాజా విశ్లేషణ ప్రకారం దేశ జనాభాలో 27.4 శాతం మంది గ్రామీణ ప్రాంతా ల్లో ఉన్నారు. వీరి తలసరి ఆదాయం నెలకు రూ. 2,515గా నిర్ధారించారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే 23.7 శాతం జనాభా తలసరి ఆదాయం రూ.3,639. ఇది దారిద్ర్యరేఖకు దిగువన ఉంది. పేదరికాన్ని దాదాపుగా నిర్మూలించామంటూ ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలకు ఇది విరుద్ధంగా ఉంది.



ప్రభుత్వ గణాంకాల కచ్చితత్వం, వాటి ఉద్దేశంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పేదరికాన్ని అంచనా వేయడంలో వేర్వేరు పద్ధతు లను పాటించడం కూడా ఈ తేడాకు కారణంగా కన్పిస్తోంది. అయితే ఆహారేతర అత్యవసరాల వ్యయాన్ని...ముఖ్యంగా ఆరోగ్య రక్షణ, విద్య, గృహనిర్మాణం...పాత దారిద్ర్యరేఖలు గుర్తించలేకపోయాయి. దీనికి భిన్నంగా రంగరాజన్ పద్ధతి తాజా నిబంధనలను ఉపయోగించింది. అత్యవసరమైన ఆహారేతర ఖర్చులు సహా మరింత సవివరమైన వినియోగ వస్తువుల సమాచారాన్ని వాడుకుంది. దీంతో ప్రస్తుత వాస్తవికతలను కచితత్వంతో ప్రతిబింబించింది.

తప్పుల తడకగా టెండుల్కర్ నివేదిక

2009లో ఏర్పాటు చేసిన టెండుల్కర్ కమిటీ తలసరి వినియోగ వ్యయం ఆధారంగా పేదరికాన్ని అంచనా వేసింది. అయితే దారిద్ర్యరేఖలను బాగా తక్కువగా నిర్ధారించి విమర్శల పాలైంది. పేదరిక స్థాయిలను అది సరిగా ఊహించలేకపోయింది. ఈ లోపాలను రంగరాజన్ కమిటీ సరిదిద్దింది. ఈ కమిటీ 2014లో తన నివేదికను సమర్పించింది. పేదరికాన్ని నిర్వచించేందుకు అది ఓ కొత్త పద్ధతిని సూచించింది. ఆహార వినియోగం, అత్యవసర ఆహారేతర ఖర్చులు, ఇతర ఖర్చులు వంటి ప్రధానమైన మూడు అంశాలను అందులో చేర్చింది. టెండుల్కర్ కమిటీతో పోలిస్తే రంగరాజన్ కమిటీ అంచనాలు అధిక దారిద్ర్యరేఖను చూపాయి. 2011-12లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిని టెండుల్కర్ 21.9 శాతంగా చూపితే రంగరాజన్ 29.5 శాతంగా చూపారు. అయితే ఎన్ని సవరణలు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం రంగరాజన్ కమిటీ సిఫారసులను అధికారికంగా అమలు చేయలేదు. మరో సర్వే సమాచారం ఏదీ అందుబాటులో లేకపోవడంతో అప్పటి నుండీ పేదరిక అంచనాలు అలాగే ఉండిపోయాయి.

వాస్తవాలకు భిన్నంగా...

2011-12లో చివరిసారిగా వినియోగ వ్యయ సర్వే జరిగింది. అదే ఆ తర్వాతి పేదరిక అంచనాలకు, హెచ్‌సీఈఎస్ 22-23కి ప్రాతిపదిక అయింది. కాబట్టి పేదరికానికి సంబంధించిన హెడ్‌కౌంట్ నిష్పత్తులు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. హెచ్‌సీఈఎస్ 22-23 విడుదల తర్వాత ప్రభుత్వం చేసిన వాదనల్లో పస లేదని దీంతో అర్థమవుతోంది. వాస్తవానికి నిత్యావసర వస్తువులు, సేవల కోసం పేదలు అధిక వ్యయం చేస్తున్నారు. విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం వంటి మౌలిక వసతులకూ దూరంగా ఉంటూ అసమానతల మధ్య జీవితాలు గడుపుతున్నారు. మరోవైపు ప్రజా పంపిణీ వ్యవస్థ వంటి కార్యక్రమాలు పేదరికాన్ని తగ్గించలేకపోయాయి. ఉదాహరణకు ఆరోగ్య విద్యా రంగాలను ప్రయివేటీకరించడంతో అవి పేదలకు భారంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలు స్థిరంగా ఉండిపోయాయి. అసంఘటిత రంగంలో ఆదాయాలు పడిపోయాయి. అనేక పరిశ్రమలు మూతపడ్డాయి.

మెరిసిన మోహిత్

హైదరాబాద్ : హైదరాబాద్‌కు చెందిన టీఎస్ఆర్ మోహిత్..దేశవాళీ టోర్నీ రంజీల్లో అదరగొట్టాడు. ప్రస్తుత సీజన్‌లో అరుణాచల్‌ప్రదేశ్ తరఫున బరిలోకి దిగిన మోహిత్ ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌కు తోడు బ్యాటింగ్‌తో జట్టు విజయాల్లో కీలకంగా వ్యవహరించాడు. ఆఫ్ స్పిన్ మాయాజాలంతో ఈ సీజన్‌లో 16 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అహ్మదాబాద్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో మోహిత్ 3/89, 6/38 అదుతే ప్రదర్శన కనబరిచి కెరీర్ బెస్ట్ నమోదు చేసుకున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలోనూ మోహిత్ సత్తాచాటాడు. మణిపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.



ఆటలు



బోణి కొట్టేదెవరో..!

- నేడు భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి వన్డే
- మధ్యాహ్నం 1.30 గంటల నుంచే





నాగ్‌పూర్ : భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య నాగ్‌పూర్ వేదికగా తొలి వన్డే జరగనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగే తొలి వన్డేలో ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే భారతజట్టు తలపడనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో నిరాశపరిచిన సీనియర్ ఆటగాళ్ళ రోహిత్, కోహ్లిలకు ఈ సిరీస్ కీలకం కానుంది. స్వదేశీ పిచ్‌లపై సత్తా చాటి ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగాలని వీరు ఉవ్విళ్ళూరుతున్నారు. ఐసిసి వన్డే ప్రపంచకప్ తర్వాత ఆగస్టులో శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ ఆడేందుకు వెళ్లిన భారతజట్టులో ఉన్న కోహ్లి ఆ మూడు వన్డేల్లో కేవలం 58పరుగులు మాత్రమే కొట్టాడు. కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రమే 157పరుగులే చేశాడు. పేస్ భారాన్ని జస్ప్రీత్ బుమ్రా స్థానంలో మహ్మద్ షమీ అందుకోనున్నాడు. అతడు దాదాపు 16నెలల తర్వాత వన్డేల్లో మళ్లీ పునరాగమనం చేయనున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియాకు ఇదే ఆఖరి వన్డే సిరీస్ కావడంతో వీరి ప్రదర్శనపైనే అందరి దృష్టి నెలకొని ఉంది.

ఇంగ్లండ్ జట్టులో జో రూట్‌కు చోటు :

భారత్‌తో తొలి వన్డేకు ముందురోజే ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసిబి) తమ తుది జట్టును బుధవారం ప్రకటించింది. జోస్ బట్లర్ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. మాజీ సారథి జో రూట్‌కు తొలి వన్డే జట్టులో చోటు దక్కింది. దీంతో అతడు దాదాపు 16 నెలల తర్వాత తొలిసారిగా వన్డే ఫార్మాట్ బరిలో దిగనున్నాడు. ఓపెనర్లుగా బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ తమ స్థానాలను పదిలం చేసుకోగా.. జో రూట్ వన్‌డౌన్‌లో ఆడనున్నాడు. కెప్టెన్ బట్లర్ ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో లియామ్ లివింగ్‌స్టోన్-జాకోబ్ బెతెల్ జోడీ కొనసాగనుంది. బట్లర్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు గత రెండు వన్డే సిరీస్‌లను కోల్పోయింది. ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్ల చేతిలో ఓటమిపాలైంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ ఇంగ్లండ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన బ్రెండన్ మెకల్లమ్‌కు ఈ సిరీస్ కీలకం కానుంది.ఈ సిరీస్‌కు ముందు భారత్‌తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌ను ఇంగ్లండ్ జట్టు 1-4తో కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇంగ్లండ్ జట్టు కనీసం వన్డే సిరీస్‌లోనైనా సత్తా చాటాలన్న దృఢ నిశ్చయంతో బరిలోకి దిగుతోంది.

ఛాంపియన్స్ ట్రోఫీకి నితిన్ మీనన్ దూరం :

ఐసిసి ఎలైట్ ప్యానెల్ అంపైర్స్, భారత్‌కు చెందిన నితిన్ మీనన్ ఛాంపియన్ ట్రోఫీకి దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాల రీత్యా తాను ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉండడం లేదని ట్విటర్ వేదికగా ఐసిసికి లేఖ రాశాడు. ఐసిసి 15మంది అధికారుల జాబితాను ప్రకటించగా.. అందులో 12మంది అంపైర్లు, ముగ్గురు రిఫరీలు ఉన్నారు. పాకిస్తాన్‌లోని కరాచీ, రావల్పిండి, లాహోర్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుండగా.. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న జరిగే తొలి మ్యాచ్‌తో ప్రారంభమై.. మార్చి 9న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది.

జట్లు(అంచనా) :

భారత్ : రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కెఎల్ రాహుల్, కోహ్లి, పంత్(వికెట్ కీపర్), సుందర్/వరుణ్ చక్రవర్తి, శ్రేయస్, హార్దిక్, అక్షర్/జడేజా, షమీ, అర్ష్‌దీప్.

ఇంగ్లండ్ : బట్లర్(కెప్టెన్), డకెట్, సాల్ట్(వికెట్ కీపర్), రూట్, బ్రూక్, లివింగ్ స్టోన్, బెథెల్, కార్సే, ఆర్చర్, రషీద్, మహమూద్.

అభిషేక్, తిలక్ కెరీర్ బెస్ట్ ర్యాంక్

- బ్యాటర్ల జాబితాలో రెండు, మూడు స్థానాల్లోకి...
- ఐసీసీ టి20 ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ప్రకటించిన తాజా టి20 ర్యాంకింగ్స్‌లో భారత యువ బ్యాటర్ అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, కెరీర్‌లో తొలిసారిగా అత్యుత్తమ స్థానానికి ఎగబాకారు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టి20లో అభిషేక్ శర్మ సెంచరీ, రెండో టి20లో తిలక్ వర్మ అర్ధసెంచరీలతో రాణించారు. దాంతో అభిషేక్ శర్మ ఐసిసి ర్యాంకింగ్స్‌లో ఒకేసారి 38 స్థానాలు ఎగబాకి.. రెండో స్థానానికి చేరుకున్నాడు. అప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న టీమిండియా బ్యాటర్ తిలక్ వర్మ మూడో స్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 855 రేటింగ్ పాయింట్లతో టీ20 నెంబర్ బ్యాటర్‌గా ట్రావిస్ హెడ్ కొనసాగుతుండగా.. అభిషేక్ శర్మ 829 పాయింట్లతో రెండోస్థానం, తిలక్ వర్మ 803 రేటింగ్ పాయింట్లతో మూడోస్థానం, ఫిల్ సాల్ట్ 798 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 738 రేటింగ్ పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆ తర్వాత జోస్ బట్లర్, బాబర్ అజామ్, పాతుమ్ నిస్సాంక, మహ్మద్ రిజ్వాన్, కుశాల్ పెరెరా ఉన్నారు. అభిషేక్ శర్మ తొలిసారిగా కెరియర్‌లోనే తొలిసారిగా నెంబర్ 2కి చేరడంతో రెండు నుంచి 9వ ర్యాంక్ వరకు ప్రతి క్రికెటర్ ఒక్కో ర్యాంకులు దిగజారాయి. ఇదిలా



ఉండగా.. మరో టీమిండియా యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ మూడో స్థానాలు కోల్పోయి టాప్10లో చోటు దక్కించుకోలేకపోయాడు. జైస్వాల్ ప్రస్తుతం 12వ ర్యాంకులో ఉన్నాడు. ఇక టి20 బౌలర్ల ర్యాంకింగ్‌లో వరుణ్ చక్రవర్తి తన ర్యాంకును మెరుగుపరుచుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన వరుణ్.. మూడు స్థానాలు ఎగబాకి కెరీర్ అత్యుత్తమ రెండోస్థానంలో ఉన్నాడు. వరుణ్ 705 పాయింట్లతో 2వ స్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్‌కు చెందిన అకిల్ హుస్సేన్ 707 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. హసరంగా నాలుగో స్థానంలో, ఆడమ్ జంపా ఐదో స్థానంలో, భారత బౌలర్ రవి బిష్ణోయ్ ఆరో స్థానంలో ఉన్నాడు. టాప్-10లో ముగ్గురు భారత బౌలర్లు ఉన్నారు. వరుణ్, బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు. అర్ష్‌దీప్ ఒక స్థానం దిగజారి.. తొమ్మిదో ప్లేస్‌కి పడిపోయాడు. అక్షర్ పటేల్ 11వ స్థానం నుంచి 13వ స్థానానికి పడిపోయాడు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886